40 రోజుల్లో 70 సార్లు చోరీ




2


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - ఆదివారం 28 జూన్ 2026 | సంపుటి: 10 | సంచిక: 173 | పేజీలు:12 | వెల రూ.5


ఇంట్లో చెప్పడం కంటే చంపడమే ఈజీ




2


HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## సీషెల్స్‌లో 'జొనాథన్'తో మోడీ భేటీ

**సానిబెల్ ఐస్‌లాండ్, జూన్ 27:** మూడు రోజుల పర్యటన నిమిత్తం ప్రధాని నరేంద్ర మోడీ సీషెల్స్‌కు వెళ్లారు. పర్యటనలో భాగంగా ప్రపంచంలోనే అత్యంత వృద్ధ జీవి 'జొనాథన్'ను కలవనున్నారు. సీషెల్స్ నేషనల్ బొటానికల్ గార్డెన్లో ఉన్న జొనాథన్ అనే తాబేలు వయసు 193 ఏళ్లు. ఈ తాబేలును సందర్శించిన అనంతరం మోదీ బొటానికల్ గార్డెన్లో మొక్కను నాటనున్నారు. సీషెల్స్ జాతీయ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనడానికి మోడీని గౌరవ అతిథిగా ఆహ్వానించారు. భారత్-సీషెల్స్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా అక్కడ స్మారకోత్సవాలు సైతం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే మోడీ ఆ దేశ పర్యటనకు వెళ్లారు. గిన్నిస్ వరల్ రికార్డ్స్ ప్రకారం.. 'జోనాథన్'ప్రపంచంలోనే అత్యంత వృద్ధ తాబేలు. 1832లో జన్మించింది. ఈ తాబేలుకు 50 ఏళ్ల వయసు ఉన్నప్పుడు 1882లో సెయింట్ హెలెనా ద్వీపానికి తీసుకొచ్చారు. ప్రస్తుతం అది సీషెల్స్ నేషనల్ బొటానికల్ గార్డెన్లో ఉంటోంది. 193ఏళ్ల వయసులోనూ జోనాథన్ మంచి ఆరోగ్యంతో ఉందని అక్కడి అధికారులు వెల్లడించారు.



## విలయంలో 18 రోజుల మృత్యుంజయురాలు

**కారకస్, జూన్ 27:** కొన్ని సెకన్ల విలయం ఎన్నో కుటుంబాల భవిష్యత్తును చిదిమేసింది. అదే సమయంలో.. ఓ కన్నతండ్రి గుండె మాత్రం మళ్లీ కొట్టుకుంది. తల్లి కౌగిలి లేకపోతే క్షణం ఉండలేని పసికందు.. శిథిలాల అడుగున పడిపోయింది. చివరకు సజీవంగా కనిపించి.. వెనెజువెలా పెనువిపత్తులో మృత్యువును జయించింది. ఆ చిన్నారిని బయటకు తీస్తున్నప్పుడు వినిపించిన కేరింతలు ఆ ప్రాంతాన్ని ఉద్విగ్నంగా మార్చాయి.

వెనెజువెలాలో బుధవారం సాయంత్రం క్షణాల వ్యవధిలో జంట భూకంపాలు రావడంతో వందల భవనాలు కుప్పకూలాయి. దాంతో వేలాదిమంది శిథిలాల కింద చిక్కుకుపోయారు. ఓ ప్రాంతంలో 18 రోజుల పసికందు తల్లితో సహా శిథిలాల కింద చిక్కుకుపోయింది. తన భార్య, బిడ్డ అసలు బతికున్నారో లేదో తెలియక వారికోసం వెతుకుతూ తండ్రి తల్లడిల్లాడు. అక్కడ రెస్క్యూ సిబ్బంది ఒక్కో సిమెంట్ దిబ్బను తొలగిస్తుంటే.. ఆ తండ్రి గుండె వేగంగా కొట్టుకోసాగింది.



చివరకు ప్రయత్నం ఫలించి రోజుల బిడ్డ ప్రాణాలతో కనిపించింది. ఆ బిడ్డను వస్త్రంలో చుట్టి ఎంతో అపురూపంగా తండ్రికి అందించడంతో ఆయన గుండె మళ్లీ కొట్టుకున్నట్లయింది. చిన్నగాయం లేకుండా పాలకోసం ఎదురుచూస్తున్న ఆ బిడ్డను చూసి ప్రతి ఒక్కరి ముఖాల్లో చిరునవ్వులు కనిపించాయి. ఒకవైపు బిడ్డ దొరికిందన్న ఆనందం.. మరోవైపు భార్య పరిస్థితి ఎలా ఉందో తెలియని పరిస్థితి. చివరకు 90 నిమిషాల తర్వాత ఆ తల్లి కూడా సజీవంగా ఉందన్న వార్త వినిపించింది. దాంతో అతడు ఊపిరి పీల్చుకున్నాడు.

# తగ్గం...తలొగ్గం

- వీబీజీ రామ్‌జీ చట్టంపై మంత్రుల ఆగ్రహం
- రైతులకు నష్టం చేస్తే సహించం
- సమరానికి సర్కార్ సిద్ధం
- కర్ణాటక,కేరళతో కలిసి పోరాటం
- 'సుప్రీం'ని ఆశ్రయించి తీరుతం
- జులై 2న జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తం
- మంత్రులు ఉత్తమ్,తుమ్మల,సీతక్క

హైదరాబాద్,జూన్ 27(మనం,ప్రత్యేక ప్రతినిధి): తెలంగాణ రైతులు, వ్యవసాయ కూలీలకు నష్టం చేసే చట్టానికి తలవంచేది లేదని, వీబీ-జీ రామ్ జీ చట్టాన్ని యథాతథంగా అంగీకరించేది లేదని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. వీబీ-జీ రామ్‌జీ చట్టంపై ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన శనివారం కేబినెట్ సబ్ కమిటీ ప్రజాసంఘాల ప్రతినిధులతో సచివాలయంలో సమావేశమైంది. మంత్రి సీతక్క సమావేశానికి హాజరుకాగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ కేరళం, కర్ణాటకతో పాటు ఇతర రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి పోరాటం చేస్తామని, అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశం ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. రైతులు, వ్యవసాయ కూలీలకు నష్టం చేసే ఈ చట్టానికి తెలంగాణ ప్రభుత్వం తలవంచేది లేదని, అవసరమైతే ప్రత్యేక రాష్ట్ర ఉపాధి హామీ పథకం తీసుకొస్తామని స్పష్టం చేశారు. జులై 2న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సమగ్రంగా చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన వెల్లడించారు.మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ రాష్ట్రాల అధికారాలను హరిస్తున్న వీబీ-జీ రామ్ జీ చట్టం సమాఖ్య స్ఫూర్తిపై జరుగుతున్న ప్రత్యక్ష దాడిగా ఉత్తమ్ కుమార్ రెడ్డి అభివర్ణించారు. గ్రామీణాభివృద్ధిపై రాష్ట్రాల పాత్రను నిర్వీర్యం చేయాలనే ఉద్దేశంతోనే కేంద్రం ఈ చట్టాన్ని తీసుకొస్తోందని మంత్రి ఆరోపించారు. కర్ణాటక, కేరళం ముఖ్యమంత్రులను సంప్రదించి ఉమ్మడి న్యాయపరమైన, రాజకీయ కార్యాచరణ ఖరారు చేయాలని

...మిగతా 2లో



## నిన్నొకరు..నేడొకరు..
# రేపెవరు

- సీఎంఓలో ప్రక్షాళన పర్వం
- సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస్ రాజు బదిలీ



హైదరాబాద్,జూన్ 27(మనం,ప్రత్యేక ప్రతినిధి): సీఎంఓ కార్యాలయంలో ప్రక్షాళన పర్వం సాగుతోంది. గడచిన రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు ఉన్నతాధికారులను బదిలీ బాట పట్టించారు. సీఎంఓలో జరుగుతున్న ఊహించని మార్పులు రాష్ట్ర రాజకీయ, బ్యూరోక్రాటిక్ వర్గాలలో చర్చనీయాంశంగా మారాయి. సీఎంవోలో కీలక అధికారిగా ఉన్న ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కె.ఎస్. శ్రీనివాస్ రాజును ఆ బాధ్యతల నుంచి తప్పిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న శ్రీనివాస్ రాజును తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ చైర్మన్ పోస్టుకు బదిలీ చేస్తూ ప్రభుత్వం తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు సీఎంవోలో అత్యంత కీలకమైన మౌలిక వసతులు, ప్రాజెక్టుల వ్యవహారాలను పర్యవేక్షించిన ఆయనను.. అకస్మాత్తుగా 'రెరా' చైర్మన్‌గా నియమించడం వెనుక బలమైన పరిపాలనా పరమైన కారణాలు ఉన్నట్లు సచివాలయ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏడాది క్రితం సీఎం సెక్రటరీలుగా పనిచేస్తున్న సంగీతా సత్యనారాయణ, షానవాజ్ ఖాసీంను బదిలీ చేసిన విషయం విదితమే. కాగా సీనియర్ ఐఏఎస్ అధికారి ఎన్. శ్రీధర్‌ను

...మిగతా 2లో

## ఇంధన ధరలు ఎందుకు తగ్గట్లేదు?



- కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే


**ఢిల్లీ, జూన్ 27 :** ముడి చమురు ధరలు తగ్గి పశ్చిమాసియా యుద్ధానికి ముందు స్థాయికి చేరుకున్నా, భారత్‌లో ఇంధన ధరలు ఎందుకు అధికంగా ఉన్నాయని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బీజేపీ ప్రజలను దోచుకుంటోందని.. జేబులను ఖాళీ చేస్తోందని ఆరోపించారు. ప్రజల్ని కేవలం పన్నుల వసూలు సాధనంగా మాత్రమే చూస్తోందంటూ మండిపడ్డారు. యుద్ధాన్ని కారణంగా చూపి కేంద్ర ప్రభుత్వం వాణిజ్య ఎల్పీజీ ధరలను రెట్టింపు చేసిందని.. ఇప్పుడు సరఫరా సాధారణ స్థితికి వచ్చినా ధరలను ఎందుకు తగ్గించడం లేదని ప్రశ్నించారు. ''పశ్చిమాసియాలో యుద్ధం ఉద్ధృతంగా ఉన్నప్పుడు ముడి చమురు ధర బ్యారెల్‌కు 138 డాలర్లుగా ఉండేది. అప్పట్లో పెట్రోల్ లీటరు ధర రూ.94.77, డీజిల్ రూ.87.67గా ఉంది. కానీ, ప్రస్తుతం క్రూడ్ ఆయిల్ బ్యారెల్ 70 డాలర్లకు

...మిగతా 2లో

# తెలంగాణ సర్కారుకు ట్రంప్ థ్యాంక్స్


- డోనాల్డ్ 'ట్రంప్ అవెన్యూ'పై హర్షం
- సర్కారును అభినందిస్తూ ఎక్స్ ఖాతాలో పోస్ట్

హైదరాబాద్,జూన్ 27(మనం,ప్రత్యేక ప్రతినిధి): హైదరాబాద్ నగరంలో తన పేరుతో ఓ ప్రధాన రహదారికి నామకరణం చేయడం పట్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం యూఎస్ కాన్సులేట్ సమీపంలోని రహదారికి డోనాల్డ్ ట్రంప్ అవెన్యూ'గా పేరు పెట్టడంపై ఆయన ప్రత్యేకంగా స్పందించారు. ఈక్రమంలో శనివారం తన ఎక్స్ ఖాతాలో



'భారతదేశంలోని హైదరాబాద్‌లో కొత్తగా డోనాల్డ్ ట్రంప్ అవెన్యూను ఏర్పాటు చేశారు. ఈ విధంగా గౌరవించబడిన మొట్టమొదటి అమెరికా అధ్యక్షుడిని తానేనని ఇందుకు ధన్యవాదాలు'అని ట్రంప్ సంతోషం వ్యక్తం చేస్తూ తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్, నానక్‌రామ్‌గూడలోని యూఎస్ కాన్సులేట్ లో ఈనెల 23న జరిగిన అమెరికా 250 స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ' రహదారి నామఫలకాన్ని అమెరికా రాయబారి సెర్జియో గోర్, హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ ల సమక్షంలో లాంఛనంగా ఆవిష్కరించిన విషయం తెలిసిందే.

## నిండు జీవితానికి రెండు చుక్కలు



- నేడు రాష్ట్రవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం

హైదరాబాద్,జూన్27(మనం న్యూస్): రాష్ట్ర వ్యాప్తంగా నేడు పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నారు. 0 నుంచి 5 ఏళ్లలోపు సుమారు 40.97 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనుండగా, సోమ,మంగళ వారాల్లో ఇంటింటికీ వెళ్లి మిగిలిన పిల్లలకు టీకాలు అందించనున్నారు.

గతంలో టీకా వేయించినా మరోసారి వేయించడం తప్పనిసరి అని వైద్య ఆరోగ్య శాఖ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేసింది.ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా చిన్నారులకు పోలియో డ్రాప్స్ వేసేందుకు వైద్య,ఆరోగ్యశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో పట్టణ ప్రాంతాలు విస్తృతంగా ఉండటంతో జూలై 1న అదనంగా మరో రోజు కార్యక్రమాన్ని నిర్వహించాలని వైద్యారోగ్య

...మిగతా 2లో

## సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయండి

- మంత్రులు ఉత్తమ్, సీతక్క

హైదరాబాద్,జూన్ 27(మనం,ప్రత్యేక ప్రతినిధి): ములుగు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి రైతులకు శాశ్వత సాగునీరు అందించేలా చర్యలు వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ములుగు నియోజకవర్గ పరిధిలోని నీటిపారుదల శాఖ అభివృద్ధి పనులపై శనివారం ప్రత్యేక

...మిగతా 2లో

## మహిళా రిజర్వేషన్ల కోసం మహాసభ

- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత

హైదరాబాద్,జూన్ 27(మనం,ప్రత్యేక ప్రతినిధి): చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ మహిళా మహాసభ నిర్వహించాలని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. ఎన్సీ ఆర్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో శనివారం హిమాయత్ నగర్‌లో నిర్వహించిన చట్టసభల్లో మహిళా రిజర్వేషన్స్ సాధన సభలో పాల్గొని కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందినప్పటికీ ఇప్పటికీ అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. బిల్లును పోస్ట్ డేటెడ్ చెక్ మాదిరిగా మార్చారని, అమలులోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం కొర్రీలు పెడుతోందని విమర్శించారు. బిల్లు అమలుకు దేశవ్యాప్తంగా మహిళల శక్తిని ప్రదర్శించాల్సిన అవసరం ఉందన్నారు.

అవసరమైతే హైదరాబాద్ నెక్లెస్ రోడ్, ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలోనైనా లక్షలాది మహిళలతో భారీ ఉద్యమం చేపడదామని పిలుపునిచ్చారు. మహిళలకు రాజకీయాల్లో నిజమైన సాధికారత రావాలంటే పవర్ఫుల్ స్థానాల్లో

...మిగతా 2లో



## వెనెజువెలాలో మళ్లీ భూకంపం
### జంట విపత్తుల్లో రూ.63వేల కోట్ల నష్టం



**కారకస్, జూన్ 27:** జంట భూకంపాలతో వణికిన వెనెజువెలాలో మరోసారి భూమి కంపించింది. ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 4.9గా నమోదైంది. ఆ దేశ కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం ఈ ప్రకంపనలు వచ్చాయి. రాజధాని నగరం కారకస్, మరాకే సమీపంలో ఈ ప్రభావం కనిపించడంతో ప్రజలు వణికిపోయారు. మరోవైపు, ఇటీవల సంభవించిన భారీ భూకంపాల కారణంగా ఆ దేశానికి రూ.63వేల కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా. బుధవారం సాయంత్రం 7.2, 7.5 తీవ్రతతో క్షణాల వ్యవధిలో రెండు భూకంపాలు రావడంతో వేలాదిమంది శిథిలాల కింద చిక్కుకుపోయారు. వందల భవనాలు కూలిపోవడంతో సహాయకచర్యలు క్లిష్టంగా మారాయి. రెస్క్యూ సిబ్బంది సంఖ్య పరిమితంగా ఉండటంతో..

...మిగతా 2లో

## భారతకు ట్రంప్
### త్వరలో ఖరారు కానున్న ట్రేడ్ డీల్

**వాషింగ్టన్, జూన్ 27:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌లో పర్యటించనున్నారు. వచ్చే ఏడాదిలో ఆయన పర్యటన ఉండే అవకాశం ఉంది. ఈ విషయాన్ని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో వెల్లడించారు. భారత్-అమెరికా మధ్య సంబంధాలు అద్భుతమంటూ కొనియాడారు. అధ్యక్షుడి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు ఖరారు చేయడానికి ఈ ఏడాది ముగిసేలోపే తాను భారత్‌కు వెళ్తానని పేర్కొన్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రంప్ మొదటి భారత పర్యటన ఇదే కానుంది.

అమెరికాకు భారత్ అత్యంత సన్నిహిత భాగస్వామి అని.. ప్రధాని నరేంద్ర మోడీ - ట్రంప్ మధ్య మంచి అనుబంధం ఉందని మార్కో రూబియో తెలిపారు. దౌత్యపరంగా వారి బంధం చాలా ఉపయోగకరమన్నారు. ఇటీవల ఫ్రాన్స్‌లో

...మిగతా 2లో




## ఇరాన్‌కు దాడులు చేసే సత్తా ఉంది



- ట్రంప్ కీలక వ్యాఖ్యలు

**వాషింగ్టన్, జూన్ 27:** అమెరికా, ఇరాన్ పరస్పర దాడులతో పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ పరిణామాలపై అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఇరాన్‌కు ఇంకా ఎదురుదాడులు చేసే సామర్థ్యం ఉందని అన్నారు. కానీ, అమెరికా సైనిక చర్య పశ్చిమాసియాలో సుదీర్ఘ ఘర్షణలను నివారించిందని పేర్కొన్నారు.

''ఇరాన్‌కు ఇంకా సామర్థ్యం ఉంది. అయితే.. అదంత ఎక్కువేం కాదు. వారు విజయం సాధించే స్థితిలో ఏం లేరు. కానీ, ఎదురుదాడులు చేయగలరనే అనుకుంటున్నా. హర్మూజ్ లోని ఓ నౌకపైకి వారు నాలుగు డ్రోన్లు పంపించారు. అందులో మూడింటిని కూల్చేశాం. ఒకటి మాత్రం నౌకకు తగిలి కొంత మేర ధ్వంసమైంది'' అని ట్రంప్ వెల్లడించారు. నౌకపై టెహ్రాన్ దాడి తెలివితక్కువ పని అని అంతకుముందు అమెరికా అధ్యక్షుడు వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

**హింసకు హింసే: వాన్స్**

తాజా పరిణామాలపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఎక్స్ వేదికగా స్పందించారు. ''ఇరు దేశాల మధ్య శాంతి ఒప్పందం జరిగింది. మేం దాన్ని గౌరవిస్తున్నాం. కానీ, ఇరాన్ మాత్రం ఉల్లంఘిస్తోంది. ఒకవేళ ఒప్పందంలో ఏమైనా భేదాభిప్రాయాలు ఉంటే వారు ఫోన్ చేసి మాట్లాడొచ్చు. కానీ

...మిగతా 2లో

## భారతీయ కంపెనీ, సీఈఓపై అమెరికా ఆంక్షలు

**వాషింగ్టన్, జూన్ 27 :** ఒక భారతీయ కంపెనీ సహా పలు సంస్థలు, ఎనిమిది మంది వ్యక్తులపై అమెరికా ఆంక్షలు విధించింది. సూడాన్‌లో అంతర్యుద్ధాన్ని ప్రేరేపిస్తున్నారనే ఆరోపణలపై ఈ చర్యలు తీసుకుంది. ఈ మేరకు ఆర్థిక శాఖకు చెందిన ఫారిన్ అసెట్స్ కంట్రోల్ ఆఫీస్ వెల్లడించింది. సూడాన్ సాయుధ దళాలు, రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ మధ్య ఘర్షణ తీవ్రతరం కావడానికి ఈ సంస్థలు కారణమవుతున్నాయని పేర్కొంది. కొన్నేళ్లుగా ఈ రెండు దళాల మధ్య జరుగుతోన్న ఘర్షణలతో సూడాన్‌లో అంతర్యుద్ధం నడుస్తోంది. దాంతో ప్రపంచంలోనే అతిపెద్ద మానవతా సంక్షోభం ఏర్పడింది.ఆంక్షలు ఎదుర్కొంటున్నవారిలో రాయ్పూర్కు చెందిన అలోక్ చౌధరీ ఒకరు. అతడు ఎస్బీఎల్ ఎనర్జీ లిమిటెడ్కు సీఈఓగా ఉన్నారు. దీనికి మరోపేరు

...మిగతా 2లో

# 40 రోజుల్లో 70 సార్లు చోరీ

- సీసీటీవీ కెమెరాలకు అడ్డంగా నిలబడి అయోధ్య విరాళాలను దోచిన నిందితులు
- ఇప్పటివరకు రూ.79.85 లక్షలను స్వాధీనం చేసుకున్న సిట్
- ట్రస్టు ప్రధాన కార్యదర్శి పదవికి చంపత్ రాయ్ రాజీనామా



లఖ్‌నవూ, జూన్ 27 : అయోధ్య విరాళాల దుర్వినియోగం కేసులో విస్మయపరిచే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. రాముడికి భక్తులు సమర్పించిన విరాళాలను దోచుకోవడానికి నిందితులు పలు అక్రమ మార్గాలు అనుసరించినట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) విచారణలో వెల్లడైంది. ఆలయంలో పలుమార్లు దొంగతనాలు జరిగాయి. రహస్య కెమెరాల నుంచి వారం రోజుల ఫుటేజీని పరిశీలించగా.. సిబ్బందిలో ఒకరు సీసీటీవీ కెమెరాకు అడ్డుగా నిలబడటం, సహచరులు నగదును దుస్తుల్లో దాచుకొని రహస్యంగా తరలించడం కనిపించింది. దొంగిలించిన నగదును ఆలయ ప్రాంగణంలోని స్నానాల గదుల్లో దాచి, అనువైన సమయంలో బయటకు తీసుకెళ్లేవారు. ఇలాగే కాకుండా నగదును బ్యాంకుకు తరలించేటప్పుడూ డబ్బు కట్టల నుంచి కొన్ని నోట్లను పక్కదారి పట్టించేవారు. ఈ ఏడాది ఏప్రిల్ 27 నుంచి జూన్ 5 మధ్య 40రోజుల్లో దాదాపు 70 దొంగతనాలు జరిగాయి. ఈ కేసులో మొత్తం రూ.79.85 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు సిట్ వెల్లడించింది. పలువురు బ్యాంకు అధికారులు, ప్రభుత్వ ఉద్యోగుల పేర్లు కూడా దర్యాప్తులో వెలుగులోకి వచ్చాయి. భక్తులు విరాళాల పెట్టెల్లో ఉంచిన ఆభరణాలను కూడా నిందితులు దొంగిలించారు. వీటిలో బాల రాముడి విగ్రహం కోసం ఇచ్చిన చెవిపోగులు, ముక్కుపుడకలు, గాజులు, కాలి గజ్జెలు ఉన్నాయి. ఈ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తన పదవికి రాజీనామా చేశారు. తన మాజీ డ్రైవరు రామ శంకర్ యాదవ్ అరెస్టుకు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు. ట్రస్టుకు చెందిన మరో సభ్యుడు అనిల్ మిశ్ర కూడా తన బాధ్యతల నుంచి వైదొలిగారు. అయోధ్య విరాళాల దుర్వినియోగం కేసులో ఇప్పటికే ఎనిమిది మంది అరెస్టయిన విషయం తెలిసిందే. వీరిలో చంపత్ డ్రైవరుతో పాటు నగదు లెక్కింపు విభాగాధిపతి, ఓ విశ్రాంత బ్యాంకు అధికారి ఉన్నారు. స్థానిక కోర్టు వీరికి మూడు రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీ విధించింది.

**ఎంతవారైనా వదిలేది లేదు: యోగి**

అయోధ్య కేసులో దోషులుగా తేలితే ఎంతటివారినైనా వదిలేది లేదని యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పునరుద్ఘాటించారు. కాగా కీలక వ్యక్తులను కాపాడటానికే సిట్‌ను ఏర్పాటు చేశారని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. ఈ కేసుతో సంబంధం ఉన్న వారిని సామాజికంగా బహిష్కరించాలని పిలుపునిస్తూ.. దీన్ని ధర్మయుద్ధంగా ఆయన అభివర్ణించారు. ట్రస్టును రద్దు చేసి... విరాళాల కేసును సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది.

# ఇంట్లో చెప్పడం కంటే చంపడమే ఈజీ

## కేతన్ హత్యోదంతంలో మరో షాకింగ్ విషయం!

పూణె , జూన్ 27: దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన పూణె యువ రియల్టర్ కేతన్ అగర్వాల్ (26) హత్య కేసు విచారణ రోజుకో మలుపు తిరుగుతోంది. తాజాగా ఈ కేసులో మరో షాకింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. కేతన్‌ను పెళ్లి చేసుకోవడం ఇష్టంలేక సియా గోయల్ తన ప్రియుడు చేతన్‌తో కలిసి ఈ దారుణానికి పథకం రచించినట్లు తెలుస్తోంది. ఇంట్లో కుటుంబ సభ్యులకు ఈ విషయం చెప్పి, వారిని బాధపెట్టి వివాహం రద్దు చేసుకోవడం కంటే కేతన్‌ను చంపేయడమే సులభమని తాను భావించినట్లు విచారణలో సియా అంగీకరించినట్లు సమాచారం. పూణె రూరల్ పోలీసు వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు ఈ విషయాన్ని పేర్కొన్నాయి.

మరోవైపు, ఈ కేసు విచారణకు పూణె, లోనావాలా పోలీసులు ఆరు బృందాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సియా గోయల్ తల్లిదండ్రులను లోనావాలా సిటీ పోలీస్ స్టేషన్‌లో విచారణ చేయగా.. ఆమె సోదరుడు సాహిల్‌ను పోలీసులు రెండోసారి విచారిస్తున్నారు. నిన్న దాదాపు 10 గంటల పాటు జరిగిన విచారణలో సియా సోదరుడు సాహిల్ పోలీసులకు కీలక విషయాలను వెల్లడించాడు. చేతన్ చౌదరి తనకు తెలుసని, తన సోదరి అతడిని ఓ క్రికెట్ మ్యాచ్‌లో పరిచయం చేసిందని పోలీసులకు తెలిపాడు.

**2 వేల కాల్స్.. 238 గంటల సంభాషణ!**

అలాగే, గతేడాది ఓ కామన్ ఫ్రెండ్ నిర్వహించిన దీపావళి పార్టీలో కలిశాక వారిద్దరి మధ్య సాన్నిహిత్యం మరింత పెరిగిందని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. చేతన్, సియాల కాల్ రికార్డులను పరిశీలించగా.. జనవరి నుంచి వీరిద్దరూ 2వేల సార్లు దాదాపు 238గంటల పాటు సంభాషించుకున్నట్లుగా గుర్తించినట్లు సమాచారం. ఈ కేసులో కుట్ర కోణాన్ని రుజువు చేసేందుకు వీలుగా నిందితులు తమ మొబైల్ ఫోన్‌లనుంచి డిలీట్ చేసిన డేటాను తిరిగి పొందేందుకు పోలీసులు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

# వెనెజువెలాలో మళ్లీ భూకంపం

(మొదటి పేజీ తరువాయి)

ఆత్మీయులను కోల్పోయిన వారంతా చేతులతోనే శిథిలాలను తొలగిస్తున్నారు. ప్రాణాలతో రక్షించడానికి తొలి 48 నుంచి 72 గంటలు కీలకం కావడంతో ఎలాగైనా తమవారిని కాపాడుకోవాలని వారు చేస్తోన్న ప్రయత్నాలతో భూకంప ప్రభావిత ప్రాంతాల్లో ఉద్విగ్న వాతావరణం కనిపిస్తోంది. లా గువేరా రాష్ట్రం జంట భూకంపాలతో తీవ్రంగా ప్రభావితమైంది. రెస్క్యూ సిబ్బంది ఈ రాష్ట్రంలో పలు ప్రాంతాలకు చేరుకోవడంలో ఆలస్యమవుతుండటంతో బాధితుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఎనిమిది అంతస్తుల భవనం కూలడంతో తన ఐదేళ్ల కుమారుడు, మరికొంతమంది బంధువులు చిక్కుకుపోయారని జెన్నిఫర్ అనే మహిళ వాపోయారు. ప్రభుత్వ సహాయం ఆలస్యమవుతుండటంతో స్థానికులే చాలామందిని రక్షించారని, అయితే భారీ కాంక్రీటు స్లాబులు ఎత్తడానికి క్రేన్లు, భారీ యంత్రాల అవసరం ఉందన్నారు.

**దేశ చరిత్రలోనే అత్యంత ఘోరమైన విపత్తు..**

ఈ ప్రకృతి విపత్తుతో వెనెజువెలాకు ప్రత్యక్షంగా 6.7 బిలియన్ డాలర్ల (రూ.63వేల కోట్ల) మేర నష్టం వాటిల్లిందని ఐరాస అంచనా వేసింది. పరోక్ష ప్రభావాన్నీ లెక్కిస్తే ఇంకా ఎక్కువే ఉండొచ్చని అభిప్రాయపడింది. దీంతో ఆ దేశంలో సంభవించిన అత్యంత ఘోరమైన విపత్తుల్లో ఒకటిగా నిలిచింది. ఇప్పటికే రాజకీయ అస్థిరత, ఆర్థిక సమస్యల కారణంగా వ్యవస్థలు బలహీనపడ్డాయి. ఇప్పుడు విపత్తు కారణంగా పెద్ద సంఖ్యలో ప్రజలు నిరాశ్రయులైనప్పటికీ.. వారికి ఆశ్రయం కల్పించలేని పరిస్థితి నెలకొంది. భూకంపాల తీవ్రత వల్ల ఇళ్లలోకి వెళ్లలేనివారు కార్లలోని నిద్రపోతున్నారు. పార్కుల్లో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. దాదాపు మూడుకోట్ల జనాభా కలిగిన ఆ దేశంలో సగంమందిపైగా పేదరికంలోనే మగ్గిపోతున్నారు. భూకంపాలు రాకముందే 80 లక్షల మంది మానవతా సహాయం అవసరమైన పరిస్థితులున్నాయని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

# భారతకు ట్రంప్

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన జీ7 సదస్సులో వాణిజ్య ఒప్పందం గురించి మోడీ-ట్రంప్ చర్చించారని రూబియో వెల్లడించారు. ఇరుదేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు త్వరలో పూర్తి కానున్నట్లు తెలిపారు. ఇంధన సరఫరాను పెంచడానికి భారత్-అమెరికా కలిసికట్టుగా పనిచేస్తున్నాయన్నారు. చమురు శుద్ధి చేయగల సామర్థ్యం ఉన్న కొన్ని దేశాలలో భారత్ కూడా ఒకటని పేర్కొన్నారు.ప్రధాని నరేంద్ర మోడీపై రూబియో ప్రశంసలు కురిపించారు. తాను ఆయనకు అభిమానినని తెలిపారు. ప్రపంచ వేదికపై భారతదేశ స్థాయిని పెంచిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.

# తగ్గం...తలొగ్గం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించినట్లు ఉత్తమ్ వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం సొంతంగా ఉపాధి హామీ చట్టాన్ని తీసుకురావాలని సమావేశంలో పాల్గొన్న దాదాపు 20 పౌరసంఘాలు సూచించాయని మంత్రి తెలిపారు. అరవై రోజుల ఉపాధి పరిమితిని పూర్తిగా వ్యతిరేకిస్తూ ప్రతీ గ్రామీణ కుటుంబానికి కనీసం 200 రోజుల హామీ ఉపాధి కల్పించాలని, చట్టబద్ధ కనీస వేతనాలు చెల్లించాలని పౌరసంఘాలు కోరుతున్నాయని తెలిపారు. కేంద్రం ప్రతిపాదించిన 60:40 నిధుల భాగస్వామ్యం తెలంగాణపై వేల కోట్ల రూపాయల అదనపు భారం మోపే ప్రమాదం ఉందని, ఈ అంశాన్ని రాష్ట్ర న్యాయశాఖ క్షుణ్ణంగా పరిశీలిస్తోందన్నారు. పనితీరు బాగున్న రాష్ట్రాలను శిక్షిస్తూ, వెనుకబడిన రాష్ట్రాలను ప్రోత్సహించేలా కేంద్రం రూపొందించిన నిధుల కేటాయింపు విధానం అన్యాయమని మంత్రి విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్రానికి సమగ్ర సూచనలు పంపినప్పటికీ, వాటిని పూర్తిగా విస్మరించడం బాధాకరమని అన్నారు.

**వ్యతిరేకిస్తం :**

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వీబీజీ రామ్‌జీ



చట్టం-2025పై రాష్ట్ర కేబినెట్ సబ్ కమిటీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ చట్టం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా, రాష్ట్రాల హక్కులను హరించేలా ఉందని పేర్కొంటూ.. దీనిని న్యాయపరంగా, రాజ్యాంగపరంగా వ్యతిరేకించాలని నిర్ణయించింది.పథకం అమలులో 40 శాతం ఆర్థిక భారం రాష్ట్రంపై మోపి, నిర్ణయాధికారం మాత్రం కేంద్రం వద్దే ఉంచుకోవడం అన్యాయమని సబ్ కమిటీ తేల్చిచెప్పింది. ఈక్రమంలో సోమవారం ఢిల్లీలో కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో జరగనున్న సమావేశంలో తెలంగాణ వాదనను బలంగా వినిపించాలని సబ్ కమిటీ నిర్ణయించింది. నార్మెటివ్ అలోకేషన్ కాకుండా, ఉపాధి హామీ చట్టం అసలు ఉద్దేశం ప్రకారం డిమాండ్ ఆధారిత నిధుల విడుదల జరగాలని సబ్ కమిటీ అభిప్రాయపడింది. ప్రజాసంఘాల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకున్న సబ్ కమిటీ, తన సిఫార్సులను జూలై 2న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సమర్పించనుంది. అవసరమైతే ఈ అంశంపై అత్యున్నత న్యాయస్థానాలను ఆశ్రయించేందుకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేసింది.

# నిన్నొకరు..నేడొకరు..రేపెవరు

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శిగా ప్రభుత్వం నియమించింది.అలాగే మాజీ సీఎస్ రామకృష్ణారావును సీఎం ముఖ్య సలహాదారుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నిన్న అజిత్ నేడు శ్రీనివాస్

రాష్ట్రంలో కీలక హోదా అయిన ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్ రెడ్డిని ఆ బాధ్యతల నుంచి తొలగించి, మెట్రో రైల్ అదనపు ఎండీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించిన సంగతి తెలిసిందే. ఆయన బదిలీ జరిగిన 24 గంటలలోపు సీఎంవోలో మరో కీలక అధికారిపై బదిలీ వేటు పడింది. సీనియర్ అధికారి శ్రీనివాస్ రాజు ను సీఎం కార్యాలయం నుంచి 'రెరా'కు పంపడం బ్యూరోక్రాటిక్ వర్గాలలో ఒక్కసారిగా భయం మొదలైంది. సీఎంఓలో వరుస బదిలీలు, పోస్టింగ్‌లను పరిశీలిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన కార్యాలయాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. అనతికాలంలో సీఎంవోలో మరికొన్ని కీలక మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉందని అధికార వర్గాలలో చర్చమొదలైంది. సీఎంలో ప్రక్షళన ఒక వ్యూహం ప్రకారమే జరుగుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో నిన్న అజిత్ నేడు శ్రీనివాస్ రేపెవరన్న చర్చ సచివాలయ వర్గాల్లో జోరందుకుంది.

మరొకొందరిపై :

సీఎంఓ కార్యాలయంలో ప్రతీ ఒక్క అధికారి పని తీరుపై ఇంటెలిజెన్స్ వర్గాలు సీఎం రేవంత్‌రెడ్డికి నివేదికలు ఇచ్చినట్లు సమాచారం. అటు పాలనకు, ఇటు ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేయని అధికారులను పక్కన పెట్టేందుకు సీఎం సిద్ధమయ్యారు. ముఖ్యంగా సీఎంకు అత్యంత సన్నిహితునిగా అజిత్‌రెడ్డిని సీఎంవో నుంచి తప్పించడం సంచలనం రేపుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి అజిత్‌రెడ్డికి సీఎంఓలో కీలక బాధ్యతలు అప్పగించారు. అయితే ఆయన పనితీరుపై కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేయడంతో ఆయనను తొలగించినట్లు సమాచారం. అతి త్వరలో సీఎంఓ కార్యాలయంలో ఒకరిద్దరు కీలక అధికారులపై సైతం వేటు పడే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

# నిండు జీవితానికి రెండు చుక్కలు

(మొదటి పేజీ తరువాయి)

శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు.ఈ కార్యక్రమం కోసం రాష్ట్రవ్యాప్తంగా 22,979 పోలియో బూత్‌లు,903 మొబైల్ బృందాలు, 903 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేశారు. సుమారు 40.97 లక్షల మంది 0-5 ఏళ్ల చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నారు. ఇందుకోసం 52.04 లక్షల బీవోపీవీ టీకా డోసులు జిల్లాలకు సరఫరా చేశారు. కార్యక్రమంలో 8,393 ఏఎన్ఎంలు, 27,181 ఆశా కార్యకర్తలు, 34,442 అంగన్వాడీ కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొననున్నారు.వలస కార్మికుల పిల్లలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లోని బస్తీలు, కొత్త కాలనీలు, గిరిజన ప్రాంతాల్లోని చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమం, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యాశాఖ, ఆర్టీసీ తదితర శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. తెలంగాణలో చివరి పోలియో కేసు 2007లో నమోదు అయిందని, పోలియో రహిత తెలంగాణ లక్ష్యాన్ని ఉమ్మడి రాష్ట్రంలోనే సాధించామని ఈ సందర్భంగా అధికారులు గుర్తు చేశారు. నేడు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా రెండు చుక్కల పోలియో టీకా వేయించాలని, తల్లిదండ్రులందరూ తమ పిల్లలను సమీపంలోని పోలియో బూత్‌కు తీసుకువచ్చి టీకా వేయించాలని, వైద్య ఆరోగ్య శాఖ.ప్రజలకు పిలుపునిచ్చింది.

# సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయండి

(మొదటి పేజీ తరువాయి)

సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రులు ఉత్తమ్,సీతక్కలు మాట్లాడుతూ రామప్ప-లక్నవరం గ్రావిటీ కెనాల్, పొట్లాపూర్ ప్రాజెక్టుతో పాటు జిల్లాలో కొనసాగుతున్న అన్ని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రైతుల ప్రయోజనాలకు భంగం కలగకుండా అభివృద్ధి పనులను పూర్తి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, రైతులకు న్యాయం చేస్తూనే ప్రాజెక్టులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**మంత్రులకు నివేదిక :**

రామప్ప-లక్నవరం గ్రావిటీ కెనాల్‌కు అవసరమైన భూసేకరణపై అధికారులు సమగ్ర నివేదికను మంత్రులు ఉత్తమ్,సీతక్కలకు సమర్పించారు. కాసిందేవిపేట, ఇంచెర్ల, రామచంద్రాపూర్ గ్రామాల పరిధిలో ఈ ప్రాజెక్టుకు మొత్తం సుమారు 244.23 ఎకరాల భూమి అవసరమవుతుందని తెలిపారు. ఇందులో ఇప్పటివరకు 201.03 ఎకరాలకు మాత్రమే అవార్డులు జారీ అయినప్పటికీ భూసేకరణ పూర్తికాలేదని వివరించారు. భూసేకరణకు సంబంధించి 2020-21లో జారీ చేసిన అవార్డుల ప్రకారం ఎకరాకు రూ.2.47 లక్షల నుంచి రూ.8.26 లక్షల వరకు మాత్రమే పరిహారం నిర్ణయించారని, ప్రస్తుతం భూముల మార్కెట్ విలువలు గణనీయంగా పెరగడంతో ఆ ధరలకు రైతులు భూములు ఇచ్చేందుకు అంగీకరించడం లేదని అధికారులు వివరించారు. పాత అవార్డులో నిర్ణయించిన పరిహారం ప్రస్తుత పరిస్థితులకు ఏమాత్రం అనుగుణంగా లేదని, అందువల్ల రైతులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రైతులు ప్రస్తుత భూముల ధరలకు అనుగుణంగా న్యాయమైన పరిహారం చెల్లిస్తే భూములు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేస్తున్నారని, అయితే పాత ధరలతో భూసేకరణ కొనసాగించడం వల్ల కేసులు పెండింగ్‌లో ఉండిపోయాయని అధికారులు మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ పరిస్థితుల్లో పాత అవార్డులను ఉపసంహరించి ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా కొత్త భూసేకరణ ప్రక్రియ చేపట్టడమే సరైన మార్గమని అధికారులు అభిప్రాయపడ్డారు.

**నష్టం లేకుండా :**

అధికారుల నివేదికపై స్పందించిన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలకు ఎలాంటి నష్టం కలగకుండా భూసేకరణ చేపట్టాలని స్పష్టం చేశారు. 2020-21లో జారీ చేసిన పాత భూసేకరణ అవార్డును ఉపసంహరించి, తాజా మార్కెట్ విలువల ఆధారంగా కొత్త అంచనాలు రూపొందించి వెంటనే తాజా భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు న్యాయమైన పరిహారం అందేలా పారదర్శకంగా భూసేకరణ చేపట్టి, రైతుల విశ్వాసాన్ని పొందుతూ పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

**రెండేళ్లలో పూర్తి చేయాలి :**

రామప్ప-లక్నవరం గ్రావిటీ కెనాల్ నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రామప్ప చెరువు నుంచి లక్నవరం చెరువుకు గ్రావిటీ ద్వారా నీటి తరలింపు సాధ్యమవుతుందని, సుమారు 8,700 ఎకరాలకు సాగునీరు అందుతుందని అధికారులు వివరించారు. అంతేకాకుండా మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర సందర్భంగా తాగునీటి అవసరాలు తీర్చడంలోనూ, లక్నవరం పర్యాటకాభివృద్ధికి కూడా ఈ ప్రాజెక్టు కీలకంగా ఉపయోగపడుతుందని తెలిపారు. అదేవిధంగా పొట్లాపూర్ ప్రాజెక్టు పనులను మరింత ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించాలని, వచ్చే వారంలోనే శంకుస్థాపన జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

# కళలు, సంస్కృతితో వ్యక్తిత్వ వికాసం



- తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్

హైదరాబాద్, జూన్ 27(మనం,ప్రత్యేక ప్రతినిధి): ప్రొబేషనరీ డీఎస్పీలు,ట్రైనీ ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ల శిక్షణతో పాటు కళలు, సంస్కృతి, వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమని పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ అన్నారు. తెలంగాణ పోలీస్ అకాడమీలోని రాణి రుద్రమదేవి ఆడిటోరియంలో శనివారం ప్రొబేషనరీ డీఎస్పీలు, ట్రైనీ ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్లు సంయుక్తంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలకు ఆమె ముఖ్య అతిధిగా హాజరై ట్రైనీల ప్రతిభను అభినందించారు. ఈ సందర్భంగా ట్రైనీలు క్లాసికల్ నృత్యాలు, జానపద (ఫోక్) నృత్యాలు, గర్బా, బోనాల నృత్య ప్రదర్శనలు, దుర్యోధనుని మోనోలాగ్, గ్రూప్ డ్యాన్సులు తదితర ఆకట్టుకునే ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. ప్రతి ప్రదర్శనలోనూ ట్రైనీల ప్రతిభ, క్రమశిక్షణ, కళాత్మక నైపుణ్యం ప్రతిబింబించి ప్రేక్షకుల నుంచి విశేష ప్రశంసలు అందుకుంది. ఆట, పాట, నృత్యాలు, మోనో లాగ్లతో సాగిన ఈ సాంస్కృతిక కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.ఈ కార్యక్రమానికి ఇండక్షన్ ట్రైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ చేతన్, ఐపీఎస్, కోర్స్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి, ఔట్‌డోర్ అసిస్టెంట్ డైరెక్టర్ యార్లగడ్డ రాంబాబు, డీఎస్పీల కల్చరల్ కమిటీ నేతృత్వంలో నిర్వహించారు. ఇన్‌ఛార్జ్ డీఎస్పీ ఆదూరి శ్రీనివాసరావు మార్గదర్శకత్వంలో, ఔట్‌డోర్ డీఎస్పీ కృష్ణ సహకారం అందించారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీలు నిశాంత్, శ్రీకాంత్ వ్యాఖ్యాతలుగా వ్యవహరించి తమ చక్కటి వ్యాఖ్యానంతో సభికులను ఆకట్టుకున్నారు.

# రోల్డ్ 'గోల్డ్‌మ్యాన్' అరెస్ట్

హైదరాబాద్,జూన్ 27(మనం,ప్రత్యేక ప్రతినిధి) : తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తానని మోసం చేసిన కేసులో గోల్డ్‌మ్యాన్ సూర్య భాయ్‌ను అరెస్ట్ చేసినట్లు నారాయణగూడ సీఐ సైదేశ్వర్ తెలిపారు. నిందితుడు సూర్య భాయ్‌పై కృష్ణ మాచారి అనే బాధితు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామని సీఐ తెలిపారు. విచారణలో నిందితుడు తనకు బంగారం వ్యాపారులతో సత్సంబంధాలు ఉన్నాయని, మార్కెట్ ధర కంటే తక్కువకు బంగారం ఇప్పించగలనని మోసాలకు పాల్పడినట్లు తేలిందన్నారు. ముఖ్యంగా కిలో బంగారం ధర సుమారు రూ.1.5 కోట్లు ఉండగా, కేవలం రూ.1 కోటికే కిలో బంగారం విదేశాల నుండి తీసుకొచ్చి అందిస్తానని చెప్పిన సూర్యభాయ్ చీటింగ్ చేసినట్లు తేలిందన్నారు. ఈక్రమంలో బాధితులు పలు దఫాలుగా మొత్తం రూ.30 లక్షలు తీసుకుని మోసం చేసినట్లు ఆధారాలు సేకరించామని, కాగా నిందితునిపై గతంలోనూ మంగళ్‌హాట్‌లో కేసు ఉందని తెలిపారు. ఇదిలావుండగా గోల్డ్ మ్యాన్ సూర్యభాయ్ వంటిపై ఉన్న 3కిలోల బంగారంపై ఐటీ అధికారులు నోటీసులిచ్చి విచారించగా రోల్డ్‌గోల్డ్‌కు బంగారం పూత పూసినట్లు తేలిన విషయం విదితమే. వంటిపై రోల్డ్‌గోల్డ్ ధరించి మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

# ఇంధన ధరలు ఎందుకు తగ్గట్లేదు?

(మొదటి పేజీ తరువాయి)

పడిపోయింది. అయినప్పటికీ పెట్రోల్, డీజిల్ ధరలను మోడీ ప్రభుత్వం ఎందుకు తగ్గించడం లేదు?'' అని ఖర్గే నిలదీశారు. యుద్ధం పేరుతో వాణిజ్య ఎల్పీజీ ధరలను రెట్టింపు చేశారని, ఇప్పుడు సరఫరా సాధారణ స్థితికి చేరినా ప్రజలకు ఎందుకు ఉపశమనం కలిగించడం లేదని ప్రశ్నించారు.

వలస కార్మికులకు ఉపయోగకరమైన ఐదు కిలోల సిలిండర్ల ధరలనూ విపరీతంగా పెంచేశారని ఆక్షేపించారు.

# మహిళా రిజర్వేషన్ల కోసం మహాసభ

(మొదటి పేజీ తరువాయి)

ఉండే అవకాశాలు కల్పించాల్సిందేనని ఆమె పేర్కొన్నారు.

**చట్టబద్ధమైన రిజర్వేషన్‌లు :**

మహిళలు ఒక స్థాయి వరకు ఎదిగిన తర్వాత వారిని అడ్డుకునే పరిస్థితులు ఇప్పటికీ ఉన్నాయని, అందుకే చట్టబద్ధమైన రిజర్వేషన్లు అత్యవసరమని కవిత స్పష్టం చేశారు. 33 శాతం మహిళా రిజర్వేషన్లు తప్పకుండా సాధిస్తామని, అదే సమయంలో మహిళా నాయకత్వాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు కూడా చేపట్టాలని సూచించారు. 2022-23లో మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించామని, అంతేకాకుండా 18 రాజకీయ పార్టీలను ఈ అంశంపై పార్లమెంట్లో మాట్లాడేలా చేసి కేంద్రంపై ఒత్తిడి పెంచామని కవిత గుర్తుచేశారు.

ఆ ఒత్తిడితోనే బిల్లుకు ఆమోదం లభించిందని, అయితే అమలు మాత్రం ఇంకా జరగలేదని అన్నారు. మహిళల ఓట్లు రాజకీయ పార్టీలకు అత్యంత కీలకమని, మహిళల్లో చైతన్యం పెరిగిన నేపథ్యంలో వారిని ఆకర్షించేందుకు ప్రత్యేక పథకాలు ప్రకటిస్తున్నారని కవిత పేర్కొన్నారు. అయితే మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయని పార్టీలకు ఓట్లు వేయబోమనే ఉద్యమాన్ని మహిళలు ప్రారంభించాలని ఆమె పిలుపునిచ్చారు.

మహిళల కోసం ధైర్యంగా ఒక అడుగు ముందుకేసి పార్టీ పెట్టానని.. మహిళలందరూ గర్వపడేలా, కాలర్ ఎగరేసుకునేలా మంచి రాజకీయాలు చేస్తానని హామీ ఇస్తున్నానని కవిత అన్నారు.

# మహిళలపై ప్రత్యక్ష,పరోక్ష వేధింపులు

- ప్రొబేషనరీ డీఎస్పీలకు డీజీ చారుసిన్హా పాఠాలు

హైదరాబాద్, జూన్ 27, (మనం,ప్రత్యేక ప్రతినిధి): మహిళలు పనిచేసే స్థలాలలో ప్రత్యక్షంగా,పరోక్షంగా వేధింపులకు గురైతే సకాలంలో గుర్తించి చట్టపరంగా ఉన్న రక్షణ వ్యవస్థలను వినియోగించుకోవాలని సీఐడీ డీజీపీ చారు సిన్హా సూచించారు. పోలీస్ అకాడమీ ప్రొబేషనరీ డీఎస్పీలకు పని ప్రదేశాల్లో మహిళల భద్రత, పోక్సో చట్టం అమలు, మహిళలు ఎదుర్కొనే సమస్యలు' అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐడీ డీజీపీ పని ప్రదేశాల్లో మహిళలపై జరిగే లైంగిక వేధింపుల నివారణ పోక్సో చట్టం గురించి సమగ్రంగా వివరించారు. మహిళలు ఉద్యోగ స్థలాల్లో ఎదుర్కొనే అనేక రకాల లైంగిక వేధింపులు ప్రత్యక్షంగానే కాకుండా, మాటలు, ప్రవర్తన, సంకేతాలు, అనుచిత వ్యవహారాల రూపంలో కూడా ఉండవచ్చని తెలిపారు. అలాంటి సంఘటనలను మహిళలు సకాలంలో గుర్తించి, చట్టపరంగా అందుబాటులో ఉన్న రక్షణ వ్యవస్థలను వినియోగించుకోవాలన్నారు. వివిధ వాస్తవ ఉదాహరణల ద్వారా చట్టం ప్రాముఖ్యతను వివరించి, ప్రతి అధికారి మహిళలకు సురక్షితమైన కార్యాలయ వాతావరణాన్ని కల్పించే బాధ్యతను గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు.అనంతరం విమెన్ సేఫ్టీ వింగ్ కౌన్సిలర్ ఇషా శర్వాణి మహిళలు తమ ఉద్యోగ జీవితంలో ఎదుర్కొనే మానసిక, సామాజిక, వృత్తిపరమైన సవాళ్లు, లైంగిక వేధింపుల వివిధ రూపాలు, వాటిని ఎదుర్కొనే విధానాలపై ఉదాహరణలతో వివరించారు. మహిళల భద్రత, గౌరవ పరిరక్షణ విషయంలో పోలీసు అధికారులు చట్టంపై పూర్తి అవగాహనతో వ్యవహరించి, సమాజంలో కూడా విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆమె సూచించారు.మహిళలకు సురక్షితమైన, గౌరవప్రదమైన కార్యాలయ వాతావరణం కల్పించడంలో పోలీసు అధికారుల పాత్ర అత్యంత కీలకమని వక్తలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్,112 మంది ప్రొబేషనరీ డీఎస్పీలు పాల్గొనగా డీఎస్పీ సతీష్ లైజన్ అధికారిగా వ్యవహరించారు.

# ఇరాన్‌కు దాడులు చేసే సత్తా ఉంది

(మొదటి పేజీ తరువాయి)

ఇలా దాడులకు పాల్పడటం సమంజసం కాదు. హింసకు సమాధానం హింసే అవుతుంది'' అని వాన్స్ పరోక్షంగా టెహ్రాన్ను హెచ్చరించారు.

హర్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న చాలా ఖరీదైన వాణిజ్య నౌకపై శుక్రవారం ఇరాన్ డ్రోన్లతో దాడి చేసిన విషయం తెలిసిందే. దీనికి ప్రతీకారంగా యూఎస్ దాడులు చేపట్టింది. హర్మూజ్‌కు సమీపంలోని ఇరాన్ మిలటరీ స్థావరాలు, క్షిపణి-డ్రోన్ల నిల్వ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుంది. ఇందుకు సంబంధించిన వీడియోను యూఎస్ సెంట్రల్ కమాండ్ విడుదల చేసింది. శాంతి ఒప్పందానికి తాము పూర్తిస్థాయిలో కట్టుబడి ఉన్నామని, దాన్ని అమలు చేసేందుకు అత్యంత అప్రమత్తతతో పనిచేస్తున్నామని అగ్రరాజ్యం స్పష్టం చేసింది.

**మాపై నిందలేయొద్దు: ఇరాన్**

కాగా.. అమెరికా దాడులను ఇరాన్ పార్లమెంట్ నేషనల్ సెక్యూరిటీ కమిషన్ హెడ్ ఇబ్రహీం అజీజీ తీవ్రంగా ఖండించారు. ''చర్చల మధ్య అమెరికా మరోసారి మాపై దాడి చేసింది. కాల్పుల విరమణ, శాంతి ఒప్పందం పట్ల నిబద్ధత లేదని అమెరికా అధ్యక్షుడు మరోసారి నిరూపించుకున్నారు. ఈ నిర్లక్ష్యపు ఉల్లంఘనకు వారు పశ్చాత్తాపం చెందాల్సి వస్తుంది. ఇలాంటి నిందలు ఇకపై పనిచేయవు'' అని అగ్రరాజ్యాన్ని హెచ్చరించారు.

# భారతీయ కంపెనీ, సీఈఓపై అమెరికా ఆంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

అమిన్ ఎక్స్లోజివ్ ప్రైవేట్ లిమిటెడ్. ఎస్ఏఎఫ్‌కు చెందిన ఆయుధగారాన్ని నిర్వహించే సంస్థకు అమిన్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీ పేలుడు పదార్థాలున్న 200 షిప్‌మెంట్లను సప్లై చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఎస్బీఎల్ ఎనర్జీ లిమిటెడ్‌తో పాటు సూడాన్, ఈజిప్ట్ కేంద్రంగా నడుస్తోన్న సంస్థలపై అమెరికా ఆంక్షలు విధించింది. ''ఈ సంస్థలు సూడాన్ దళాలకు ఆయుధాలు, పేలుడు పదార్థాలు, విదేశీ ఫైటర్లను సరఫరా చేస్తుండటంతో ఘర్షణ సుదీర్ఘకాలంగా కొనసాగుతోంది. దీంతో మానవతా సంక్షోభం ఏర్పడటమేగాకుండా.. ఉగ్రవాద గ్రూపులు చెలరేగడానికి అవకాశం ఏర్పడింది'' అని యూఎస్ విదేశాంగశాఖ ప్రతినిధి టామీ పిగాట్ పేర్కొన్నారు. ఈ పరిస్థితులతో అక్కడ అత్యాచారాలు, లైంగిక హింస విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని గతంలో ఐరాస ఆందోళన వ్యక్తంచేసింది.

# విద్యాలయాల్లో అభివృద్ధి పనుల కోసం రూ. 5.40కోట్లు



- ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో హాస్టల్ నిర్మాణానికి రూ. 4 కోట్లు
- నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన టీజీఐఐసీ ఛైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి, జూన్ 27 (మనంప్రతినిధి): సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వం పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించే లక్ష్యంతో టీజీఐఐసీ నుంచి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద రూ.5.40కోట్లు అందాయి. నిధులతో ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో రూ. 4కోట్లు వెచ్చించి హాస్టల్ నిర్మించనున్నారు. రూ. 75 లక్షలతో గరల్స్ జూనియర్ కాలేజీలో ఆడిటోరియం నిర్మాణం చేపట్టనున్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో డైనింగ్ హాల్, కిచెన్ నిర్మాణం కోసం రూ. 75 లక్షలు వెచ్చించనున్నారు. తార డిగ్రీ కళాశాలలో ప్రహరీ నిర్మాణం కోసం ఇందులో నుంచి రూ. 50లక్షలు కేటాయించారు. ఈ పనులకు టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్, సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనితా సంతోష్, బ్లాక్ ప్రెసిడెంట్ జార్జ్, కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కౌన్సిలర్లు సంగీత మహేష్, సుష్మిత, రవి నాయక్, శ్రీకాంత్ గౌడ్, ప్రీతి, కో ఆప్షన్ సభ్యులు బబ్బు, శివుడు, యశోద, సోహైల్, ఆరిఫ్ లతో పాటు ఉమెన్స్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ అరుణ, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ సునీత, తారా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ ప్రవీణ, ఎడ్యుకేషనల్ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

# సమన్వయం..నిలిచిన మహిళ ప్రాణం

- చందానగర్ మెడికవర్ హాస్పిటల్స్ లో అత్యవసర శాస్త్రచికిత్స
- వివరాలు వెల్లడించిన వైద్యుల బృందం





పటాన్ చెరు, జూన్ 27(మనం న్యూస్) : గర్భాశయం వెలుపల పిండం పెరగడంతో ప్రాణాపాయ స్థితికి చేరిన యువతికి అత్యవసర శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు మెడికవర్ హాస్పిటల్స్ చందానగర్ వైద్యులు..ఇందుకు సంబంధించిన వివరాలను ఆసుపత్రిలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ల బృందం వెల్లడించింది. తీవ్ర కడుపు నొప్పి, రక్తపోటు ప్రమాదకర స్థాయికి పడిపోవడం, అధిక అంతర్గత రక్తస్రావంతో ప్రాణాపాయ స్థితిలో మెడికవర్ హాస్పిటల్స్కు చేరిన 34 ఏళ్ల మహిళకు వైద్యులు అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించి ప్రాణాలు కాపాడారు. కొన్ని రోజులుగా నెలసరి ఆలస్యం కావడంతో పాటు తీవ్రమైన కడుపు నొప్పి, తీవ్ర నీరసం, అస్వస్థతతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు అత్యవసరంగా ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరీక్షించే సమయానికి ఆమె రక్తపోటు కేవలం 70/40 ఝుఝుఏజ మాత్రమే ఉండగా, గుండె స్పందన నిమిషానికి 160 సార్లు నమోదైంది. పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో ఎమర్జెన్సీ వైద్యులు వెంటనే చికిత్స ప్రారంభించి ఐసీయూకు తరలించారు. ద్రవాలు అందించినప్పటికీ రక్తపోటు మెరుగుపడకపోవడంతో ప్రత్యేక ఇనోట్రోప్ మందుల సహాయంతో చికిత్స కొనసాగించారు. ఇదే సమయంలో రోగికి మూర్ఛ లక్షణాలు కనిపించడంతో వెంటనే వెంటిలేట్ప ఉంచి శ్వాసనాళాన్ని రక్షించారు. తదుపరి నిర్వహించిన పరీక్షల్లో గర్భధారణ నిర్ధారణ కావడంతో పాటు అల్ట్రాసౌండ్లో గర్భాశయం వెలుపల పిండం పెరగడం (ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ), ఫెలోపియన్ ట్యూబ్ పగిలిపోవడంతో కడుపులో భారీగా రక్తస్రావం జరిగినట్లు వైద్యులు గుర్తించారు. వెంటనే బ్లడ్ బ్యాంక్ను అప్రమత్తం చేసి అత్యవసరంగా రక్తం అందుబాటులోకి తెచ్చి శస్త్రచికిత్స చేపట్టారు. అబ్స్టెట్రీషియన్, గైనకాలజిస్ట్, ల్యాపరోస్కోపిక్ మరియు ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ భావ్య నేతృత్వంలోని ప్రసూతి, గైనకాలజీ బృందం అత్యవసరంగా శస్త్రచికిత్స నిర్వహించి పగిలిపోయిన కుడి ఫెలోపియన్ ట్యూబ్ను తొలగించారు. కడుపులో పేరుకుపోయిన సుమారు 1.5 నుంచి 2 లీటర్ల రక్తాన్ని తొలగించి రక్తస్రావాన్ని పూర్తిగా నియంత్రించారు. అనంతరం క్రిటికల్ కేర్ డిపార్ట్మెంట్ డా.రాజు ఆధ్వర్యంలో ఐసీయూలో వెంటిలేటర్ సాయంతో చికిత్స అందించారు. చికిత్స సమయంలో రోగికి అవసరమైన రక్త భాగాలను అందించడంతో పాటు ఎమర్జెన్సీ మెడిసిన్, క్రిటికల్ కేర్, ప్రసూతి గైనకాలజీ, అనస్థీషియా, బ్లడ్ బ్యాంక్ మరియు నర్సింగ్ బృందాల సమన్వయంతో సమగ్ర చికిత్స అందించారు. ఫలితంగా రోగి ఆరోగ్యం క్రమంగా మెరుగుపడి వెంటిలేటర్, ఇనోట్రోప్ మందుల అవసరం లేకుండా కోలుకుని ప్రస్తుతం పూర్తిగా ఆరోగ్యంగా డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ..ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ అనేది మహిళల ప్రాణాలకు ముప్పు కలిగించే అత్యవసర పరిస్థితి అని తెలిపారు. నెలసరి ఆలస్యం, తీవ్రమైన కడుపు నొప్పి, తలతిరగడం, బలహీనత లేదా అకస్మాత్తుగా రక్తపోటు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. సకాలంలో నిర్ధారణ, అత్యవసర శస్త్రచికిత్స మరియు మల్టీడిసిప్లినరీ వైద్య బృందం సమన్వయంతో చికిత్స అందించడం వల్లే ఈ మహిళ ప్రాణాలను కాపాడగలిగామని పేర్కొన్నారు.

# బీఆర్ఎస్‌లో చేరిన భానూరు కాంగ్రెస్ ముఖ్య నాయకులు, వార్డు సభ్యురాలు

## గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ మంత్రి హరీష్ రావు

## అభినందించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి





పటాన్ చెరు, జూన్ 27(మనం న్యూస్) : మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు సమక్షంలో పటాన్ చెరు మండలం భానూరు గ్రామపంచాయతీ వార్డు సభ్యురాలు, పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గ్రామపంచాయతీ వార్డు సభ్యురాలు ప్రవళిక నరేందర్, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సాగర్, యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కుమ్మరి శివయ్య లు తమ అనుచరులతో కలిసి శనివారం సాయంత్రం హైదరాబాద్ లో మాజీ మంత్రి హరీష్ రావు సమక్షంలో గులాబీ కండువ కప్పుకున్నారు. అనంతరం వారు పటాన్ చెరులో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారిని ఎమ్మెల్యే అభినందించారు.. శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పార్టీ విధానాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. పటాన్ చెరు నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీకి అడ్డా అని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికిని.. అదే పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారంటే ఆ పార్టీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీలను బిఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గూడెం మధుసూదన్ రెడ్డి, విజయ్ కుమార్, శ్రీధర్ చారి, శ్యాంసుందర్ రెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితాలతోచెలగాటమాడుతున్న కేంద్రం

- పేపర్ లీకులతో మంచి విద్యార్థుల ఆత్మహత్యలు
- ఛాత్రోస్ కి గూంజ్' ఉద్యమాన్ని తీవ్రతరం చేద్దాం
- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూంకుంట అంక్షారెడ్డి




గజ్వేల్ జూన్ 27 మనం న్యూస్ దేశంలో విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందని, దేశం వెనుకడుగు వేస్తూ నిరుద్యోగం, ప్రశ్న పత్రాల లీకేజీకి వారి నుండి జవాబు కరువైందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూంకుంట అంక్షారెడ్డి నిలదీశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన 'చాత్రోస్ కీ గూంజ్' లో భాగంగా సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున తరలివచ్చి మద్దతు పలికారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు తూాకుంట అంక్షారెడ్డి, పిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ మాట్లాడుతూ ఉద్యోగ నియామకాల్లో జాప్యం, నీట్ వంటి ఉత్తమ పరీక్షల పేపర్ లీకేజీ తదితర కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో వందలాది మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత భవిష్యత్తు కోసం కష్టపడి చదువుతున్న విద్యార్థుల శ్రమ వృధా అవుతుందని, ముఖ్యంగా దేశ భవిష్యత్తు విద్యార్థులు, యువతపైనే ఆధారపడి ఉండగా, వారి జీవితాలతో ఆటలాడుకుంటున్న బిజెపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని స్పష్టం చేశారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన అబద్దాలకోరు నరేంద్ర మోడీ అని ఎద్దేవా చేశారు. యువత చైతన్యవంతులై ప్రధాని నరేంద్ర మోడీ ఆటలు సాగనీయవద్దు అనే లక్ష్యంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ ఉద్యమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ సారాధ్యంలోని బిజెపి ప్రభుత్వం విద్యా వ్యవస్థ వైఫల్యాలకు, విద్యార్థుల ఆత్మబలిదానాలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. యూపీఎస్సీ, ఆర్పిబి, జేఈఈ, నీట్ వంటి పరీక్షలతో కాంగ్రెస్ విద్యార్థులను తీర్చి దిద్దగా, ప్రస్తుత బిజెపి సర్కార్ వాటిని నిర్వీర్యం చేస్తున్నట్లు ఆరోపించారు. ఉన్నత విద్యావంతుడు రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా శ్రమిద్దామని, అవినీతి, అక్రమాల్లో కూరుకుపోయిన బిజెపి కార్పొరేట్ సంస్థలకు దేశ సంపద కట్టబెడుతూ పేదలను మరింత ఆర్థికంగా కుంగదీస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు సుఖేందర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొండల్ రెడ్డి, వర్గల్ మోహన్, మొనగారి రాజు, సారిక శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్స్ విష్ణు, గుంటుకు లక్ష్మి శ్రీనివాస్, ఉపేందర్ రెడ్డి, రమేష్, నక్క రాములు, సర్పంచులు అశోక్ రెడ్డి, ఛానరెడ్డి, గోపాల్, ప్రశాంత్, కర్ణాకర్ నాయకులు సమీర్ కర్ణాకర్ రెడ్డి అజహార్, అజ్గర్, డప్పు గణేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

# చుక్కల మందకు సకల ఏర్పాట్లు



- 0-5 సంవత్సరాలలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలి
- జిల్లాలో 94 321 పిల్లలను గుర్తింపు
- జిల్లా వ్యాప్తంగా 568 పల్స్ పోలియో కేంద్రాల ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ కే. హైమావతి

సిద్దిపేట జూన్ 27; మనం ప్రతినిధి: ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లను వైద్య ఆరోగ్య శాఖ ద్వారా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ కె. హేమావతి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 94,321 అర్హులైన 0-5 సంవత్సరల పిల్లలకు చుక్కల మందు వేసేందుకు 568 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధన్ రాజ్ నేతృత్వంలో 57 మంది సూపర్వైజర్ల, డిప్యూటీ డిఎం హెచ్ వోలు, ప్రోగ్రామ్ ఆఫీసర్ల పర్యవేక్షణలో 32 ట్రాన్సిస్ట్ పాయింట్లను ( బస్టాండు, రైల్వేస్టేషన్లో,) పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేపట్టామన్నారు. ఇవే కాకుండా మొబైల్ టీం ల ద్వారా సమస్యాత్మక ప్రదేశాల్లో ( ఇటుక బట్టీలు, భవన నిర్మాణ రంగాల ప్రాంతంలో, సిమెంట్ ఫ్యాక్టరీలు, క్వారీలు, బిక్షాటన కొరకు వలస వచ్చిన వారి అర్హులైన పిల్లలను గుర్తించి చుక్కలు వేస్తారని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్యం కేంద్రాలు, బస్తీ దవాఖాన్ లో, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు తదితర ప్రాంతాల్లో పోలియో చుక్కల పంపిణీ కేంద్రాలను సిద్ధం చేశామని చెప్పారు. అప్పుడే పుట్టిన బిడ్డను మొదలుకొని ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయాలనే లక్ష్యంతో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ సిబ్బందికి శిక్షణతో పాటు అవసరమైన సూచనలు అందించామని తెలిపారు. దూర ప్రాంతాలు, , వలస కుటుంబాల పిల్లలను కూడా గుర్తించి ఒక్క చిన్నారి కూడా మిస్ కాకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని చెప్పారు. తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. గతంలో పోలియో చుక్కలు వేసినా మరోసారి వేయించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి మరింత పెరుగుతుందని తెలిపారు. జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు ఆదివారం పోలియో చుక్కల కేంద్రంలో పోలియో చుక్కలు వేయించని పిల్లలకు, 29 సోమవారం మరియు 30వ మంగళవారం రోజులలో ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలు అంగన్వాడి కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు తీసుకొని పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలు స్వచ్ఛంద సంస్థలు ఇతర లైన్ డిపార్ట్మెంట్ అధికారులు గ్రామపంచాయతీ సిబ్బంది ఐసిడిఎస్, విద్యాశాఖ, సిబ్బంది అందరూ సహకరించాలని ఆ ప్రకటనలో కోరారు.

# జోగులాంబ గద్వాల జిల్లాలో అంగన్వాడీ పోస్టులు ఖాళీ



- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

ఉమ్మడి మహబూబ్ నగర్, జూన్ 27 (మనం బ్యూరో): జోగులాంబ గద్వాల జిల్లాలో 64 అంగన్వాడీ టీచర్, 9 అంగన్వాడీ ఆయా మొత్తం 73 పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం ఉన్నట్లు జోగులాంబ గద్వాల్ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఈనెల జూన్ 29 నుండి జూలై 8 వరకు అంగన్వాడీ టీచర్, ఆయా పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు. జోగులాంబ గద్వాల్ జిల్లాలోని (3) ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ కార్యాలయ పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్లు, గిరిజన ప్రాంతాల అంగన్వాడీ ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐసీడీఎస్ గద్వాల్ అర్బన్ ప్రాజెక్టులో 28 అంగన్వాడీ టీచర్ పోస్టులు,5 గిరిజన ప్రాంతాల అంగన్వాడీ ఆయా పోస్టులు కలిపి మొత్తం 33 పోస్టులు, ఐసీడీఎస్ మల్దకల్ ప్రాజెక్టులో 22 అంగన్వాడీ టీచర్ పోస్టులు, 4 గిరిజన ప్రాంతాల అంగన్వాడీ ఆయా పోస్టులు కలిపి మొత్తం 26 పోస్టులు, ఐసీడీఎస్ మానవపాడు ప్రాజెక్టులో 14 అంగన్వాడీ టీచర్ పోస్టులు ఉన్నాయన్నారు. ఈ మూడు ప్రాజెక్టులలో కలిపి మొత్తం 64 అంగన్వాడీ టీచర్ పోస్టులు,9 గిరిజన ప్రాంతాల అంగన్వాడీ ఆయా పోస్టులు, మొత్తం 73 పోస్టులను భర్తీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అర్హులైన మహిళా అభ్యర్థులు ఈ నెల 29వ. తేదీ నుంచి జూలై 8వ. తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అర్హతలు, నిబంధనలు, పోస్టుల వివరాలు, దరఖాస్తు విధానం కోసం మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిక వెబ్సైట్ అయిన https://www.wdcw.tg.nic.in/ ను సందర్శించాలని సూచించారు. ఆన్లైన్లో సమర్పించిన దరఖాస్తులు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం వ్యక్తం చేశారు. అవసరమైతే ఈ నియామక ప్రక్రియను ఏ దశలోనైనా రద్దు చేసే అధికారం జిల్లా కలెక్టర్ కు ఉంటుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# సిగాచీ పరిశ్రమ ఘోర ప్రమాదానికి ఏడాది

- బాధిత కుటుంబాలకు అందని పూర్తి నష్టపరిహారం
- ఇప్పటివరకు 24 కోట్ల 61లక్షలు మాత్రమే అందింది
- ఇంకా అందవల్సింది 29కోట్ల 38లక్షలు
- సిఐటియు రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు అతిమేల మానిక్



సంగారెడ్డి జూన్ 27 మనంప్రతినిధిః పాశమైలారం పారిశ్రామిక ప్రాంతంలోని సిగాచి పరిశ్రమలో ఘోర ప్రమాదం జరిగి 54 మంది మృత్యువాత పడి ఘటనకు జూన్ 30కి ఏడాది అవుతుందని, నేటికీ కార్మికుల బాధిత కుటుంబాలకు పూర్తి నష్టపరిహారం అందలేదని వెంటనే మిగిలిన నష్టపరిహారం అందజేయాలని సిఐటియు రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు అతిమేల మానిక్ పత్రికా ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. సిగాచీ పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ఘోర ప్రమాదం జరిగిందని నిపుణుల కమిటీతో సహ నివేదికలు తెలిపాయని అన్నారు. అయినా కంటితుడుపు చర్యగా మాత్రమే కంపెనీ సీఈఓ ను అరెస్టు చేశారని అన్నారు చేయడం ప్రమాదం జరిగిన మరుసటి రోజే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘటన స్థలాన్ని సందర్శించి చనిపోయిన మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు నష్టపరిహారం ఇప్పిస్తామని ప్రకటించారని సిగాచి కంపెనీ యాజమాన్యం సైతం సెబీకి ఇచ్చిన లేఖలో బాధిత కుటుంబాలకు కోటి రూపాయలు ఇస్తామని తెలియజేసిందని అన్నారు. కానీ నేటికీ పూర్తి అందలేదని అన్నారు. ఇప్పటివరకు బాధిత కుటుంబాలకు మొత్తం 24 కోట్ల 61 లక్షల 21 వేల 290 రూపాయలు మాత్రమే అని ఇంకా 29కోట్ల 38లక్షల 78వేల 710 రూపాయలు రావాలని అన్నారు. ఒక్కొక్క కార్మికుడికి 45 లక్షల నుండి 57 లక్షల వరకు మాత్రమే నష్టపరిహారం అందిందని అన్నారు. ఇంకా బాధిత కుటుంబాలకు అందవలసిన నష్టపరిహారం ఒక్కొక్కరికి అరకోటి పైనే ఉన్నాయని అన్నారు వెంటనే మిగిలిన నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిగాచి పరిశ్రమ వద్ద ఆందోళన చేపడుతామని హెచ్చరించారు..

# హుస్నాబాద్ రోడ్లకు మహర్దశ

## నియోజకవర్గంలో 74.49 కి.మీ రహదారుల హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ అభివృద్ధి

## రూ.148.97 కోట్లు మంజూరు

## హుస్నాబాద్ అభివృద్ధిలో రోడ్లు కీలక మైలురాయిగా నిలుస్తాయన్న మంత్రి పొన్నం

సిద్దిపేట జూన్ 27 ;మనం ప్రతినిధి: హుస్నాబాద్ నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. నియోజకవర్గం లోని 74.49 కిలోమీటర్ల రోడ్ల అభివృద్ధికి రూ 148.97 కోట్లు మంజూరు చేసింది. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ ఏ ఎం) పద్ధతిలో అభివృద్ధి పనులు జరగనున్నట్లు తెలుస్తుంది. హనుమకొండ, కరీంనగర్, సిద్దిపేట జిల్లాల పరిధిలోని మొత్తం 8 ప్రధాన రహదారి పనులు ఉన్నాయి. వీటి ద్వారా హుస్నాబాద్ నియోజకవర్గంలోని గ్రామాలకు మెరుగైన రహదారి అనుసంధానం కల్పించడంతో పాటు ప్రజలకు సురక్షితమైన, వేగవంతమైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది. హుస్నాబాద్ నియోజకవర్గంలో వివిధ జిల్లాల పరిధిలోని గ్రామాల రహదారుల కు మంజూరైన నిధుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. హనుమకొండ జిల్లా పరిధిలో... 1.హనుమకొండ జిల్లాలోని గుంటూరుపల్లి - కేశవాపూర్ వయా తిమ్మాపూర్ రహదారి బలోపేతం (3.99 కి.మీ.) రూ.3.5 కోట్లు ప్రతిపాదనలు చేశారు.. 2.హనుమకొండ జిల్లాలోని వంగర - ములకనూరు - భీమదేవరపల్లి రహదారి బలోపేతం 5.00 కి.మీ లకు రూ.4.39 కోట్లు 3.హనుమకొండ జిల్లా పరిధిలోని బావుపేట్ - కమలాపూర్ రోడ్ (బావుపేట్ , ఆరేపల్లి, గుంటూరుపల్లి ,శంబునిపల్లి , కనిపర్తి కమలాపూర్) 6.00 కి.మీ లకు రూ.6.95 కోట్లు కరీంనగర్ జిల్లా పరిధిలో 4.కొత్తగట్టు-దుద్దెనపల్లి రహదారి బలోపేతం (10.90 కి.మీ లకు రూ.9.57 కోట్లు మంజూరు అయ్యాయి. సిద్దిపేట జిల్లా పరిధి లో మంజూరైన రోడ్లు 5.తంగలపల్లి - బద్దిపడిగ వయా గుండారెడ్డిపల్లి రహదారి బలోపేతం 8.00 కి.మీ లకు రూ.7.02 కోట్లు 6.ముల్కనూర్-కోహెడ రహదారి బలోపేతం 16.00 కి.మీ లకు రూ 18.53 కోట్లు 7.కోహెడ - దేవక్కపల్లి వయా రామచంద్రాపూర్ రహదారి విస్తరణ, బలోపేతం 14.60 కి.మీ లకు రూ 40.1 కోట్లు 8.హుస్నాబాద్-అక్కన్నపేట పీడబ్ల్యూడీ రహదారి విస్తరణ, బలోపేతం 10.00 కి.మీ. లకు రూ.58.91 కోట్లు మంజూరయ్యాయి. హుస్నాబాద్ నియోజకవర్గంలో భారీ మొత్తంలో రోడ్ల అభివృద్ధికి 148.97 కోట్ల రూపాయలు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ,మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి లకు మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు.ఈ పనులు పూర్తయితే గ్రామీణ ప్రాంతాల ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు వ్యవసాయ, వాణిజ్య, విద్య, వైద్య సేవలకు మెరుగైన అనుసంధానం ఏర్పడుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఈ రహదారి ప్రాజెక్టులు కీలక మైలురాయిగా నిలుస్తాయన్నారు.

# జూన్ 29న వరంగల్‌కు బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నభిన్

- గిరిజన మేధావులతో కీలక భేటీ
- తెలంగాణలో అధికారమే లక్ష్యంగా బీజేపీ వ్యూహం

హన్మకొండ, జూన్ 26: తెలంగాణలో అధికారం చేజిక్కించుకోవడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే బీజేపీ జాతీయ అధ్యక్షులు ₹ నితిన్ నభిన్ ఈనెల 29న, సోమవారం వరంగల్ నగరంలో రాష్ట్రంలోని 33 గిరిజన తెగలకు చెందిన మేధావులు, ప్రముఖులు, విద్యావంతులతో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. ఈ విషయాన్ని బీజేపీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎంపీ సీతారాం నాయక్ గురువారం అధికారికంగా ప్రకటించారు. హరిత కాకతీయ వేదికగా మేధోమథనం: జూన్ 29 సోమవారం మధ్యాహ్నం వరంగల్లోని హరిత కాకతీయ హోటల్ ఈ చారిత్రాత్మక భేటీకి వేదిక కానుంది. తెలంగాణలో దాదాపు 10 శాతం ఉన్న గిరిజన జనాభా రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసే శక్తిగా మారింది. 12 ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాలతో పాటు మరో 20కి పైగా జనరల్ స్థానాల్లో గిరిజన ఓటర్లు నిర్ణయాత్మక శక్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో గిరిజన సమాజాన్ని నేరుగా కలవాలని బీజేపీ అధిష్టానం నిర్ణయించింది. సమస్యల సాధనే అధికారానికి సోపానం: తెలంగాణ రాష్ట్రంలో గిరిజనులు ఎదుర్కొంటున్న పోడు భూముల సమస్య, 1/70 చట్టం అమలు, రిజర్వేషన్ల పెంపు, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు, ఐటీడీఏల బలోపేతం, తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చడం వంటి దీర్ఘకాలిక సమస్యలపై జాతీయ అధ్యక్షులు గిరిజన మేధావులతో ముఖాముఖి చర్చించనున్నారు. 'గిరిజనుల మనసు గెలిస్తేనే తెలంగాణ గడ్డపై కాషాయ జెండా ఎగరేస్తుంది' అనే సంకల్పంతో



బీజేపీ ఈ భేటీని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సహపంక్తి భోజనంతో సామాజిక సమీకరణ: సమావేశం అనంతరం శ్రీ నితిన్ నభిన్ గిరిజన మేధావులతో కలిసి సహపంక్తి భోజనం చేయనున్నారు. 'మీలో ఒకడిగా మీ సమస్యలు వింటాం' అనే సంకేతాన్ని గిరిజన సమాజానికి ఇవ్వడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో ప్రధాని నరేంద్ర మోదీ గిరిజన మహిళ ద్రౌపది ముర్ము₹ను రాష్ట్రపతిని చేయడం, ₹భగవాన్ బిర్సా ముండా జయంతిని 'జనజాతీయ గౌరవ దివస్'గా ప్రకటించడం వంటి నిర్ణయాలు గిరిజనుల్లో బీజేపీపై నమ్మకాన్ని పెంచాయి. సీతారాం నాయక్ వ్యూహరచన: ఈ భేటీకి సంబంధించిన మొత్తం ఏర్పాట్లను మాజీ ఎంపీ సీతారాం నాయక్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. 'గత ప్రభుత్వాలు గిరిజనులను ఓటు బ్యాంకుగానే చూశాయి. కానీ బీజేపీ గిరిజనుల ఆత్మగౌరవానికి, అభివృద్ధికి కట్టుబడి ఉంది. జాతీయ అధ్యక్షుల వారి పర్యటనతో రాష్ట్రంలోని గిరిజన సమాజం పూర్తిగా బీజేపీ వైపు మళ్లుతుంది. ₹మిషన్ 2028₹లో భాగంగా 33 గిరిజన తెగలను ఏకం చేసి, తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం' అని సీతారాం నాయక్ ధీమా వ్యక్తం చేశారు. అధికారానికి గిరిజన బాట: రాష్ట్రంలో 119 అసెంబ్లీ స్థానాలకు గాను బీజేపీ ఇప్పటికే 60కి పైగా స్థానాలపై గురిపెట్టింది. అందులో గిరిజన ప్రభావిత నియోజకవర్గాలు 30కి పైగా ఉన్నాయి. మహబూబాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల్లో గిరిజనుల మద్దతు కూడగడితే అధికారానికి చేరువైనట్లేనని బీజేపీ లెక్క. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి కేటాయిస్తున్న నిధులు, అమలు చేస్తున్న ఏకలవ్య మోడల్ స్కూళ్లు, వన్ లవ్య సికిల్ సెల్ అనీమియా నిర్మూలన మిషన్, పీఎం జన్మన్ వంటి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ నిర్ణయించింది. ఈ భేటీ ద్వారా గిరిజన మేధో వర్గాన్ని ఆకట్టుకొని, వారి ద్వారా క్షేత్రస్థాయిలో గిరిజన సమాజంలోకి చొచ్చుకెళ్లడం బీజేపీ వ్యూహం. 'గిరిజనుల సమస్యలు తీర్చే పార్టీ బీజేపీ మాత్రమే' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లి, వచ్చే ఎన్నికల్లో తెలంగాణ పీఠాన్ని కైవసం చేసుకోవాలని కమలనాథులు పావులు కదుపుతున్నారు. జూన్ 29 భేటీ తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు కానుంది. ఈ కార్యక్రమం లో బిజెపి డోర్నకల్ నాయకులు

## ముగింపులు ఉండవు!

మనుషుల్లోనే కాదుభూమి పలకల్లోనూ
నిత్య కదలికలు ,కలయికలు ఉంటాయి
దేశాల అంతర్గత సంక్షోభల్లాగే
భూ అంతరపొరల్లోని ఆటుపోట్లు
అగుపించక అల్లకల్లోలం సృష్టిస్తుంటాయి
ఆకాశం,వీస్తున్న గాలి సాక్షిగావెనిజువెలా దేశం
భూకంపం దాటికి చిగురుటాకులా వణికి
నిముషాల్లోనే ధ్వంసమై కన్నీళ్లకథల దేశమయింది

దశాబ్దాల కాలంగా
స్వాభిమానం జెండా ఎగరేసి
అభివృద్ధి పాట పాడుతున్న వెనుజువెలా
పరిపాలనా పాలరాతిమందిరానికి బూజులా
అవినీతి అనకొండల స్వార్థ సర్పకౌగిళ్లలో
బహుళ అంతస్థుల భవనాలు
అందాల ఆకాశ హర్మ్యాలు
పేక మేడల్లా నేలమట్టం కాకుండా ఏమౌతాయి?
భూకంప భూతానికి
వెనుజువెల వేల ఆశలు భూస్థాపితం
కాకుండా ఆకాశంలోకి ఎలా రెక్కవిప్పుతాయి?

జంట కంపనాల దెబ్బకు కకావికలమై
కాళరాత్రి బిక్కుబిక్కుమంటున్న కారకస్ నగరాన్ని
భయాందోళనలు భయంకరంగా ఏలుతున్నాయి!
హాహాకారాల్లోఅంతులేని దుఃఖాల్లో వెనుజువెలా
తల్లిలేని పసిపిల్లలా తల్లడిల్లుతోంది చూడు
లా గువేరా నేల,వంతెనలు,
రోడ్లు, లోతుగా చీలిపోయి
కరెంటు స్తంభాలు,కలల కట్టడాలు

నేలమీద కుప్పకూలిపోయి
అప్రకటిత అంధకారం అలుముకున్న
వెనుజువెల పై మృత్యుదేవతే తిష్ఠవేశాక
వెనుజువెలాకాశం కింద శిథిలాలు శిథిలాలు!
ఆకాశాన్నంటే ఆర్తనాదాలు మధ్య
వేల శిథిలాల అడుగున చిక్కుకున్న
మానవ శవగణనే కడకు మిగిలింది.

స్మశానాన్ని తలపిస్తున్న నగరం
మిన్నంటే సామూహిక దుఃఖాల్ని మోస్తూ
కలచివేసే కల్లోల హృదయాల్ని
రక్తరాగ బంధాల దీన చూపుల్ని
వర్ణించజాలవు కవివాక్యాలు సైతం

కలల్ని ముంచిన కరేబీయన్ సాగరతీరంలో
కొట్టుమిట్టాడుతున్నవి రాజధానినగర జీవితాలు
ఓరినోకో నదీనీళ్లకు పోటీగా
ప్రవహిస్తున్నవి ప్రజాకన్నీళ్లు
భూకంప ద్వయ విలయంలో
విలవిలలాడుతోంది వెనుజువెలా
ఆపన్న హస్తంకోసం ఆశగా

ఎదురుచూస్తున్న వెనుజువెలను
అక్కున చేర్చుకోవాలి ప్రపంచదేశాలు
ఉన్నఫలంగా ఉప్పెనలా ముంచెత్తే ఉపద్రవాలకు
యుగాల నుండి మొదలైన ఈ యుద్ధాలకు
విరామాలు తప్ప ముగింపులు ఉండవు బహుశా.

**రమేశ్ నల్లగొండ**
8309452179

## ఉత్తర దక్షిణాలు- భారతదేశపు మహావిభజన పుస్తకావిష్కరణ

**రచయిత:**
నీలకంఠన్ ఆర్.ఎస్
**తెలుగు అనువాదం:**
అక్కిరాజు భట్టిప్రోలు
**పుస్తకావిష్కరణ**
శ్రీ పరకాల ప్రభాకర్
ఆర్థిక రాజకీయ శాస్త్రవేత, రచయిత
**వక్తలు:**
పరకాల ప్రభాకర్, కే.శ్రీనివాస్, నీలకంఠన్ ఆర్ఎస్, అక్కిరాజు భట్టిప్రోలు, శ్రీమతి ఉమా సుధీర్
**వేదిక...** ఆదివారం 28 జూన్న ప్రెస్క్లబ్, సోమాజిగూడ. హైదరాబాద్
సాయంత్రం 6.30 ని..

# స్థితప్రజ్ఞుడు, రాజనీతిజ్ఞుడు పీవీ



బహుముఖ ప్రజ్ఞాశాలి, సంస్కరణాభిలాషి, బహుభాషా కోవిదుడు,అపర చాణిక్యుడుగా పేరుగాంచిన రాజకీయ దురంధరుడు, సాహితీవేత్త, దక్షిణ భారతం నుండి మొట్టమొదటిగా ప్రధానిపీఠం అధిష్ఠించిన తెలుగుతనపు ఠీవి మన పీ.వి.

పీ.వి.పూర్తిపేరు పాములపర్తి వేంకట నరసింహారావు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం 'వంగర' పీ.వి. స్వగ్రామం. ఆయన పుట్టింది వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామం. 1921 జూన్ 28న పీ.వి. రుక్మాబాయమ్మ, సీతారామారావు ఆయన తల్లిదండ్రులు. అయితే పీ.వి.ని వంగర గ్రామానికి చెందిన పాములపర్తి రంగారావు, రత్నాబాయి దంపతులు దత్తత తీసుకున్నారు. ఆవిధంగా పీ.వి. పాములపర్తి వారి వారసుడైనాడు.

పీ.వి. ప్రాథమిక విద్య వంగరలో, హైస్కూల్ విద్య హనుమకొండలో జరిగింది. దేశమంతా స్వాతంత్ర్యోద్యమం జరుగుతున్న రోజులవి. బ్రిటిషు ప్రభుత్వానికి విధేయుడైన నిజాం హైదరాబాదు రాష్ట్రంలో వందేమాతర గీతం పాడకూడదని హుకుం జారీ చేశాడు. ఇంటర్ విద్యను అభ్యసిస్తున్న పీ.వి. దేశ స్వాతంత్ర్యోద్యమం పట్ల ఆకర్షితుడైనాడు. విద్యార్థి దశలోనే నిజాం నిరంకుశ విధానాలపై వ్యతిరేకత కలిగిన పీ.వి. నిజాం ఆజ్ఞను ధిక్కరిస్తూ వందేమాతర గీతాలాపన చేస్తూ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నాడు. తత్ఫలితంగా నిజాం ప్రభుత్వం పీ.వి.ని రాష్ట్రంలో ఎక్కడా చదవడానికి వీలులేదని ఆజ్ఞాపించింది. పీ.వి. నాగపూర్ వెళ్ళి ఇంటర్‌ను, పూనేలో B.Sc డిగ్రీని, నాగపూర్ విశ్వ విద్యాలయంలో L.L.B. అభ్యసించి అన్నింటా ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడైనాడు. ఆ తరువాత హైదరాబాదుకు తిరిగివచ్చి బూర్గుల రామకృష్ణారావు వద్ద జూనియర్ లాయర్ న్యాయవాద వృత్తిని చేపట్టాడు. స్వామి రామానందతీర్థ పిలుపుతో కాంగ్రెసులో చేరి నిజాం వ్యతిరేకోద్యమంలోను, స్వాతంత్ర్యోద్యమంలోను చురుకుగా పాల్గొన్నాడు. స్వామి రామానంద తీర్థను తన రాజకీయ గురువుగా భావించాడు.

1948లో జరిగిన పోలీసు యాక్షన్ వల్ల హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్ లో విలీనమైన తరువాత 'కాకతీయ పత్రిక'ను స్థాపించాడు. ఆ పత్రికలో 'జయ' అనే మారు పేరుతో రచనలు చేశాడు. అలాగే ఆ పత్రికలో 'విజయ' అనే కలం పేరుతో తెలంగాణ సాయుధ పోరాట నేపథ్యంలో 'గొల్ల రామవ్వ' కథను రాశాడు. ఆవిధంగా పాత్రికేయుడుగా, పత్రికా రచయితగా గుర్తింపు పొందాడు.

హైదరాబాదు రాష్ట్రంలో 1952లో జరిగిన తొలి శాసనసభ ఎన్నికలతో పీ.వి. రాజకీయ ప్రస్థానం ప్రారంభమైనది.ఆ ఎన్నికల్లో పోటీచేసిన పీ.వి. తన ప్రత్యర్థి తెలంగాణ సాయుధ పోరాట యోధుడైన బద్దం ఎల్లారెడ్డి చేతిలో ఓటమి చెందాడు. ఆ ఓటమే భవిష్యత్తులో పీ.వి. ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి తొలిమెట్టు వేసిందని చెప్పుకోవచ్చు. ఆ తరువాత వరుసగా 1957, 1962, 1967, 1972లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికల్లో పీ.వి. నేటి పెద్దపల్లి జిల్లా మంథని నియోజక వర్గం నుండి వరుసగా నాలుగుసార్లు శాసనసభ్యుడుగా గెలుపొందాడు. 1962లో నీలం సంజీవరెడ్డి మంత్రివర్గంలో న్యాయశాఖ, జైళ్ళశాఖ, సమాచార శాఖల మంత్రిగా బాధ్యతలు చేపట్టి ఆయా శాఖల్లో సంస్కరణలకు శ్రీకారం చుట్టాడు. ముఖ్యంగా జైళ్ళ శాఖలో ఓపెన్ జైలును ప్రతిపాదించి దానిని ఏర్పాటు చేశాడు. ఖైదీలలో పరివర్తన తీసుకురావడానికి



ఎన్నో చర్యలు తీసుకున్నాడు. తివాచీలు, చద్దర్లు మొదలైన వాటి తయారీలో ఖైదీలకు శిక్షణ ఇప్పించి వాటిని తయారు చేయించి జైళ్ళశాఖ ద్వారా అమ్మకానికి పెట్టించి ఆదాయ వనరును సమకూర్చాడు.

1964-67 మధ్యకాలంలో దేవాదాయ శాఖ మంత్రిగా రాష్ట్రంలో శిథిలమైన దేవాలయాలకు రాష్ట్ర బడ్జెట్లో నిధులు కేటాయించి ఆ దేవాలయాలను ఉద్ధరించాడు. 1967లో వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా ఉంటూ ప్రసూతి కేంద్రాలలో ఆధునిక వసతులను సమకూర్చడమే కాకుండా తల్లీబిడ్డల సంక్షేమం కొరకు కొత్త పథకాలను ప్రవేశపెట్టి ప్రయోజనాలు కల్పించాడు. 1968లో విద్యాశాఖ మంత్రిగా పనిచేసి విద్యా రంగంలో సంస్కరణలు తీసుకువచ్చాడు. పిల్లలు చదువుకోవడానికి సకల సదుపాయాలతో కూడిన గురుకులాలను స్థాపించి తరువాతి వారికి ఆదర్శంగా నిలిచాడు. పీ.వి. కలిగించిన ప్రేరణ, స్ఫూర్తితోనే ఇవాళ రాష్ట్రంలో ఇబ్బడి ముబ్బడిగా గురుకులాలు ఏర్పడుతున్నాయంటే అతిశయోక్తికాదు. తెలుగు అకాడమి రూపకల్పన చేసినవాడు. పీ.వి.సమర్థతను గుర్తించిన భారతీ జాతీయ కాంగ్రెసు పార్టీ అధిష్ఠానం ఆయనను 1971లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నియమించింది. ముఖ్యమంత్రిగా పీ.వి. సంస్కరణ భూయిష్టమైన పాలన కొనసాగించినాడు. అందులో భాగంగా భూసంస్కరణ చట్టం తీసుకువచ్చాడు. అది కొంతమంది భూస్వాములకు నచ్చలేదు ఆయనకు వ్యతిరేక వర్గంగా కూటమి కట్టారు. శ్రీమతి ఇందిరాగాంధీకి పీ.వి.పై చాడీలు చెప్పారు. ఆ భూస్వామిక కుట్రదారుల వల్ల ప్రజాస్వామిక దృక్పథం గల పీ.వి. ముఖ్యమంత్రి పదవిలో ఉండలేకపోయాడు. అధిష్ఠానం ఆయనను ముఖ్యమంత్రి పదవి నుండి తప్పించింది.

పీ.వి. సేవలు రాష్ట్రానికంటే దేశానికి అవసరమని భావించిన ఇందిరాగాంధీ ఆయనను అఖిల భారత కాంగ్రెసు పార్టీకి ప్రధాన కార్యదర్శిగా నియమించింది. 1977లో అప్పటి పరిస్థితుల బట్టి దేశవ్యాప్తంగా కాంగ్రెసు పార్టీ పరాజయం పాలైనా పీ.వి. మాత్రం హన్మకొండ నుండి పార్లమెంటుకు ఎన్నికైనాడు. ప్రతిపక్ష సభ్యుడుగా హుందాగా వ్యవహరిస్తూ ప్రభుత్వానికి కీలక సూచనలు చేశాడు. 1980లో కాంగ్రెసు తిరిగి అధికారంలోకి వచ్చింది. అప్పుడు కూడా పీ.వి. హనుమకొండ నుండే గెలిచాడు. శ్రీమతి ఇందిరాగాంధీ మంత్రివర్గంలో విదేశాంగ మంత్రిగా పనిచేశాడు.

పీ.వి.కి దాదాపు 18 భాషలు వచ్చు. తన బహుభాషా నైపుణ్యంతో, చతురతతో భారత విదేశాంగమంత్రిగా ఐక్యరాజ్య సమితిలో, ఇతర దేశాలలో భారతదేశ ఔన్నత్యాన్ని చాటుతూ దేశ గౌరవాన్ని ఇనుమడింపజేశాడు. ఆయా దేశాలతో సత్సంబంధాలు కలిగే విధంగా వ్యవహరించేవాడు.

ఇందిరాగాంధీ మరణం తరువాత రాజీవ్‌ంధీ మంత్రివర్గంలో మానవ వనరుల శాఖ, హోంశాఖలకు మంత్రిగా బాధ్యతలు చేపట్టాడు. 1991లో రాజీవ్ గాంధీ హత్య తరువాత దేశపాలన సంక్షోభంలో పడింది. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో పీ.వి. దేశ ప్రధానిగా పదవీ బాధ్యతలను స్వీకరించాడు. మైనారిటీలో ఉన్న ప్రభుత్వాన్ని పూర్తికాలం 5 సం.లు నడిపిన ఘనత పీ.వి.కే చెల్లుతుంది. ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి దేశ ఆర్థిక పరిస్థితిని పటిష్ట పరచాడు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాడు. ఈ విధంగా పాలనా రంగంలో తనదైన సంస్కరణ ముద్రవేసి భవిష్యత్తు తరాలకు దార్శనికుడైనాడు.

రాజకీయ నాయకులలో సాహితీ స్పర్శ కలిగినవారు అరుదుగా ఉంటారు. అలాంటి వారిలో పీ.వి. ఒకడు. పీ.వి. ఎన్నో సాహితీ చర్చల్లో పాల్గొనేవాడు. సాహిత్య ప్రసంగాలు చేసేవాడు. కాళోజి సోదరులతో సాహిత్య వేదికలను పంచుకొనేవాడు. విశ్వనాథ సత్యనారాయణ రాసిని వేయిపడగలు నవలను 'సహస్రఫణ్' పేరుతో హిందీలోకి అనువదించాడు. దీనికి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు లభించింది. 'పన్ లక్షత్ కోనఘతో' అనే మరాఠీ పుస్తకాన్ని అబల జీవితం అనే పేరుతో అనువదించాడు. పీ.వి. తన రాజకీయ, సాహిత్య అనుభవాలతో ఇంగ్లీషులో 'ది ఇన్సైడర్' అనే పుస్తకం రాశాడు. అది తెలుగులో 'లోపలి మనిషి' పేరుతో అనువదించబడింది.

పీ.వి. ఆచరణశీలి. భూ సంస్కరణలో భాగంగా తన కుటుంబానికి వంగరలో భూపరిమితి చట్టానికి మించి ఉన్న భూములను పేదలకు పంచాడు. ఏదో సంపాదించాలని, దానిని వెనుక వేసుకోవాలనే యావ లేనివాడు. అధికారం కోసం పార్టీలు మారని రాజనీతిజ్ఞుడు. చివరివరకు కాంగ్రెసు పార్టీ విధేయుడుగా, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీలకు నమ్మకస్థుడుగా కొనసాగాడు. దేశాభ్యుదయం కొరకు కృషిచేసిన మహర్షి పీ.వి.

ప్రపంచంలో ఏ తెలుగువాడైనా 'మనవాడు' అని గర్వంగా చెప్పుకొనే తెలుగు తేజం, తెలంగాణ జాతిరత్నం పీ.వి. నరసింహారావు. ఆయన 2004 డిసెంబరు 23న గుండెపోటుతో మరణించాడు. తెలుగుజాతి ఉన్నంతవరకు పీ.వి.కీర్తి జ్యోతి ప్రకాశిస్తూనే ఉంటుంది.

**జూన్ 28 పీవీ నరసింహారావు జయంతి**

**- సుధాకర్.ఏ.వి**
9000674747

# ఆర్థిక ప్రణాళికల రూపకల్పనలో గణాంకాలే దిక్సూచి



మానవ అభివృధిలో గణాంకాలు ముఖ్య పాత్ర పోషిస్థాయి. కేంద్ర రాష్ట్ర స్థానిక,ప్రభుత్వాలు అభివృద్ధి ప్రణాళికలు సంక్షేమ పథకాలు ఆర్థిక విధానాల రూపకల్పనలోగణాంకాలు దిక్సూచిగా పని చేస్తాయి. కేంద్ర రాష్ట్రాల మధ్య వనరుల పంపిణీ కేటాయింపు పెట్టుబడులు స్థాయిని నిర్ణయించడానికి ఆధునిక ప్రభుత్వాలకు గణాంకాలు అవసరం. ఖచ్చితమైన డాటా కనుగొనడానికి గణాంకాలు ఉపయోగపడుతాయి. ఉదాహరణకు 10 సంవత్సరాలలో జనాభా పెరుగుదల తెలియాలంటే గణాంకాలు డాటాను చూడవలసిందే.

గణాంక ఆర్థిక ప్రణాళిక రూపకల్పనలో ప్రొఫెసర్ ప్రశాంత చంద్రమహలనోబిస్ స్వాతంతంత్ర అనంతరం ఆర్థిక ప్రణాళికా మరియు గణాంక అభివృధి రంగాలకు ఆయన చేసిన గణనీయమైన విశేష సేవలకు కృషికి గుర్తింపుగా భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం జూన్ 29వ తేదీని ఆయన జయంతిని భారత ప్రభుత్వం గణాంకాల దినోత్సవంగా ప్రకటించింది. సామాజిక ఆర్థిక ప్రణాళిక మరియు ఆర్థిక యాజమాన్య విధాన రూపకల్పనలో గణాంక శాస్త్రం యొక్క పాత్ర ప్రాముఖ్యత గురించి ప్రొఫెసర్ మహలనోబిస్ నుండి ప్రేరణ పొందడానికి యువ తరంలో గణాంక శాస్త్రం పై అవగాహన కల్పించడం సదస్సులు సమావేశాలు చర్చలు ఏర్పాటు చేయడం గణాంకాల ప్రాధాన్యత మీద అవగాహన చైతన్యం కలిగించడంఈ దినం యొక్క ముఖ్య లక్ష్యం. భారత ప్రభుత్వం 2007 లో మొట్ట మొదటి సారిగా ప్రొఫెసర్ మహాలనోబిస్ జన్మదినమైన జూన్ 29 ని జాతీయ గణాంకాల దినోత్సవంగా ప్రకటించింది. స్టాటిస్టిక్స్ రంగములో మహాలనోబిస్ విశేష రచనలు చేశారు. మహాలనోబిస్ చేసిన శాంపిల్ సర్వే పరిశోధన ఫలితంగా దేశంలో పరిశోధన శిక్షణ సంస్థలు ఏర్పడ్డాయి. 1931 లో ప్రొఫెసర్ మహలనోబిస్ ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ స్థాపించారు. ఆయనను ఫాధర్ ఆఫ్ ఇండియన్ స్టాటిస్టిక్స్ అని కూడా పిలుస్తారు . పెద్ద ఎత్తున నమూనా సర్వే రూపకల్పన విధానాలు రూపొందించాడు. మల్టీవియారిట్‌పై స్పేస్‌లోని రెండు డాటా సెట్ల మధ్య పోలిక కొలమానమైన మహలనోబిస్ దూరం అనబడే పద్ధతిని రూపొందించాడు. ఈ పద్ధతి ద్వారా అతను బాగా గుర్తుండి పోయాడు. రెండూ లేదా అంతకంటే ఎక్కువ వెరియబుల్స్ పరస్పర సంబంధం కలిగి ఉన్నప్పుడు మహల్ దూరం ఉపయోగ పడుతుంది. మరియు పాలకుడితో దూరాన్ని కొలవడం సాధ్యం కాదు. ఈ కొలత సమస్యను పరిష్కరిస్తుంది. ఎందుకంటే ఇది బహుళ వేరియబుల్స్ కోసం పాయింట్లు మధ్య దూరాలను పర స్పర సంబంధం ఉన్న పాయింట్లను కూడా కొలుస్తుంది.

ప్రణాళిక బద్దంగా సమాచారాన్ని రాబట్టడంలో గణాంకాలు అన్ని రంగాలలో బహుముఖ పాత్ర పోషిస్తాయి. గణాంకాల ద్వారా కచ్చితమైన సమాచారాన్ని స్పష్టంగా సంక్షిప్తంగా పొందవచ్చు.మహలనొబిస్ అనువర్తిత గణాంక వేత్త మహాలనోబిస్ దూరం 'గణాంక కొలత' యాదృచ్ఛిక నమూనా పద్ధతిని ప్రవేశపెట్టాడు. నేడు నిర్వహిస్తున్న పలు సర్వేల విధానాన్ని పైలట్ సర్వేల భావాన్ని నమూనా పద్ధతుల ప్రాముఖ్యతను చాటి చెప్పాడు. భారత ప్రణాళిక వ్యవస్థ పితామహుడిగా గుర్తింపు పొందిన మహాలనో బిస్ సేవలను గుర్తించి భారత ప్రథమ ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ భారత ప్రభుత్వ గణాంక సలహాదారుగా నియమించాడు.

భారీ పరిశ్రమలకు ప్రాముఖ్యత ఇచ్చిన భారత రెండవ పంచ వర్ష ప్రణాళికలో మహాలనోబిస్ సభ్యుడు. సోవియెట్ ఆర్థిక వేత్త ఫీల్‌మాన్‌తో కలిసి రెండవ పంచ వర్ష ప్రణాళిక కోసం రెండు రంగాల ఇన్పుట్ అవుట్ పుట్ మోడల్ ఫీల్ మెన్



మహలనోబిస్ మోడల్‌ను రూపొందించాడు. వర్ధమాన ఆర్థిక వ్యవస్థకు ఉపయోగకరమైన ప్రమాణాలను మహాలనోబిస్ ప్రవేశపెట్టాడు. మహలనోబిస్ జాతీయాదాయ కమిటీ చైర్మన్ గా స్థూల జాతీయ ఉత్పత్తి అంచనాలు జాతీయ ఆదాయ అంచ నాలకు ప్రాతిపదికలను రూపొందించాడు.

ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి ఉత్పాదకత ఉపాధి మూలధన ఉత్పత్తి నిష్పత్తి పొదుపు పెట్టుబడి వృది అభివృధి మధ్య ఉన్న సంబంధాన్ని మహలనోబిస్ సమగ్రంగా అధ్యయనం పరిశోధన చేశారు. జాతీయ గణాంక వ్యవస్థను స్థాపించడంలొ మహలనోబిస్ కీలకపాత్ర పోషించాడు. గణాంకాలు డేటాను సేకరించడం విశ్లేషించడం నిర్వహించడం ప్రాతినిధ్యం వహించడం లాంటి అంశాలు ప్రాముఖ్యాన్ని కలిగి వుంటాయి. దేశ ఆర్థిక ప్రణాళికలు ఆర్థిక విధానాలు వనరుల పంపిణీ కేటాయింపు వినియోగం వివిధ రంగాల మధ్య పెట్టుబడులు కేటాయింపుకు వివిధ రంగాల మధ్య బడ్జెట్ కేటాయింపు. ఆర్థిక ప్రగతి పురోగతి పథకాల రూపకల్పన సమీక్షా అమలుకు ఉపయోగ పడతాయి. ఆరోగ్య సంరక్షణ రంగములో గణాంకాలు కీలక పాత్ర పోషిస్తాయి. సామాజిక ఆర్థిక పారిశ్రామిక సర్వేలు నిర్వహించడంలో సహాయపడతాయి. దేశములో లభించే వనరులను సద్వినియోగం పరుచుకోవడానికి అవలంబిం చాల్సిన విధానాల రూపకల్పనలో ఉపయోగ పడతాయి. విద్య వైద్య రంగాల అభివృద్ధికీ అవసరమగు ప్రణాళికలు రూపొం దించడానికి ప్రణాళిక సంఘం గణాంకాలను ఉపయోగిస్తుంది. ఆరోగ్య సంరక్షణ మాత్రమే కాకుండా పారిశ్రామిక సేవా రంగాలలో అభివృధి వ్యూహాలను ప్రణాళికను రూపొందించ డానికి సహాయ పడుతుంది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నిర్మాణ రంగం అమ్మకాలు మార్కెటింగ్ బ్యాంకింగ్ ఫైనాన్స్ ఇన్సూరెన్స్ రవాణా మొదలగు రంగాలకు గణాంకాలు దిక్సూచి లాగా పని చేస్తాయి. మానవ జీవితములో ప్రభుత్వాల ఆర్థిక వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించిన గణాంకశాస్త్ర పరివ్యాప్తికి విశేష కృషి చేసిన ప్రొఫెసర్ మహాలనొబిస్ కృషిని విశ్వ వ్యాప్తంగా చేద్దాం. ఐక్య రాజ్య సమితి లక్ష్యమైన సుస్థిర అభివృధి లక్ష్య సాధనలో ముం దుకు వెళ్ళడానికి పౌర సమాజం ప్రభుత్వాల భాగస్వామ్యం పెంచుకుందాం

**(జూన్ 29న జాతీయ గణాంకాల దినోత్సవం)**

**- నేదునూరి కనకయ్య**
9440245771

# మూసుడు మూసుడే..యెట్లయినా మూసుడే.!



మొన్న బువ్వదిన్నంక అద్దుమ్మ నాత్తిరి నుల్క మంచంమీన బొంత పర్సుకొని,అట్లొరిగిన. మా యింటి పక్క కచీరు (సావడి) కాంచి మస్త్ ముచ్చట్లిన బడ్తన్నయ్. బుత్తాంతసేపు అటుకెయ్ మనసు వెట్టిన,ఇగ నిద్ర వట్టక లేసిన, అవ్వ గింత నాత్తిరేడికిరా అన్న సుత యే... యేడికి లేదే.. అనుకుంట బయటపడ్డ. ఆడికివోయి సూత్తును గదా! సెలగ మంది ఉన్నరు. కొంత తెలివికల్లోల్లు గుడుక కూకున్నరు.సీకటిగదా మొకాలు(మొఖాలు) గన్పిత్తలేవు. ఆన్నె బుత్తాంత సేపు నిలవడ్డ. ఆడ పడుసు పోరలెవ్వల్లేరు.అంత మా కత్తే. కాపోతే అడ్డాదడ్డా ఎవుసం పన్జేసేటోల్లే,సావగత ముచ్చట్లన్ని నడుత్తన్నయ్. ఒకాయిన గా రేవంతం రెడ్డి పుసుక్కున బల్లన్ని మూత్తనని అన్నడు, ఇన్నవా?మామా! అనంగనే, ఎలచ్చన్ల ముంగల సదువుల మీన సానా కర్సు వెడ్తన్నడు! సర్కారు బల్లను సర్గం లేక్కజేత్త,అందరి పొలగాల్లు ఒకే తాన సదివేతట్టు జేత్త. పొలగాల్ల సదువుకు యెవ్వలకు నయా పైస కర్సు గాకుంట జూత్త అని మత్తు కతల్జెప్పిండు. గిప్పుడేమో మన సర్కారు చదువుల మీద సేసే కర్సును, కర్సుగానే సూత్తంది గాని, ముంగటి జమానాకు ఇత్తనాలేత్తన్న మను కుంటలేదు. గట్లనుకుంటే, గా బేంగుల్రార్ల ఐన మీటింగ్ల మన ముక్కెమంతిరి మన బల్లను 27000 కాన్నుంచి 4000 కు తక్వ జేత్తననే ముచ్చట సెప్పెటోడేగాడు. పిడాత గీ ముచ్చటంటే, యెవ్వలకైన గుండె గుభేల్ మనదా! మల్ల అన్నాయిన అల్లాటప్పా మనిసి కాదుగదా!! మన రాట్టానికి పెద్ద తల కాయెనాయే. గా నడ్మ మన సదువుల మీన మంచి, సెడ్డలు సెప్పనీకి నలుగురు పెద్ద మనుసులను ఇసారించుమని చెప్పిండ్రు గదా! గాల్లు జెప్పిన ముచ్చట సుత గిదే గావచ్చు. ఇంక తెలంగాణ ముక్కమంతిరి రేవంతం రెడ్డి సారు బల్లను ఇరవై ఏడు వేల నుంచి నాలుగువేలకు తక్వ జేత్తనంటే,గాయిన మతిల యేమున్నట్టు? 'బల్లను పురాగా మూసేసుడు' అనే కంటే 'సిన్నసిన్నయి ఒకటి సేసి పే...ద్ద బల్లగా మార్సేయడం' అన్నట్టు. గదాన్కి గాయన సెప్పిన కతలు గిట్లున్నయి.. మత్తు(స్త్) బల్లల్ల ఒక్కడే సదువు పంతులు ఉన్నడు. పోరగాల్లసుత పదిమంది లోపలే ఉన్నలు. ఐనా గ ఒక్క పంతులే 18 తరీకల వయిల సదువు జెప్పాల్నాయే. గిట్లుంటే ఆల్లకు సదువచ్చుడు సానా కట్టం. గందుకనే పే.....ద్ద బడిగా మార్సి, పతి కిలాసుకో సారుండేతట్లు జేత్త. పొద్దుగాల నాస్టా, పగటీలి బువ్వ అవ్వల్దరియగ పెడ్త. మస్త్ మంది పంతుల్లనువెడ్త. గట్లనే బొచ్చెడు సౌలతుల్ సుతజేత్త. ఉన్న సౌలత్‌లను పక్కగా అందరికీ అందెటట్టుగ జూత్త. ఒకటోతర్కతి కాంచి పన్నెండో తర్కతి దాంక ఒకటే బడిజేత్త. గట్లనే పొలగాండ్లను ఆల్ల ఇంట్ల యెక్కిచ్చు కొని, మల్ల మా పటీలి ఆల్ల యింటి కాడదించే యికమతుల్జేత్త. గిసొంటియన్ని యిననీకి కమ్మగ తేనే లెక్కనే ఉంటయ్, కనీ గియన్ని అయితయా? ఊల్లకెల్లిరానీకి అన్ని ఊల్లకు బస్సులచ్చే తొవ్వలున్నయా? ఉన్న ఊల్లకు బస్సుల త్తన్నయా? తండాలకు బస్సులెట్లత్తయా? మల్ల గయి పిరిబస్సులా? కొత్త లియ్యాల్నా? కొత్తలైతే యెవలుకట్టాలే? సర్కారు బల్లె కచ్చటోల్లు పురాగ యేమి లేనోల్లేగదా! బడుగులే కదా! ఆల్లు కర్సులను బరాయిత్తరా?గట్లనే సిన్న పొలగాండ్లు అచ్చిపోవుడైతే అలిట్టవడి ఆల్లకేమన్నైతే అవ్వయ్యలు బడికి తోల్తరా? ఇంకా గట్లనే ఆడపొలగాండ్లను దూరం బంపనీకి సుత అవ్వయ్యలు ఇట్ట పడ్తరా?పంపకపోతే నువు బల్లుమూసినంక ఆడ పోల్లలు బడికి దూరమై, బడిమానేత్తరు గదా?(డ్రాపౌట్). గండ్లనే యెవ్వలన్న అవ్వయ్యలు ఓ డిగ్రీ సదివిన పొల్లగాన్నో, పొల్లనో పట్టుకచ్చి కాన్గిరిబడి వెట్టిత్తే..! సర్కారు బడి సంకనాకి పోతగదా!. సర్కారు మతిలగూడ గిట్లనే బల్లు మూసెయ్యాలని ఆలోసన ఉండచ్చు. అంటే 'కొట్టక తిట్టక అట్టలూడదియ్యాలనే' ఉపాయం సుత గావచ్చు.

ఇంక గమ్మత్తేందంటే 2024లో రేవంతం రెడ్డి మునుపటి సర్కారు బల్లను మూత్తందని పొల్లు పొల్లు దిట్టిండు. గప్పుడాయిన పతి పచ్చంల ఉన్నడు. గిప్పుడు గయన్ని మర్సి,



గాయిన సుత గదే జేత్తండు. గి దీని మీన మన్నాన రచ్చ రచ్చైతంది. ఇగ గీల్లకు సమఝ్గానిదేందంటే సర్కారు బల్లల్ల బల్లు తక్వ పంతుల్లను యెక్వ చేయడంతోనే కాకుండ లాబ్‌లు, పుస్తకాల అర్రలు, టి.వీలల్ల పాటాల్జెప్పుడు మత్తుగా చేత్త. గట్లనే కాన్గిరి పోరలు సుత మన బల్లకే అచ్చేతరీక సౌలత్లు జేత్తనంటే సుత గింతగనం రచ్చనా? గా పతి పచ్చాలకు మన బల్లు బాగు జేసుడు, మనపోరలకు సదువచ్చుడు ఇట్టం లేనట్టుంది. గియ్యన్ని జేత్తే అవ్వయ్యలకు మన బల్లు మీన జరంత పాయిరం బెర్గదా? పోరలను మన బల్లకే పంపరా?

ఇంకా మన రాట్టంల సవాలచ్చ తరీక బల్లున్నయ్.ఐదు తరీకల బువ్వబెట్టి సదువు జెప్పేటియి,పట్నంల బువ్వ పెట్టేటియి(అర్బన్‌రెసిడెన్షియల్),కెజిబివి,ఏకలవ్య, మూగ, చెవిటోల్ల బల్లు, పంచాతి రాజ్( జిల్లా పరిషత్, మండల పరిషత్), ప్రభుత్వ పాఠశాలలలో సదువులు జెప్తున్నరు.అయినా అందరి సదువులు ఒక్కతరీక లేవు గదా! ఇగ గిప్పుడు యంగ్ ఇండియా దునియా (ఇంటర్నేషనల్)బల్లు, తెలంగాణ జనాల( పబ్లిక్) బల్లు(బడులు),ఏర్పాటైతే ఇంకో రెండు తరీకల బల్లు(బడులు) లిట్టులో కలుస్తాయి.గప్పుడు ముక్కెమంతిరి జెప్పిన అందరికీ ఒకటే తాన,ఒక్క తరీక సదువుల ముచ్చట అటుకు మీన దాసినట్లే గదా! గిట్లైతే మన సట్టం లోపటి Article 21A ల 6-14యేండ్ల పోరలకు పుకడ్‌కి మల్ల గరీబోడు, బల్సినోడు అని లేకుండా... యెంత మంది ఉంటే ఆల్లకు,ఊళ్లోని పిల్లలకు బడి ఈడత్తే, ఆల్ల ఊల్లెనే(ఆవాస) సదువుకునేటందుకు సర్కారు బడులల్ల పుకడ్ కే సదువు జెప్పాలె. ఇదంతా మన తెలంగాణ సట్టం(Telangana Right of Children to Free and Compulsory Education) తోటి బరాబర్ జరగాల్సిన లెక్క!. దీన్ల అవ్వల్దరియ ముచ్చట్లు ఇగో గిట్ల ఉన్నయి. ఆరేండ్ల సంది పద్నాలుగేళ్ల ఈడు దాంక హరొక్క పోరనికి, పొల్లకు సదువుకునే వక్కు ఉంది. సిన్న తర్కతి నుంచి ఎనిమిద్దాంక లేదంటే పది దాంక పుకడ్‌కే అంటే పైసల్లేకుండా సదువు కోవచ్చు. పొలగాండ్లు ఉంటున్న కాన్నే(ఆవాస) సర్కార్ బల్లల్ల చదువు చెప్పాలె.అందరికీ సదువు మన సర్కారు లచ్చెం. పొలగాండ్లకు సదువు అచ్చేటట్టు సర్కార సూసుకుంటుంది. యెన్కట 'అన్నిరోగాలకు ఒక్కటే మందు పెన్సిలిన్' అన్నట్టు,బల్లను మంచిగ జేయాల్నంటే ఇంగిలీస్ బల్ల సురుజేసుడే అనుకుంది. అనుకునుడే ఆలిసం సురు సేసింది. మన పంతుల్లు ఇంగిలీస్ లో జెప్పనీకి ఓ పద్మూడు దినాల్ సిచ్చనిచ్చి(శిక్షణఇచ్చి) బెహత్తరీన్గ జేసింది.దీన్తో మనోళ్లు ఇంగిలీస్ లో పండితు లైపోయిండ్లు.

పొలగాండ్ల అవ్వ బాసలైతే అవ్వల్దరియ గ సమఝ్జేసుకొని ముచ్చట్లు వెడ్తరని సానా మంది 'మనసు'ను సదివే సార్లు సెప్తున్నరు. గందుకని సర్కార్ల,కాన్గిరిల ఒక్కటే తరీక తెలుగు బడులనువెట్టాలే అనే సోయి సర్కారుకు అత్తలేదు. గదిడిసి వెట్టి ఇంగిలీస్ మోజును సర్కారే పెంచవట్టే. ఇయ్యాల్ల సట్టసబలల్ల సట్టాలు సేసేటోల్లల్ల మూడుపాల్ల మంది సదువుల బేపారంల సంపాయించే టోల్లాయే. ఇగ ఆల్లకు పాయిదా అయ్యేతట్టు జూసుకోరా యేంది?సౌలత్లు జెయ్యాల్సిన సర్కార్లు సేతులెత్తేసి, మాతోనేంగాదు, మేం జెయ్యలేమను కుంట సదువుల సట్టం లోపట సెక్షన్ 12(1)(సి)ని సేసి, కాన్గిరి బల్లల్ల 25 పాల్లు గరీబ్ పొలగాండ్లను సెర్కిజ్జేసుకోవాలనే ముచ్చట జెప్పింది. గిట్ల కర్సుజేసే దాంట్ల సగం పైసలు సర్కారు బల్లకువెడితే అయి బాగు పడయా? అక్కడి పంతుల్లు సక్కని సదువుల్జెప్పరా? గట్లైతే దేసంల సర్కారు బల్లు పొలగాల్ల తోని కలకల లాడయా? అంటే'దుడ్డు ఉన్నోడిదే దుడ్డే' అన్నమాట. సమఝైంద నుకుంట.

సట్టంల జెప్పిన అందరికీ సదువు అందకుంటైతంది. కాదులే అందకుంట జేత్తండ్లు.ఇంక గరీబోల్ల పొలగాండ్లు సదువు కొని యేం జేత్తరులే! యెట్లైన బల్లను మూసేసి నంక కంసేకం ఓ ముప్పై యేల మంది పంతుల్లు మిలిగి పోతలు. ఆల్లను యేదో ఓ దాంట్ల సదిరేత్తే ఐపాయే! కాపోతే పంతుల్ల తాబద్లాలో,ఆల్ల తాన అచ్చే కొత్త నౌకర్లలో జనాల్లో యేలేటోల్ల మీన కూసింత పగైతే గావచ్చు. ఇగ కొత్త పంతుల్ల నౌకర్లకు ఆశపడేటోల్లకు మొండిసేయి సూపిచ్చుడే. గరీబోల్లు లేకుంట జేయాల్నంటే సదువొక్కటే బెహత్తరీన్ డాల్,కత్తి అని మనోల్లు యాడ వడితే ఆడ మొత్తుకుంటనే ఉంటరు. గ సదువే ఊల్లల్ల జనాల్నందరిని ఒక్కతరీక జేత్తదం టరు. గసొంటి సదువు గుల్లను మూసేసుడంటే 'బాయిల నీల్లు అడుగంటినయని, రాల్లేసి నీల్లను మీదకి తెచ్చుకుందామనే' కాకి కతల కాకి తెలివి లెక్క లేదూ ...! ఇంకా మూసేసిన బల్ల జాగాలను అమ్మేసుకునే ఇకమతులు కావచ్చు గదా? అసలే సర్కారు కర్సుల కోసం పట్నంల జాగాలను అమ్ముతనే ఉంది గదా!? మూసేసుడో,కలిపేసుడో,అమ్మేసుడో గని ముందు ముందు బతికే పొలగాండ్ల ఆసల మీన నీల్లుజల్లి, ఆల్ల ఆస యాలను బొందవెట్టినట్టు గాదా! జర సోచాయించుండ్లీ... అనుకుంట, కండ్లు కుచ్చుకపోతన్నయి,మల్ల మబ్బుల్నే మోటకువోవాలె అనుకుంట లచ్మన్ పరార్.. ఇగ నేన్సుత ఉంట. సెనార్తులు..

**- మీస రాజమల్లయ్యా**
9491319904

# తాగునీటి గోస తీరింది



- ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా
- 'మనం' వార్తకు స్పందన




మనం ఎఫెక్ట్

**చర్ల, జూన్ 27 (మనం న్యూస్) :** చర్ల మండలంలోని సుబ్బంపేట పంచాయతీ రాజయ్యనగర్ ఆదివాసీల త్రాగునీటి గోస తీరింది. గ్రామంలోని సోలార్ ఆదారిత రక్షిత మంచినీటి పథకం, చేతి పంపులు మరమ్మత్తులకు గురయి త్రాగునీటికి అవస్థలు పడుతూ గ్రామ సమీపంలోని వాగు వద్ద నుండి చెలిమల ద్వారా కలుషిత నీటిని తెచ్చుకొని దాహార్తి తీర్చుకుంటున్న వైనంపై శనివారం 'మనం' దినపత్రికలో ప్రచురితమైన'తాగునీటి గోస' శీర్షికన ప్రచురితమైన వార్తా కథనానికి అదికారులు స్పందించారు. మండల పరిషత్ అభివృద్ధి అదికారి కనపర్తి ఈదయ్య ఆదేశాల మేరకు సుబ్బంపేట పంచాయతీ సర్పంచ్ కాక సత్యనారాయణ, కార్యదర్శి సర్వేశ్వరావు ల పర్యవేక్షణలో గ్రామానికి ట్యాంకర్ల ద్వారా త్రాగునీటిని సరఫరా చేసారు. మంచినీటి పథకాలు మరమ్మత్తులకు గురయ్యేంత వరకు ప్రతిరోజూ ట్యాంకర్ల ద్వారా త్రాగునీటిని అందిస్తామని వారు తెలిపారు. గత కొన్నేల్లుగా తాము పడుతున్న త్రాగునీటి సమస్యను పరిష్కరించిన 'మనం' కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి, నాణ్యమైన విద్యకు ప్రాధాన్యతనివ్వాలి



- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి, జూన్ 27 (మనం ప్రతినిధి):** అభ్యసన ఫలితాలు పనితీరు గ్రేడింగ్ సూచికలు, లెర్నింగ్ మేనేజ్మెంట్, సమర్థవంతమైన తరగతి గది బోధనపై ప్రత్యేక దృష్టి సారించి, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.శనివారం పెద్దపల్లిలోని వెంకట పద్మ ఫంక్షన్ హాల్లో జరిగిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మాట్లాడుతూ, నాణ్యమైన విద్యలో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని సూచించారు. విద్యార్థులు స్వతంత్రంగా చదవడం, మాట్లాడడం నేర్చుకున్న అంశాలను సృజనాత్మకంగా వ్యక్తపరిచేలా తీర్చిదిద్దాలని కోరారు. ప్రతి పాఠశాలలో వార్షిక విద్యా ప్రణాళిక, పాఠశాల అభివృద్ధి ప్రణాళిక,పాఠ్య ప్రణాళికలను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి రెమెడియల్ బోధన అందించాలని స్పష్టం చేశారు. డిజిటల్ వనరులు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని తరగతి గదుల్లో సమర్థవంతంగా వినియోగించుకోవాలని చెప్పారు.ఈ సమావేశంలో జిల్లా అకాడమిక్ ప్యానల్ తనిఖీ బృంద సభ్యులను కలెక్టర్ పరిచయం చేయగా, హాజరైన ఉపాధ్యాయులకు అకాడమిక్ ప్లానింగ్ మెటీరియల్ను పంపిణీ చేశారు. ఈ సమీక్షా సమావేశానికి జిల్లా వ్యాప్తంగా 14 మండలాల నుండి సుమారు 1000 మంది ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నరేందర్, జిల్లా విద్యా శాఖ ఏఎంఓ డాక్టర్. పి.ఎం. షేక్, సెక్టోరల్ అధికారులు మల్లేశ్, జిసిడిఓ కవిత, అలోకిట్, ఆర్పీ సమీర్, ఇతర విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# సమగ్ర సర్వేని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



**చొప్పదండి జూన్ 27(మనం న్యూస్):** చొప్పదండి మండలం రుక్మాపూర్, కొలిమికుంట గ్రామాలలో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను అడిషనల్ కలెక్టర్ ( స్థానిక సంస్థలు) అశ్విని తానాజీ వాకడే క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బి.ఎల్.వోలు ఇంటింటికి వెళ్లి ఎస్.ఐ.ఆర్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని, ఉన్నతాధికారుల సూచనలు పాటించాలని పేర్కొన్నారు.

# బాలసదన్ సందర్శించిన జడ్జి భవాని



**సుల్తానాబాద్ జూన్ 27 (మనం న్యూస్):** పెద్దపెల్లి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి వంగర భవాని పట్టణంలోని నూతనంగా నిర్మించబడిన బాలసదన్, వృద్ధాశ్రమం, మానసిక వికలాంగుల స్కూల్ ను శనివారం సందర్శించారు ఈ సందర్భంగా వృద్ధాశ్రమ నిర్వాహకుల పనితీరు పై వృద్ధులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు తదనంతరం బాలసదనం ను సందర్శించిన స్టాక్ రిజిస్టర్ లను, పిల్లలకు అందించే మెనూ కూడా పరిశీలించారు పిల్లలకు సరియైన ఆహారం వసతులు కల్పించాలని సూచించారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను లేదా జిల్లా సంక్షేమ శాఖ అధికారులకు తెలిపినట్లైతే సమస్య పరిష్కారం వీలు కల్పిస్తారని జడ్జి భవాని తెలిపారు. మానసిక వికలాంగుల స్కూల్ ను సందర్శించి టీచర్లను బోధన పద్ధతులను చూసి సంతృప్తి చెందారు.

# ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

- బీ.ఎల్.వో.ల ఇంటింటి ఫారాల పంపిణీని పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత



**జగిత్యాల, జూన్ 27 (మనం ప్రతినిధి):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత అధికారులను ఆదేశించారు. శనివారం మేడిపెల్లి మండలంలో బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్వోలు ఓటర్లకు ఫారాల పంపిణీ, వివరాల నమోదు, అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్లకు ఫారాలను అందజేయాలని, ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం పని చేయాలని అన్నారు. ఓటర్ల నుంచి అందిన ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి, వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని సరైన సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, సంబంధిత సిబ్బంది, బీఎల్వోలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# సెర్ప్ ఆధ్వర్యంలో ఘనంగా హెలెన్ కెల్లర్ జయంతి వేడుకలు




**జగిత్యాల, జూన్ 27(మనం న్యూస్):** అమెరికా లోని అంబామా రాష్ట్రం లో జన్మించి, చిన్న తనం లోనే తీవ్రమైన జ్వరం తో చూపు, వినికిడి మరియు మాటలు లేకపోయి, అపారమైన ఆత్మవిశ్వసంతో ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన స్పూర్తిదాయకమైన హెలన్ కెల్లార్ జయంతి సందర్భంగా ఈరోజు జిల్లా కేంద్రా లోని గ్రామీణభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు దివ్యాంగుల సమక్షంలో నిర్వహించడం జరిగినది. ఈ సందర్బంగా జిల్లా గ్రామీణభివృద్ధి శాఖ అధికారి యం. రఘువరణ్ మాట్లాడుతు అండత్వం, వికలాంగత అనేది శరీరానికే గాని,మనసు కు కాదని, ఆత్మవిశ్వాతో ఏదైనా అనుకున్నది సాధించవచ్చున్నని హెలెన్ కెల్లర్ నిరూపించారాని, ఆమె అందులకు, దివ్యాంగులకు ఆదర్శంగా నిలిచారని, సెర్ప్ ఆధ్వర్యంలో ప్రత్యేక సంఘాలు ఏర్పాటు చేయడం జరుగుతుందనీ, సదరమ్ ధ్రువీకరణ పత్రం ఉండి, పింఛన్ వస్తున్న ప్రతి ఒక్కరు స్త్రీ, పురుషుడు దివ్యాంగుల సంఘాలలో చేరాలని, అందుకోసం సెర్ప్ సిబ్బంది అందుబాటులో ఉంటారని, వారి ద్వారా సంఘాలలో చేరాలని అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి ఏ.భాస్కర్ మాట్లాడుతు దివ్యంగుల సంక్షేమానికి ఎల్లప్పుడూ కృషి చేయడం జరుగుతుందనీ, అవసరమైన పరికరాలు, చికిత్సలకు కృషి చేయడం జరుగుతుందని అన్నారు. జిల్లా అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ పి. సునీత మాట్లాడుతు సెర్ప్ ఆధ్వర్యంలో దివ్యాంగుల కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందనీ,ఉపాధి కోసం ప్రత్యేక యూనిట్ల ఏర్పాటు కూడా చేయడం జరుగుతుందనీ, అర్హులైన ప్రతి దివ్యాంగుడు తప్పనిసరిగా సంఘాలలో చేరాలని అన్నారు. అంతకుముందు హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పుల మాల వేసి, పువ్వులతో నివాళి అర్పించారు, ప్రత్యేక కేకు ను కోసి వేడుకలు నిర్వహించారు. మేడిపల్లి మండల కేంద్రానికి చెందిన అంద కళాకారుడు రవి పాడిన పాటలు సభను ఉత్తేజ పరచడం జరిగినది, రవి కి శాలువా తో సన్మానం, ప్రత్యేక చేతి కర్రను అందజేయడం జరిగినది. జిల్లా దివ్యాంగుల ప్రాజెక్టు మేనేజర్ ఎస్. రమేష్, జిల్లా పింఛన్ ప్రాజెక్టు మేనేజర్ నాగేశ్వర్ రావు, జిల్లా ఎపియం వి. గంగాధర్, కార్యాలయ సిబ్బంది విజయలక్ష్మి, భాగ్య, కిరణ్ పలువురు సిబ్బంది, ఆయా మండలాల నుండి దివ్యాంగులు పాల్గొన్నారు.

# టాస్క్ పోర్స్‌పోలీసుల మెరుపు దాడి




- 3 ట్రాక్టర్ల సీజ్, రెండు భారీ డంపుల స్వాధీనం
- 35 ట్రిప్పుల ఇసుక మరియు వాహనాలు స్వాధీనం
- అక్రమ ఇసుక మాఫియాపై ఉక్కుపాదం
- కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం

**కరీంనగర్ రూరల్ జూన్ 27(మనం న్యూస్):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా, నిల్వలను అరికట్టేందుకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. పోలీస్ కమిషనర్ శ్రీ గౌష్ ఆలం గారి ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ ఏసీపీ వాసాల సతీష్ ఆధ్వర్యంలో టాస్కోర్స్ సిబ్బంది నిరంతరం పెట్రోలింగ్ మరియు తనిఖీలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఈరోజు ఉదయం కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖాజీపూర్ గ్రామశివారులో టాస్కోర్స్ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, మూనేరు నది నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నారు3. ఈ వాహనాలకు సంబంధించిన ఎలాంటి పత్రాలు మరియు మైనింగ్ అనుమతులు లేకపోవడంతో, పోలీసులు ఆ మూడు ట్రాక్టర్లను సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న వాహనాలు మరియు ఇసుకను కొత్తపల్లి స్టేషన్ హౌస్ ఆఫీసర్ కు అప్పగించి, తదుపరి చట్టపరమైన చర్యల కోసం కేసు నమోదు చేశారు. అలాగే, బోనాల (హామ్లెట్ ఆఫ్ ఎలగందుల) గ్రామ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన రెండు భారీ ఇసుక డంపులను కూడా టాస్కోర్స్ పోలీసులు గుర్తించి, సీజ్ చేశారు. ఈ రెండు డంపులలో మొత్తం 35 ట్రిప్పుల ఇసుక ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. స్వాధీనం చేసుకున్న ఈ ఇసుక నిల్వలను తుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కొత్తపల్లి పోలీస్ స్టేషన్కు చెందిన బ్లూకోలట్స్ సిబ్బందికి అప్పగించి, దానికి సంబంధించిన రసీదును పొందారు.

ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా తవ్వడం, నిల్వ చేయడం, రవాణా చేయడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణా మరియు నిల్వలపై జిల్లా వ్యాప్తంగా నిరంతర నిఘా కొనసాగుతుందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై మైనింగ్ చట్టాలు, ఇతర సంబంధిత చట్టాల ప్రకారం అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ఆపరేషన్ సింధూర్ అమర జవాన్లకు ఘన నివాళులు

**జగిత్యాల జూన్ 27(మనం న్యూస్):** ఆపరేషన్ సిందూర్లో దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన అమర జవాన్లకు ఈరోజు భారత్ సురక్ష సమితి ఆధ్వర్యంలో స్థానిక తహసీల్ చౌరస్తా వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు అమర జవాన్ల చిత్రపటాలకు పూలమాలలు వేసి కొవ్వతులతో , రెండు నిమిషాల మౌనం పాటించి వారి త్యాగాన్ని స్మరించుకున్నారు. నాయకులు చిట్ల గంగాధర్ మాట్లాడుతూ, దేశ సరిహద్దులను కాపాడుతూ తమ ప్రాణాలను అర్పించిన సైనికుల త్యాగం ఎప్పటికీ మరువలేనిదని, వారి సేవలు దేశ ప్రజలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. అమర వీరుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, దేశ రక్షణ కోసం నిరంతరం విధులు నిర్వహిస్తున్న సైనికులకు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏసిఎస్ రాజు, కౌన్సిలర్ అరవ లక్ష్మి , సింగం గంగాధర్, చిట్ల గంగాధర్, వేముల పోచమల్లు, నరెందుల శ్రీనివాస్, వేముల దేవారాజం, కట్ట రామ కృష్ణ, ఎడమల వెంకట్ రెడ్డి, కొత్తకొండ భాలన్న, కొక్కుల ఆంజనేయులు, సిరిపురం గంగారాం, బొంధుకురి శ్రీనివాస్, కస్తూరి శంకర్, జానయ్య, అనుమల్ల బుజంగం తదితర నాయకులు పాల్గొన్నారు.




# ప్రజాప్రతినిధికి తప్పని అవమానం



- సర్పంచ్ భర్త,కుమారుడిపై కేసు నమోదు

**పెద్దపల్లి,జూన్ 27 (మనం ప్రతినిధి):** పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామ పంచాయతీలో ప్రజా ప్రతినిధులకే రక్షణ లేని పరిస్థితులు నెలకొన్నాయని,అభివృద్ధిని ప్రశ్నించినందుకు వార్డ్ సభ్యుడిపై సర్పంచ్ భర్త,కుమారుడు దౌర్జన్యానికి దిగారంటూ 5వ వార్డ్ సభ్యుడు బోలం వినయ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఈ మేరకు శనివారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్లో ప్రెస్ నోట్ ద్వారా వివరాలను వెల్లడించారు.ఈ నెల 1న జరిగిన గ్రామ పంచాయతీ జనరల్ బాడీ సమావేశంలో గ్రామాభివృద్ధి పనులు మరియు భోజన్న చెరువుకు సంబంధించిన ప్రజా సమస్యలను తాను చర్చకు పెట్టానని వినయ్ తెలిపారు. ఈ క్రమంలో,ఎటువంటి అధికారిక హోదా లేని గ్రామ సర్పంచ్ భర్త నర్ల పోల్ రాజ్ మరియు వారి కుమారుడు నర్ల సాయి సమావేశంలోకి దూరి,తనను అడ్డుకోవడమే కాకుండా భయభ్రాంతులకు గురి చేశారని ఆయన ఆరోపించారు.కేవలం తనను మాత్రమే కాకుండా,సమావేశంలో విధుల్లో ఉన్న ప్రభుత్వ అధికారులను కూడా వారు అత్యంత అసభ్య పదజాలంతో దూషించారని,అంతటితో ఆగకుండా రాష్ట్ర మహిళా మంత్రి సీతక్క మరియు స్థానిక శాసనసభ్యుడిని సైతం వారు అవమానకరంగా మాట్లాడారని పేర్కొన్నారు.ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహిస్తున్న సమావేశంలో సర్పంచ్ కుటుంబ సభ్యుల తీరుపై వినయ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ఈ ఘటనపై వెంటనే స్పందించిన బాధితుడు వినయ్ పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్లో లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు,నర్ల పోల్ రాజ్ మరియు నర్ల సాయిలపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు వినయ్ తెలిపారు.ప్రజా ప్రతినిధులపై దాడులకు పాల్పడటం,అధికారుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టని ,ఇలాంటి వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని బోలం వినయ్ డిమాండ్ చేశారు.

# శ్రీ జగదాంబ ఆలయ అభివృద్ధికి సహకరిస్తా

- ద్వారకాతిరుమల ఆలయ ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు గడ్డమణుగు రవికుమార్.

**జీలుగుమిల్లి,జూన్ 27(మనం న్యూస్):** జీలుగుమిల్లి గ్రామానికి చెందిన శ్రీజగదాంబ అమ్మవారి ఆలయ పునః నిర్మాణం ఎక్కడ జరిగినా అభివృద్ధికి తన వంతుకృషి చేస్తానని మాజీ జడ్పిటిసి,ఉమ్మడి పశ్చిమగోదావరిజిల్లా జనసేనపార్టీ కార్యదర్శి,ద్వారకాతిరుమల ఆలయ ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు గడ్డమణుగు రవికుమార్ అన్నారు.శనివారం జీలుగుమిల్లిలో జి.ఎస్.ఎమ్ గార్డెన్ వద్ద ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1957వ సంవత్సరంలో శ్రీజగదాంబ అమ్మవారిని వేలేరుపాడు మండలం శివకాశీపురం గ్రామంలో ప్రతిష్టిచ్చేందుకు కొవ్వూరు నియోజకవర్గం తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామానికి చెందిన కొత్తపల్లి దుర్గారావు అనే సాధువు అమ్మవారి విగ్రహం తీసుకువెళుతుండగా అనివార్య కారణాలవల్ల జీలుగుమిల్లి గ్రామంలో ఆగిపోయింది. తదుపరి ఎంత ప్రయత్నించినా శివకాశీపురం వెళ్లకుండా జీలుగుమిల్లిలోనే ఆగిపోయిందని అన్నారు.అప్పటినుండి ప్రతీ సంవత్సరం ఐదు రోజులపాటు శ్రీజగదాంబ అమ్మవారి ఉత్సవాలను గడ్డమణుగు సత్యనారాయణమూర్తి తన సొంత ఖర్చులతో 25 సంవత్సరాల పాటు అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహించారని తెలిపారు.అయితే జాతీయ రహదారి 365 బి.బి విస్తరణలో భాగంగా జీలుగుమిల్లి కూడలిలో రింగ్ రోడ్డు కొరకు శ్రీజగదాంబ అమ్మవారి ఆలయాన్ని తీసివేయాలని అధికారులు నిర్ణయించడం జరిగిందని అన్నారు.అయితే గ్రామంలో అమ్మవారి విగ్రహాన్ని ఎక్కడ పెట్టాలి,ఎలా పెట్టాలి,ఏవిధంగా పెట్టాలి అనే విషయంపై సందిగ్ధం నెలకొని ఉంది.శుక్రవారం శ్రీజగదాంబ ఆలయం వద్ద గ్రామస్తులు ఆలయాన్ని ఇక్కడే ఉంచాలని ఆందోళన కార్యక్రమం చేపట్టారని అన్నారు.దీనిపై రాజకీయాలతీతంగా కులాలకతీతంగా, కమిటీలు వేసి నిర్ణయం తీసుకోవాలని ఆయన సూచించారు. గ్రామస్తులు సామరస్యంగా పరిశీలించి ఆలయాన్ని ఎక్కడ నిర్మించినా దానికి నా పూర్తిమద్దతు ఉంటుందని అన్నారు.అయితే విరాళంగా ఇచ్చిన 11 సెంట్లు స్థలాన్ని అవసరమైతే వెనక్కి తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు.తదుపరి మరలా ఆలయ నిర్మాణానికి స్థలం ఇవ్వాలని అడిగినా ఇవ్వడానికి సిద్ధంగా లేనని ఆయన స్పష్టంచేశారు.

# వాహనాలపై ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్

- 115 వాహనాలు సీజ్
- ట్రాఫిక్ ఏసిపి యాదగిరి స్వామి



**కరీంనగర్ జూన్ 27(మనం బ్యూరో):** కరీంనగర్ నగరంలో ట్రాఫిక్ నిబంధనల అమలు, నేరాల నియంత్రణ, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. శనివారం వన్టౌన్ కార్నర్ వద్ద చేపట్టిన ప్రత్యేక డ్రైవ్లో నిబంధనలకు విరుద్ధమైన నంబర్ ప్లేట్లు, తప్పుగా అమర్చిన నంబర్ ప్లేట్లు, అలాగే నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ ఏసీపీ శ్రీ యాదగిరిస్వామి ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు సంజీవ్, అంజయ్య తమ సిబ్బందితో కలిసి నిర్వహించిన ఈ ప్రత్యేక డ్రైవ్లో మొత్తం 115 వాహనాలను సీజ్ చేశారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం సంబంధిత నిబంధనల మేరకు జరిమానాలు విధించడంతో పాటు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ యాదగిరిస్వామి మాట్లాడుతూ, ప్రతి వాహనానికి ప్రభుత్వం నిర్దేశించిన విధంగా స్పష్టంగా కనిపించే హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ ఉండాలని తెలిపారు. నంబర్ ప్లేట్లను మార్చడం, స్టిక్కర్లు లేదా ఇతర డిజైన్లతో నంబర్లు కనిపించకుండా చేయడం, నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఇలాంటి నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ ప్రత్యేక డ్రైవ్లో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు సంజీవ్, అంజయ్యతో పాటు ట్రాఫిక్ ఎస్ఐలు మరియు సిబ్బంది పాల్గొన్నారు..

# రాష్ట్రపతి విశాఖ పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

- పోలీసు కమిషనర్ తో కలిసి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

**విశాఖపట్నం, జూన్ 27 :** ఈ నెల 30న భారత రాష్ట్రపతి విశాఖపట్టణంలో పర్యటిస్తున్న నేపథ్యంలో భద్రతా, ప్రోటోకాల్ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ శనివారం సంయుక్తంగా పరిశీలించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ఎలాంటి లోపాలకు తావులేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సందర్శించే ప్రతి ప్రదేశంలో ప్రోటోకాల్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. రాష్ట్రపతి భద్రతకు సంబంధించి అన్ని స్థాయిల్లో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని, ట్రాఫిక్ మళ్లింపులు, భద్రతా సిబ్బంది మోహరింపు, తనిఖీలు, కమ్యూనికేషన్ వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ చెప్పారు.ఈ పరిశీలనలో డీసీపీలు మేరీ ప్రశాంతి, మణికంఠ, ఆర్డీవోలు దిలీప్ చక్రవర్తి, సంగీత్ మాథుర్, అదనపు ఎస్పీలు, జీవీఎంసీ, ఆర్ అండ్ బీ, విద్యుత్, వైద్య, అగ్నిమాపక, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ టీకాల కార్యక్రమం




పిఠాపురంజూన్ 27(మనం న్యూస్): గొల్లప్రోలు యు.పి.హెచ్ సి. ఆరోగ్య కేంద్రంలో 28/6/26,ఆదివారం పల్స్ పోలియో ర్యాలీ కార్యక్రమం మెడికల్ ఆఫీసర్స్ డా. షారోన్ కీర్తన మరియు డా. అక్కిరెడ్డి భార్గవి నిర్వహించారు. గొల్లప్రోలు పట్టణ పరిధిలో 0.5 చిల్డ్రన్స్ లబ్ధిదారులు 1369 మంది పిల్లలు. ఒపివి వైల్స్ 100 సరఫరా చేశారని అవి 2000 ల డోసులు సరఫరా చేశారు అని అన్నారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిబిరంలో పల్స్ పోలియో చుక్కలు వేయడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో 1 రూట్ సూపర్వైజర్ ఎ. బాషా, హెల్త్ అసిస్టెంట్స్ కాకరపల్లి గంగాధర శ్రీనివాసరావు, నారాయణ రావు, సూపర్వైజర్ చిన్ని, ఫార్మసిస్ట్ షర్మిల, ఎఎన్ఎం లు మరియు ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నిత్య అన్నదాన పథకానికి రూ.2 లక్షల విరాళం



అన్నవరం, జూన్ 27, మనం న్యూస్ : అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి నిత్య అన్నదాన పథకానికి భీమవరం వాస్తవ్యులు నాగ వెంకట సుబ్బారావు రూ.2 లక్షల విరాళాన్ని అందజేశారు. తన తల్లిదండ్రులు దివంగత ఈదర వెంకట సత్యనారాయణ, మంగాయమ్మ, వెంకయ్యల స్మారకార్థం ఈ విరాళాన్ని సమర్పించారు. దేవస్థానం కార్యాలయంలో ఈ విరాళానికి సంబంధించిన రూ.2 లక్షల చెక్కును దేవస్థానం డిప్యూటీ కమిషనర్ బాబురావుకు శనివారం నాడు అందజేశారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 20న స్వామివారి సన్నిధిలో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించాలని దాత కోరారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ బాబురావు దాతకు కృతజ్ఞతలు తెలియజేస్తూ వారి కుటుంబ సభ్యులకు స్వామివారి ఆశీస్సులు కలగాలని ఆకాంక్షించారు. భక్తులు అందించే విరాళాలతో నిత్య అన్నదాన పథకం విజయవంతంగా కొనసాగుతోందని మరింత మంది దాతలు ముందుకు వచ్చి ఈ సేవా కార్యక్రమానికి సహకరించాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# అన్నవరంలో భక్తులకు వాన కష్టాలు..

- అధికారుల నిర్లక్ష్యమే కారణమా?



అన్నవరం, జూన్ 27, మనం న్యూస్ : కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం దేవస్థానం కొండపై తూర్పు రాజగోపురానికి కుడివైపున ఉన్న ఉచిత దర్శన క్యూలైన్లలో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భక్తులకు నీడ కల్పించేందుకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గ్రీన్ కార్పెట్ వర్షం కురిసిన ప్రతిసారీ పైకి ఎగిరిపోవడంతో క్యూలైన్లలో నిల్చున్న భక్తులు పూర్తిగా వర్షంలో తడుస్తూ స్వామివారి దర్శనానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఎండాకాలంలో ఎండకు, వర్షాకాలంలో వానకు ఆ గ్రీన్ కార్పెట్ ఏమాత్రం రక్షణ కల్పించలేకపోతోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై కిందిస్థాయి అధికారులు పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపకపోవడం విమర్శలకు తావిస్తోంది. శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దర్శనం కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడం దేవస్థానం ప్రాథమిక బాధ్యత. హుండీలు, సేవలు, ప్రసాదాలు, విరాళాల రూపంలో దేవస్థానానికి ఆదాయ వనరులు సమకూర్చేది భక్తులేననే విషయాన్ని అధికారులు మరవకూడదని పలువురు సూచిస్తున్నారు. వానలో తడుస్తూ, ఎండలో నిలబడుతూ కూడా 'స్వామి దర్శనం లభిస్తే చాలు' అనే భక్తి భావంతో భక్తులు క్యూలైన్లలో వేచి ఉంటున్నారు. అలాంటి భక్తుల విశ్వాసానికి భంగం కలగకుండా వారి సౌకర్యాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. తాత్కాలిక ఏర్పాట్లతో కాలం గడపకుండా ఉచిత దర్శన క్యూలైన్లపై శాశ్వత షెడ్ నిర్మాణం చేపట్టి అన్ని కాలాల్లో భక్తులకు రక్షణ కల్పించాలని యాత్రికులు కోరుతున్నారు.

భక్తుల సౌకర్యాలే దేవస్థానం ప్రతిష్ఠకు ప్రతిబింబమని అధికారులు గుర్తించి వెంటనే చర్యలు చేపట్టాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## అధికారుల నిర్లక్ష్యం, నాయకులు పరిరక్షణలో విఫలం



పిఠాపురం జూన్ 27(మనం న్యూస్) : 2,3,4 వార్డుల సమస్యల పరిష్కార పోరాట కమిటీ కన్వీనర్ కరణం విశ్వనాథం ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో భాగంగా ఆయన మాట్లాడుతూ , పిఠాపురం పట్టణ స్థానిక 3వ వార్డు శనివారం ఉదయం కురిసిన చిన్నపాటి వర్షానికి ముంపు గురైందని విమర్శించారు. పిఠాపురం రాష్ట్రంలో రెండు స్థానంలో ఉన్న 3వ వార్డు ఆర్టీసీ కాంప్లెక్స్, కాంప్లెక్స్ బ్యాక్ సైడ్, వన్ వే ట్రాఫిక్ రోడ్, భాష్యం స్కూల్ రోడ్డు పరిస్థితి చూస్తే ఆఖరి స్థానంలో ఉందని అనిపిస్తుందన్నారు. పిఠాపురం ఊరు మధ్యలో బస్టాండ్ నుండి స్కూల్ కి వెళ్లే పిల్లలు మోకాలు లోతు నీటిలో వెళ్లడం బాధాకరమని అన్నారు.ఈ రెండున్నర సంవత్సరాల్లో అనేకసార్లు పిజిఆర్ఎస్ లో సమస్యల పరిష్కారం కొరకు ఫిర్యాదులు ఇచ్చిన ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలియజేశారు. వెంటనే అధికారులు స్పందించి ముంపు నివారణా చర్యల్లో భాగంగా ఆర్టీసీ కాంప్లెక్స్ పల్లాన్ని మట్టితో కప్పి ఎత్తు చేయాలి. 2,3,4 వార్డుల వాడకం నీరు వెళ్లే ప్రధాన డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలి అని అన్నారు.

## సీపీఆర్ ట్రిబ్యూట్ వైద్యంతో 60 ఏళ్ల వృద్ధుడికి పునర్జన్మ

- సుమంత్ ఆస్పత్రి వైద్యుల సేవలు అభినందనీయం

దేవరపల్లి, జూన్ 27 (మనం ప్రతినిధి): మరణం అంచుల వరకు వెళ్లిన ఓ 60 ఏళ్ల వృద్ధుడికి దేవరపల్లిలోని సుమంత్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సమయస్ఫూర్తితో అందించిన అత్యవసర వైద్యసేవలు ప్రాణదాతలుగా నిలిచాయి. సీపీఆర్ (ఇఖ)తో పాటు అత్యవసర చికిత్స అందించి, గుండె స్పందనను తిరిగి తీసుకురావడంతో వృద్ధుడి ప్రాణాలను కాపాడగలిగారు. ఈ ఘటన స్థానికంగా వైద్యుల సేవలపై ప్రశంసలు కురిపించేలా చేసింది.వివరాల్లోకి వెళితే.. దేవరపల్లి మండలానికి చెందిన 60 ఏళ్ల వృద్ధుడు ఒక్కసారిగా గుండెపోటుకు గురై అపస్మారక స్థితిలో పడిపోయాడు.కుటుంబ సభ్యులు వెంటనే అతడిని దేవరపల్లి లోని సుమంత్ ఆస్పత్రికి తరలించారు.అప్పటికే అతని గుండె స్పందన ఆగిపోవడంతో పరిస్థితి అత్యంత విషమంగా మారింది.అయితే ఆస్పత్రి వైద్య బృందం ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే సీపీఆర్ నిర్వహించి,అవసరమైన అత్యవసర చికిత్సను ప్రారంభించింది.పలుమార్లు గుండె పై ఒత్తిడి (ఇజ్చిట్ట ఇొౌఖఇట్చుఱజోఃట) చేయడంతో పాటు అవసరమైన ఔషధాలు అందించి వైద్యులు నిరంతరం శ్రమించారు.వారి కృషి ఫలించి కొద్ది సేపటికే వృద్ధుడి గుండె స్పందన తిరిగి ప్రారంభమైంది.ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్ ద్వారా ఉన్నత వైద్య కేంద్రానికి తరలించారు. ప్రస్తుతం వృద్ధుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ,'సమయానికి వైద్యం అందించకపోయి ఉంటే మా కుటుంబ పెద్దను కోల్పోయేవాళ్లం. వైద్యులు తమ అనుభవం, అంకితభావంతో ప్రాణాలను కాపాడారు.వారికి జీవితాంతం రుణపడి ఉంటాం'అని భావోద్వేగానికి గురయ్యారు. స్థానిక ప్రజలు కూడా ఆస్పత్రి వైద్యులను అభినందిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించి సేవలు అందించడం నిజంగా ఆదర్శనీయమని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లోనూ నాణ్యమైన అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండటం ప్రజలకు ఎంతో భరోసానిస్తోందని అన్నారు.ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను కాపాడడంలో వైద్యుల సమయస్ఫూర్తి,నిబద్ధత, సేవాభావం ఎంత కీలకమో ఈ ఘటన మరోసారి నిరూపించింది. అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో ఆస్పత్రికి తరలించడం,వైద్యుల సూచనలు పాటించడం ద్వారా అనేక ప్రాణాలను రక్షించవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

## అన్నవరం నిత్య అన్నదాన పథకానికి భారీ విరాళాలు



అన్నవరం, జూన్ 27, మనం న్యూస్ : అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలోని నిత్య అన్నదాన పథకానికి శనివారం పలువురు దాతలు ఉదారంగా విరాళాలు సమర్పించారు. భక్తుల సేవా సంకల్పంతో అందించిన ఈ విరాళాలను దేవస్థానం అధికారులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం జిల్లాకు చెందిన భోజల్లా నాగేశ్వరరావు రూ.1,11,116 విరాళాన్ని అందజేశారు. ఈ విరాళంపై వచ్చే వడ్డీతో ప్రతి సంవత్సరం నవంబర్ 15న వెంకటప్పయ్య-కమలమ్మ పేరుమీద నిత్య అన్నదానం నిర్వహించాలని సహాయ కార్య నిర్వహణ అధికారి బలువు సత్య శ్రీనివాస్ ను కోరారు. విజయవాడకు చెందిన దీప్తి రూ.2 లక్షల విరాళాన్ని అందించారు. ఈ మొత్తంపై వచ్చే వడ్డీతో ప్రతి సంవత్సరం జూలై 4న తన కుమారుడు హరికృష్ణ పేరుమీద అన్నదానం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అమలాపురానికి చెందిన ఆర్.వి.ఎల్.ఎన్.ఎస్. పార్వతి రూ.1 లక్ష విరాళాన్ని సమర్పించారు. ప్రతి సంవత్సరం జూలై 28న తన పేరుమీద నిత్య అన్నదానం నిర్వహించాలని సహాయ కార్య నిర్వహణ అధికారి ఎల్ శ్రీనివాసు ను కోరారు. దాతలు అందించిన విరాళాలను దేవస్థానం అధికారులు స్వీకరించి రసీదులను అందజేశారు. నిత్య అన్నదాన పథకానికి భక్తులు విశేషంగా సహకరించడం ఆనందదాయకమని, వారి సేవాభావం మరెందరికో ఆదర్శంగా నిలుస్తుందని అధికారులు తెలిపారు.

## అన్నవరం దేవస్థానంలో పారదర్శక అంతర్గత బదిలీలు

- 44 మంది ఉద్యోగులకు స్థానచలనం




అన్నవరం ,జూన్ 27, మనం న్యూస్ : కాకినాడ జిల్లాలోని శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఉద్యోగుల అంతర్గత బదిలీలు ఈసారి పారదర్శకంగా నిర్వహించబడినట్లు దేవస్థాన వర్గాల్లో చర్చ జరుగుతోంది. కార్యనిర్వహణాధికారి ఆధ్వర్యంలో సుమారు 44 మంది ఉద్యోగులకు వివిధ విభాగాల్లో స్థానచలనం కల్పించారు. దేవస్థానంలోని ఏఈవోలు, సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర కింది స్థాయి ఉద్యోగులను కూడా బదిలీల పరిధిలోకి తీసుకువచ్చారు. చాలాకాలంగా ఒకే విభాగంలో పనిచేస్తూ పాతుకుపోయిన ఉద్యోగులను కూడా ఇతర విభాగాలకు మార్చడం ఈ బదిలీల ప్రత్యేకతగా నిలిచింది. గతంలో అంతర్గత బదిలీల సమయంలో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల సిఫారసులు ప్రభావం చూపేవన్న ప్రచారం ఉండేదని, కొంతమంది ఉద్యోగులు సంవత్సరాల తరబడి ఒకే విభాగంలో కొనసాగేవారని దేవస్థాన వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఈసారి అలాంటి ఆరోపణలకు తావులేకుండా ఎలాంటి తారతమ్యం లేకుండా బదిలీలు చేపట్టినట్లు ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు.పని సామర్థ్యం పెరగడం, పరిపాలనలో సమర్థత తీసుకురావడం, ప్రతి ఉద్యోగికి సమాన అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఈ అంతర్గత బదిలీలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఒకే విభాగంలో ఎక్కువకాలం పనిచేయడం వల్ల ఏర్పడే ఇబ్బందులను నివారించడంలో కూడా ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ పారదర్శక విధానాన్ని పలువురు ఉద్యోగులు, భక్తులు స్వాగతిస్తున్నారు.

భవిష్యత్తులో కూడా ఇదే విధానాన్ని కొనసాగించి, దేవస్థాన పరిపాలనలో జవాబుదారీతనం, పారదర్శకతకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు. ఈ అంతర్గత బదిలీలు దేవస్థాన పరిపాలనలో ఒక సానుకూల మార్పుకు నాంది పలికాయని స్థానికంగా చర్చ సాగుతోంది.

## ఎమ్మెల్యే సత్యప్రభ చేతుల మీదుగా రూ.63,000 సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ...

- కృతజ్ఞతలు తెలియజేసిన కీర్తి వెంకట సుభాష్

శంఖవరం జూన్ 27 మనం ప్రతినిధి: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం,శంఖవరం మండలం వజ్రకూటం గ్రామానికి చెందిన పోలిశెట్టి సీతారత్నం పేరుపై ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ.63,000/- చెక్కు మంజూరైంది.ఈ చెక్కును ప్రత్తిపాడు మండలం పెద శంకర్లపూడి టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు, గ్రామ మాజీ సర్పంచ్ కీర్తి వెంకట సుభాష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సత్యప్రభ లబ్ధిదారి కుటుంబ సభ్యుడు కీర్తి నందిబాబుకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభకు, నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు కీర్తి వెంకట సుభాష్కు లబ్ధిదారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పర్వత సురేష్,నియోజకవర్గ సీబీఎన్ ఆర్మీ కో ఆర్డినేటర్ యాళ్ల జగదీష్,కూటమి నాయకులు గాబు కృష్ణమూర్తి,సాదనాల లక్ష్మిబాబు, కంచిబోయిన శ్రీను, కేళంగి జన,కొయ్యా రమణ, కూటమి కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## 30న రొయ్యల పట్టుబడులు నిలిపివేత

### రొయ్యల దాణ దుకాణాలు డీలర్స్ స్వచ్ఛందంగా మూసివేయాలి

### ఆక్వా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాంధీ భగవాన్ రాజు



పాలకొల్లు, జూన్ 27,మనం ప్రతినిధి: సాక్షాత్తు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు రొయ్యల మేత ధరలు తగ్గించాలని స్వయంగా ఆదేశించిన మేత ధరలు తగ్గించ నందుకు నిరసనగా ఈనెల 30వ తేదీన రొయ్యల పట్టుబడులు పట్టకుండా నిలిపివేయాలని ఆక్వా ఏపీ రాష్ట్ర సంఘం తీర్మానించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అదేవిధంగా ఆక్వా రైతులతో నిత్యం సన్నిహిత సంబంధాలు కలిగిన స్థానిక మేత డీలర్స్ కూడా అదే రోజు తమ దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేసి తమకు మద్దతు పలకాలని గాంధీ భగవాన్ రాజు కోరారు. వైరస్ వచ్చిన చెరువులు తప్ప మిగిలిన అన్ని చెరువుల రైతులు ఐక్యతతో ఒక్కరోజు రొయ్యల పట్టుబడులను నిలిపివేసి నిరసన తెలపాలని ఆయన కోరారు. వారం రోజుల క్రితం సీఎం, వ్యవసాయ మంత్రి కిలో మేతకు ఎనిమిది రూపాయలు తగ్గించాలని కోరిన అలా తగ్గించకుండా రెండు రూపాయలు మాత్రమే తగ్గించి ఫీడ్ కంపెనీ యజమానులు రైతు లను మోసగించారని ఆయన విమర్శించారు. త్వరలోనే రాష్ట్రస్థాయిలో కోనసీమ,ప్రకాశం, బాపట్ల, నెల్లూరు జిల్లాల సంఘ కన్వీనర్ లతో సమావేశం ఏర్పాటు చేసి 50, 000 నుంచి నంబర్లు వేయకుండా చూసే విధంగా కోరతమన్నారు. మేత ధరలు పెరిగిపోవడం, మరోవైపు రొయ్యలు ధరలు తగ్గించడం తో ఆక్వా రైతులు తీవ్ర అప్పులలో మునిగిపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ దాణ కంపెనీల యజమానులు దిగురాకుంటే భవిష్యత్ కార్యాచరణ రాష్ట్రస్థాయిలో రూపొందించుకుంటామని గాంధీ భగవాన్ రాజు తెలిపారు.

ఈ సమావేశంలో సంఘ నాయకులు కణపతి నరసింహారాజు, ఈశ్వర రాజు, సంజీవరాజు, వేగేసిన శ్రీహరి రాజు తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



- మండల వైద్యాధికారి, శెట్టిబత్తుల శ్రీ రామ రాజీవ్ కుమార్

శంఖవరం జూన్ 27 మనం ప్రతినిధిః పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి, శంఖవరం ప్రభుత్వాసుపత్రి వైద్యులు శెట్టిబత్తుల శ్రీ రామ రాజీవ్ కుమార్ తెలిపారు. గ్రామాల్లో అనువైన చోట పోలియా బూత్ లను ఏర్పాటు చేయాలని ఏ ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించుకోకుండా మిగిలిపోకూడదనే లక్ష్యంతో సిబ్బంది పని చేయాలన్నారు. మండలం లో గల రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రలలో ఉన్న మొత్తం 4359 (0-5 సం.)మంది పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్నారని,మొత్తం మండలంలో రెండు ఆసుపత్రిలకు సంబంధించి ఆరు రూటులుగా 6 సూపర్వైజర్ నియమిస్తూ, అలానే హైరిస్క్ కింద 7 ప్రదేశాలను గుర్తించారు, ఒక మొబైల్ టీం ఒక ట్రాన్సిట్ బూతుగా మొత్తం 44 బూతుల్లో ఈ పల్స్ పోలియో కార్యక్రమం చేయబోతున్నామని వైద్యులు వివరించారు. మండలంలో గల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## బైర్రాజు సత్యనారాయణ రాజు సేవలు సమాజానికి స్ఫూర్తి

- మాజీ సర్పంచ్ చెట్టుబత్తుల సువర్ణ రాజు

పోడూరు,జూన్ 27 మనం న్యూస్ : పశ్చిమ గోదావరి ప్రాంత ప్రజల సంక్షేమానికి జీవితాంతం కృషి చేసిన ప్రముఖ పారిశ్రామికవేత్త, దాత, సమాజసేవకుడు బైర్రాజు సత్యనారాయణ రాజు సేవలు చిరస్మరణీయమని మాజీ సర్పంచ్ చెట్టుబత్తుల సువర్ణ రాజు అన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, బైర్రాజు సత్యనారాయణరాజు వర్ధంతి సందర్భంగా శనివారం గ్రామంలోని బైర్రాజు వాటర్ ప్లాంట్ వద్ద నిర్వహించిన వర్ధంతి వేడుకల్లో మాజీ సర్పంచ్ చెట్టుబత్తుల సువర్ణ రాజు,బైర్రాజు సత్యనారాయణ రాజు చిత్రపటానికి రుద్రరాజు వరాహల రాజుతో కలిసి పూలమాలను వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సువర్ణ రాజు మాట్లాడుతూ విద్య, ఆరోగ్యం, స్వచ్ఛమైన తాగునీరు, గ్రామీణాభివృద్ధి వంటి రంగాల్లో ఆయన అందించిన సేవలు నేటికీ ప్రజలకు ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు.ప్రజాసేవనే పరమావధిగా భావించి బైర్రాజు సత్యనారాయణ రాజు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని,ముఖ్యంగా 20 సంవత్సరాల క్రితమే గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ఆయన సేవాభావానికి నిదర్శనమని అన్నారు.సమాజానికి తిరిగి ఇవ్వాలనే గొప్ప ఆలోచనతో విద్య, ఆరోగ్యం, తాగునీటి రంగాల్లో ఆయన అందించిన సేవలు ఎన్నటికీ మరువలేనివని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రముఖులు రుద్రరాజు శివాజీరాజు, రుద్రరాజు బంగార్రాజు( బంగారం), గణేష్ రాజు, చేకూరి సాయిరాజు, జంపన కృష్ణంరాజు, ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.అలాగే ఆయన సమాజానికి అందించిన పలు సేవలను కొనియాడారు.

# 29న సస్యవృద్ధి బీజారోపణోత్సవము



పిఠాపురం జూన్ 27(మనం న్యూస్) : 29న సస్యవృద్ధి బీజారోపణోత్సవము శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠము- పిఠాపురం వారి ఆధ్వర్యంలో పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో సస్యవృద్ధి బీజారోపణోత్సవము రైతుల కార్యక్రమం పీఠాధిపతి డ్ఛా ఉమర్ ఆలీషా వారి స్వీయ పర్యవేక్షణలో ఈ నెల 29 సోమవారం ఉదయం 8.00 గంఛలకు ఏరువాక కార్యక్రమంతో ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమంలో డా.పి. జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వ విద్యాలయం హైదరాబాద్ నుండి ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.ఎన్. రామ గోపా వర్మ, ప్రాంతీయ వరి పరిశోధనా క్షేత్రం, మార్టేరు నుండి అసోసియేట్ డైరెక్టర్ డా.సి.హెచ్.శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ ఎడ్వైజరీ మరియు ట్రాన్స్ఫర్ ఆఫ్ టెక్నాలజీ కేంద్రం, రాజమహేంద్రవరం నుండి ప్రిన్సిపల్ సైంటిస్ట్ డ్ఛామానుకొండ శ్రీనివాస్ మరియు ఎంటమాలజీ కో ఆర్డినేటర్ డా.సి.హెచ్.వి. నరసింహారావు, సి.ఇ.ఓ. -ఎల్.పి.ఆర్. ఆర్గానిక్స్ శ్రీ లోకసాని పద్మారెడ్డి, సంజీవినీ ఎన్విరాన్మెంటల్ ప్రొటెక్షన్ సొసైటీ సెక్రెటరీ శ్రీ పచ్చారి దేవుళ్ళు మరియు వ్యవసాయ, ఉద్యానవన అధికారులు పాల్గొని రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించెదరు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక, ప్రకృతి వ్యవసాయంలో చక్కని ప్రతిభ కనపరచిన ఐదుగురు రైతులకు పీఠాధిపతులచే సన్మానం జరుపబడును. ప్రకృతి వ్యవసాయం చేస్తూ రైతులను ప్రోత్సహిస్తూ ప్రచారం చేస్తున్న ఒక రైతుకు పరబ్రహ్మ శ్రీ మొహియుద్దీన్ బాద్షా రైతు మిత్ర 2026 పురస్కారం బహూకరించబడును రైతులు తమ సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు ప్రదర్శించే స్టాళ్ళు కూడా ఏర్పాటు చేయబడినది. ఈ కార్యక్రమంలో పాల్గొనే రైతులకు 'సద్గురు దివ్య బీజాలు' అందజేయబడును. రైతులకు అల్పాహారము, మధ్యాహ్నం భోజన వసతి కల్పించబడినది. కావున రైతు మిత్రుల కొరకు పీఠాధిపతులచే ప్రత్యేకంగా ఏర్పాటుచేయబడిన ఈ విశిష్ట సస్యవృద్ధి బీజారోపణోత్సవము 2026 ఏరువాక పౌర్ణమి సభలో పాల్గొని ఆధ్యాత్మిక ప్రకృతి సేంద్రియ వ్యవసాయ ప్రయోజనాలు పొందవలసినదిగా రైతు మిత్రులను కోరుచున్నాము

## వర్షాకాలంలో పారిశుద్ధ్యం, సురక్షిత తాగునీటిపై ప్రత్యేక దృష్టి



పోడూరు జూన్ 27 మనం న్యూస్ : పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు సంయుక్త జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి. జగదాంబ శనివారం ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణను మర్యాద పూర్వకంగా కలిసి వర్షాకాలంలో గ్రామాల్లో చేపట్టాల్సిన పారిశుద్ధ్య చర్యలపై చర్చించారు.ఈ సందర్భంగా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టడంతో పాటు ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు (ఎస్డబ్ల్యూఎంపీఎం షెడ్లు) సక్రమంగా నిర్వహించాలని, ప్రజలకు కలుషితం కాని సురక్షితమైన తాగునీటిని నిరంతరం అందించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే పితాని సూచించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తూ పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఈవో జగదాంబ ఆదేశించారు. అనంతరం పోడూరు మండలం వేడంగి గ్రామంలోని స్వచ్ఛ రథాన్ని సీఈవో పరిశీలించారు. స్వచ్ఛ రథం గ్రామానికి వచ్చే తేదీని రెండు రోజుల ముందుగానే విస్తృతంగా ప్రచారం చేయాలని, ప్రతి ఇంటి నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను స్వచ్ఛ రథానికే అందజేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామాల్లో దోమలు రహిత పరిశుభ్రమైన వాతావరణం నెలకొనేలా చర్యలు చేపట్టి డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ డయేరియా వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి ప్రజలను రక్షించాలని అధికారులను ఆదేశించారు.

## ప్రత్తిపాడులో ఒక నెల – ఒక గ్రామం – నాలుగు సందర్శనలు

- కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎస్.హరేంధిర ప్రసాద్
- ప్రత్తిపాడు పీజీఆర్ఎస్ కు 79 అర్జీలు



శంఖవరం, జూన్ 27 మనం ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వ సూచనలు మేరకు ఒక నెల - ఒక గ్రామం - నాలుగు సందర్శనలు కార్యక్రమం వరుసగా మూడో వారం శనివారం ప్రత్తిపాడు నియోజకవర్గ స్థాయిలో ప్రత్తిపాడు ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎస్.హరేంధిర ప్రసాద్.. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రత్యక అధికారి ఏ.శ్రీనివాసరావు తదితరులతో కలిసి హాజరై, ప్రత్తిపాడు నియోజకవర్గం చుట్టుపక్కల ప్రజల నుంచి నేరుగా వినతులను అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా గత రెండు వారాలలో నమోదైన అర్జీలు పరిష్కార పురోగతిని జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో ఉన్న సమస్యలకు అక్కడిక్కడే పరిష్కారించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రకారం ఒక నెల - ఒక గ్రామం - నాలుగు సందర్శనలు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు తహసీల్దార్ సూర్య ప్రభ, ఎంపీడీవవో కుమార్ బాబు, ఇతర మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు ఇతర అన్ని శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియోకు సర్వం సిద్ధం

**కొణిజర్ల, జూన్ 27 (మనం న్యూస్):** కొణిజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆదివారం (జూన్ 28) నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ మోనికా శృతి తెలిపారు. కొణిజర్ల పీహెచ్సీ పరిధిలోని 26 గ్రామాల్లో 0 నుంచి 5 సంవత్సరాల లోపు ఉన్న 3,384 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు ఆమె తెలిపారు.ఇందుకోసం మొత్తం 29 పోలియో బూత్లు, ఒక మొబైల్ బృందం, ఒక ట్రాన్సిట్ బృందం, రెండు రూట్ సూపర్వైజర్ బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. మొదటి రోజు పోలియో చుక్కలు వేయించుకోలేకపోయిన చిన్నారులకు జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి హౌస్ టు హౌస్ కార్యక్రమం ద్వారా పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. వలస వచ్చిన కుటుంబాల పిల్లలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, 0-5 సంవత్స రాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సమీప పోలియో బూత్కు తీసుకువచ్చి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# గ్రామీణ రవాణ సౌకర్యాలే లక్ష్యంగా రూ. 16.13 కోట్ల పనులకు శంకుస్థాపన



రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

కూసుమంచి మండలంలో బీటీ రోడ్లు, వంతెనల నిర్మాణ పనులకు శ్రీకారం

వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా శాశ్వత మౌళిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

చిరుజల్లుల మధ్యే దుబ్బతండా, లాల్సింగ్ తండా, జీళ్ళచెరువు గ్రామాల్లో పర్యటించిన మంత్రి పొంగులేటి

**కూసుమంచి, జూన్ 27(మనం న్యూస్):** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొనే రవాణా సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి మండలంలో విస్తృతంగా పర్యటించిన మంత్రి, చిరుజల్లులను సైతం లెక్కచేయకుండా దుబ్బతండా, లాల్సింగ్ తండా, జీళ్ళచెరువు గ్రామాల్లో మొత్తం రూ. 16.13 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్లు, వంతెనల నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి శంకుస్థాపనలు చేశారు.

ఈ సందర్భంగా ₹మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ₹ వర్షాకాలంలో తండాలు, గ్రామాల ప్రజలు బురద రోడ్లు, ఉధృతంగా ప్రవహించే వాగుల కారణంగా పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ పనులను మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రహదారులు, వంతెనలు నిర్మించడం ద్వారా ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు అత్యవసర సేవలు, విద్య, వ్యవసాయ కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకం లేకుండా ఉంటుందని అన్నారు. వర్షాలు కురుస్తున్నప్పటికీ ప్రజా ప్రయోజనాల కోసం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు ఆగవని స్పష్టం చేశారు. అధికారులు నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

పర్యటనలో భాగంగా దుబ్బతండా గ్రామంలో జెడ్పీ రోడ్డు గైగోళ్లపల్లి నుంచి దుబ్బతండా వరకు రూ. 2.10 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

అలాగే జెడ్పీ రోడ్డు నుంచి కొత్తూరు-ఎర్రగడ్డ తండా మీదుగా దుబ్బతండా వరకు రూ. 4.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం లాల్సింగ్ తండా నుంచి నేరేడువాయి వరకు రూ. 2.03 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. జీళ్ళ చెరువు గ్రామంలో జీళ్ళచెరువు మీదుగా కొండాపురం నుంచి మోటాపురం వెళ్లే ప్రధాన రహదారిపై రూ. 7.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రెండు వంతెనల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, పిడి హౌజింగ్ భూక్యా శ్రీనివాస్, కూసుమంచి మండల తహసీల్దార్ సైదులు, వివిధ శాఖల జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భద్రాద్రి రామయ్య ఆలయ పునరుద్ధరణ పనులు

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా శాస్త్రోక్తంగా పనులు చేపట్టాలి

భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాచలం,జూన్ 27( మనం న్యూస్):** భారతదేశంలో దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం పునరుద్ధరణ పనులు ఆగమ శాస్త్ర ప్రకారం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఘనంగా ప్రారంభించడం జరిగిందని భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు , జిల్లా కలెక్టర్ అంకిత్ పేర్కొన్నారు.శనివారం నాడు భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం ఆలయ పునరుద్ధరణ పనులు జిల్లా కలెక్టర్ అంకిత్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట వేద పండితుల మంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా ఉదయం 7.30 గంటలకు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు మాట్లాడుతూ దేశంలోనే ప్రసిద్ధిగాంచిన భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానం మాడవీధులు, భక్తులకు సౌకర్యంగా ఉండేలా నిర్మాణాలు చేపట్టి దేవస్థానమును టెంపుల్ సిటీగా రూపొందించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 540 కోట్ల రూపాయలను మంజూరు చేసి, శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణం జరిగిన రోజునే గౌరవ ముఖ్యమంత్రి చేతులు మీదుగా శంకుస్థాపన చేయించడం జరిగిందని, మొదటి విడతగా 350 కోట్లు విడుదల కాగా ప్రస్తుతం 200 కోట్లతో పనులు ప్రారంభించడం జరిగిందని అన్నారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన ఈ దేవస్థానానికి భక్తులు అధికంగా వస్తున్నందున, వారు ఎటువంటి ఆటంకాలు లేకుండా దర్శనం చేసుకునేలా సౌకర్యాలు కల్పిస్తూ పునరుద్ధరణ పనులు జరిపించడం జరుగుతుందని, 2027 జూన్ మాసంలో ప్రారంభమయ్యే గోదావరి పుష్కరాల నాటికి పూర్తిస్థాయిలో దేవస్థానం పునరుద్ధరణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవంగా వెలుగొందుతున్న భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయం ఆధ్యాత్మిక, సాంస్క ృతిక వారసత్వానికి ప్రతీక అని అన్నారు. ఆలయ పునరుద్ధరణ పనులను ఆగమ శాస్త్ర నిబంధనలకు అనుగుణంగా, సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్త పద్ధతిలో నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు.పునరుద్ధరణ పనుల సందర్భంగా ఆలయ పవిత్రతకు, ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ఎలాంటి భంగం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతి నిర్మాణ ప్రక్రియను వేద పండితులు, ఆగమ శాస్త్ర నిపుణుల సూచనల మేరకు చేపట్టాలని పేర్కొన్నారు.

అదేవిధంగా, పనుల కారణంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. స్వామివారి దర్శనం, నిత్య పూజలు, అర్చనలు, ఇతర సేవలు నిరంతరాయంగా కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తుల రాకపోకలు, క్యూ లైన్లు, తాగునీరు, పరిశుభ్రత, భద్రత తదితర అంశాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పునరుద్ధరణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటిస్తూ, నిర్ణీత గడువులో పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో దామోదర రావు, ఇరిగేషన్ ఈ ఈ జానీ, భద్రాచలం డిప్యూటీ తాసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, సర్పంచ్ పూణేం కృష్ణ ,ఈవో గ్రామపంచాయతీ శ్రీనివాస్, వేద పండితులు, దేవస్థానం అధికారులు, ఇంజినీరింగ్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దెందుకూరు గ్రామ పంచాయతీనీ సందర్శించిన అడిషనల్ కలెక్టర్ డా: శ్రీజ



**మధిర,జూన్27(మనం న్యూస్):** రైతు ఆశీర్వాద భహిరంగ సభ సన్నాహక కార్యక్రమం మరియు ఈ నెల 30 వ తేదీన చింతకాని మండలంలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభ ఏర్పాట్ల పరిశీలన కొరకు అడిషనల్ కలెక్టర్ శ్రీజ దెందుకూరు గ్రామ పంచాయతీ ను సందర్శించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో రైతన్నలు రైతు సన్నాహక సభకు చేరుకునే విధంగా తగు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్య క్రమంలో యం పీ డి వో బీ వెంకటేశ్వర్లు , యం పీ వో గ,,గ్రామ పంచాయతీ సర్పంచ్ పగిడిపల్లి శ్రీనివాసరావు , కోపరేటివ్ సొసైటీ చైర్మన్ కోట వెంకట కృష్ణ , ఏ ఓ సాయి దీక్షిత్ గ, ఏ ఈ ఓ ప్రవళిక ,స్వయం సహాయక గ్రూప్ సభ్యులు, గ్రామస్థులు, పంచాయతీ కార్యదర్శి భాస్కర్ పాల్గొన్నారు.

## కరకట్ట విస్తరణ పనులు వేగవంతం చేయాలి: తుమ్మల



**భద్రాచలం, జూన్ 27 (మనం న్యూస్):** వరద 70 అడుగులకు పైగా వరద వచ్చిన భద్రాచలం పట్టణంలోకి వరద నీరు రాకుండా కరకట్ట విస్తరణ పనులు ఇరిగేషన్ , నేషనల్ హైవే అధికారులు సమన్వయంతో పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు.శనివారం నాడు భద్రాచలంలో నూతనంగా నిర్మాణంలో ఉన్న కరకట్ట పనులను ప్రత్యక్షంగా ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1986వ సంవత్సరంలో భద్రాచలంలో ఉన్న గోదావరి జలప్రళయాన్ని పరిగణలోకి తీసుకొని, నూతనంగా కరకట్ట నిర్మాణం చేపట్టామని, ఉమ్మడి రాష్ట్రంలో భద్రాచలం వద్ద గోదావరి కరకట్ట నిర్మాణం చేపట్టడం వలన భద్రాచలం పట్టణం, పరివాహక ప్రాంతాలను గోదావరి వరద తాకిడికి గురికాకుండా చాలా వరకు నియంత్రించగలిగామని, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రివర్యులు గోదావరి కరకట్ట విస్తరణకు 38 కోట్లు శాంక్షన్ చేయగా విస్తరణ పనులు చేపట్టామని అన్నారు.భద్రాచలం పట్టణానికి కరకట్ట శ్రీరామరక్షగా నిలిచిందని అన్నారు. నూతనంగా నిర్మించే కరకట్ట పైనుంచి క్రాసింగ్ అయ్యే జాతీయ రహదారి బ్రిడ్జి డిజైన్ జాప్యం వల్ల కరకట్ట నిర్మాణం పనులు కొంత ఆలస్యమైందని అన్నారు.

కరకట్ట నిర్మాణం పనులకు ఎటువంటి ఆటంకాలు సందేహాలు లేనందున నీటిపారుదల శాఖ అధికారులు, జాతీయ రహదారుల శాఖ ఇంజనీర్లతో కలిసి, నిర్మాణ పనుల పురోగతి పనులను పరస్పర సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాబోయే గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకొని ఎటువంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని సూచించారు.గోదావరి వరదల సమయంలో భద్రాచలం పరిసర ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించే విధంగా కరకట్ట నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవో బి రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట, నీటిపారుదల శాఖ అధికారులు, జాతీయ రహదారుల శాఖ ఇంజనీర్లు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కొత్తగూడెంలో ఘనంగా మొహరం పండుగ వేడుకలు



**కొత్తగూడెం టౌన్, జూన్ 27 (మనం న్యూస్):** కొత్తగూడెం పట్టణంలోని 52వ డివిజన్ పరిధిలో మొరం పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలు గత 30 సంవత్సరాలుగా ఎస్.కె. అక్బర్ ఆధ్వర్యంలో నిరంతరాయంగా కొనసాగుతూ స్థానికంగా ప్రత్యేక గుర్తింపు పొందాయి. ప్రతి సంవత్సరం ఈ వేడుకలకు వేలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, తమ మొక్కులు తీర్చుకుంటున్నారు. వేడుకల సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రత్యేక ప్రార్థనలు, సంప్రదాయ పూజా కార్యక్రమాలు భక్తిపూర్వక వాతావరణంలో జరిగాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, గత మూడు దశాబ్దాలుగా ప్రజల సహకారం, భక్తుల విశ్వాసంతో ఈ వేడుకలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులందరికీ తగిన సౌకర్యాలు కల్పించడంతో పాటు ప్రశాంత వాతావరణంలో కార్యక్రమాలు జరిగేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. మొరం పండుగ సామరస్యానికి, భక్తి భావానికి ప్రతీకగా నిలుస్తూ ప్రతి ఏడాది మరింత వైభవంగా కొనసాగుతుండడం విశేషం.

## చెరువుల ఆకమణ కాకుండా చూడండి మంత్రి తుమ్మల



**దమ్మపేట, జూన్ 27(మనం న్యూస్):** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. దమ్మపేట మండలం గండుగులపల్లి నివాస గృహంలో సత్తుపల్లి నియోజకవర్గ ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఆక్రమణలకు గురి కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. చెరువుల్లో నీళ్లు నిండితే భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ముఖ్యంగా మండల కేంద్రాల్లోని చెరువులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు.

# సందుదొరికిందా మూతే...

## వరుస సెలవులతో శనివారం ఉపాధ్యాయుల డుమ్మా

- ఒకే రోజు తెరుచుకోని ఐదు ప్రభుత్వ పాఠశాలలు
- రాళ్లాపురం, కిష్టారంపాడు పాఠశాలలో మద్యాహ్నం బోజనం నిల్
- మద్యాహ్న భోజనం పెట్టినట్టు కలరింగ్
- పట్టించుకోని అధికారులు






**చర్ల, జూన్ 27 (మనం న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సందు దొరికితే పాఠశాలలను మూతేస్తున్నారు. అధికారుల అలసత్వం ఉపాధ్యాయులకు దీమాను తెచ్చిపెట్టగా, ఆదివాసీ విద్యార్థులకు శాపంగా మారుతోంది. శుక్రవారం, ఆదివారం సెలవులు కావడం మద్యలోని శనివారం పనిదినం ఆ.. అయినా ఎవరూ చూస్తారులే...అసలే మారుమూల అటవీప్రాంత పాఠశాలలు అన్న దీమాతో పనిదినమైన శనివారం పలువురు ఉపాధ్యాయులు బడులకు డుమ్మా కొట్టారు. ఫలితంగా ఒకే రోజు ఐదు ప్రభుత్వం పాఠశాలల తలుపులు తెరుచుకోక మూతపడ్డాయి. ఉపాధ్యాయల గైర్హాజరీతో విద్యార్థులు చెట్టూ పుట్టా పట్టుకొని తిరుగుతున్నారు. ఉపాధ్యాయులు విదులకు రాకున్నా విదులకు వచ్చినట్లు, మద్యాహ్న భోజనం పెట్టినట్లు పక్కపాఠశాలల ఉపాధ్యాయులు, సిఆర్పిలు విద్యాశాఖ అదికారిక గ్రూపులలో కలరింగ్ ఇస్తూ సమాచారం పెట్టడం గమనార్హం.

చర్ల మండల విద్యా వ్యవస్థ అద్వాన్నంగా మారింది. ముఖ్యంగా మారుమూల అటవీప్రాంత గ్రామాలలోని పాఠశాల పర్యవేక్షణ లేకపోవడంతో అక్కడి ఉపాధ్యాయులు సందు దొరికితే పాఠశాలలకు మూత పెడుతున్నాను. పాఠశాలల పుణ:ప్రారంభమైన మొదటి రోజయిన జూన్ 15 వ తేదీన ఎర్రంపాడు పాఠశాల తెరుచుకోని విషయం మరువకముందే శనివారం మండలంలోని నాలుగు మండల పరిషత్, ఒక గిరిజన ప్రభుత్వం పాఠశాలలు తెరుచుకోకపోవడం విద్యా వ్యవస్థలోని డొల్లతనం బట్టబయలు చేసింది. శుక్రవారం బక్రీద్ కారణంగా సెలవు దినం, మద్యలో శనివారం పనిదినం, తర్వాతి రోజు ఆదివారం సెలవు దినం కావడంతో ఎవరూ పట్టించుకోరనే ధైర్యంతో పలువురు ఉపాధ్యాయులు శనివారం విదులకు గైర్హాజరయ్యారు. సెలవు పెట్టినట్టు ఆ శాఖ అదికారులు తప్పును మసిపూసి మారేడు కాయ చేసే ప్రయత్నం చేస్తున్నా ఒకే రోజు ఒకే పాఠశాలలోని ఇద్దరు ఉపాద్యాయులకు సెలవులు ఎలా మంజూరు చేసారో సంబంధిత అదికారులకే తెలియాలి. సింగిల్ స్కూల్ టీచర్ సెలవు పెడితే పక్క పాఠశాల నుండి ఉపాద్యాయుడిని డిప్యుటేషన్ పై పంపాల్సి ఉంటుంది. కాని దీనికి విరుద్ధంగా జరగడంతో రాళ్లాపురం, గోరుకొండ, బట్టిగూడెం మండల పరిషత్ పాఠశాలలు, కిష్టారంపాడు గిరిజన ప్రభుత్వ పాఠశాలలు పూర్తిగా మూతపడగా కొండెవాయి మండల పరిషత్ పాఠశాల మద్యాహ్నం నుండి మూతపడింది. రాళ్లాపురం ఉపాద్యాయురాలు పాఠశాలకు రాకపోవడంతో ఇక్కడి 29 మంది విద్యార్థులకు మద్యాహ్న భోజనం దూరమయ్యారు. గోరుకొండ మండల పరిషత్ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు విదులకు హాజరుకాలేదు. దీంతో పాఠశాల స్కావెంజర్ శ్రావణి 42 మంది విద్యార్థులను వరండాలో కూర్చోబెట్టుకొని పాఠాలను బోదిస్తోంది. విలేఖరులు పాఠశాలకు వచ్చిన విషయం తెలుసుకున్న తిప్పాపురం ప్రాదమికోన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాద్యాయులు గోరుకొండ పాఠశాలకు వచ్చి తప్పును సరిదిద్దేయత్నం చేసారు. తిప్పాపురం పాఠశాలలో నలుగురు ఉపాద్యాయులు కాగా వీరిలో ఇద్దరు శనివారం సెలవు పెట్టారు. మిగిలిన ఇద్దరు ఉపాద్యాయులు పాఠశాలను వదిలేసి పక్కపాఠశాలకు రావడం గమనార్హం. గోరుకొండలో విద్యార్థులు వచ్చినట్లు వారికి మద్యాహ్న భోజనం పెట్టినట్లు వీరు పిల్లల హాజరును తీసి సంబంధించిన ప్రదానోపాధ్యాయుడుకు పంపగా ఆయన పాఠశాలకు రాకుండానే వచ్చినట్లు అదికారిక గ్రూపులో సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. బట్టిగూడెం మండల పరిషత్ పాఠశాల ఉపాద్యాయుడు సైతం విదులకు హాజరుకాకపోవడంతో పాఠశాల మూతపడింది. మద్యాహ్నభోజన కార్మికులు 19 మంది విద్యార్థులకు భోజనం వడ్డించారు. కొండెవాయి పాఠశాల ఉపాద్యాయుడు సెలవు పెట్టడంతో అక్కడికి ఎర్రబోరు పాఠశాల నుండి ఒక ఉపాద్యాయుడిని తాత్కాలిక సర్దుబాటుతో పంపించగా ఆయన మద్యాహ్నం నుండి పాఠశాలను మూతేసి వెనుదిరిగాడు. కిష్టారంపాడు గిరిజన సంక్షేమ ప్రభుత్వ పాఠశాల సైతం మూతపడింది. ఇక్కడ ఉన్న ఇద్దరు ఉపాద్యాయులు విదులకు గైర్హాజరయ్యారు. పాఠశాల మూతపడటంతో ఇక్కడి విద్యార్థులు మద్యాహ్న భోజనానికి నోచుకోలేదు. పాఠశాల తెరవకపోవడంతో విద్యార్థులు అడవులను, చెట్టు, పుట్టను పట్టుకొని తిరగడం కనిపించింది. విద్యాశాఖ అదికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం కారణంగానే ఉపాద్యాయులు తరచూ విదులకు గైర్హాజరవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. మారుమూల అటవీప్రాంత గ్రామాలలో పాఠశాలలు ఉండటం, అదికారులు ఎవరూ తనిఖీలకు రారనే దీమాతో ఇక్కడి ఉపాద్యాయులు డుమ్మా కొడుతుండటంతో ఇక్కడి ఆదివాసీ చిన్నారులకు విద్య అందని ద్రాక్ష గానే మిగులుతోంది. జిల్లా కలెక్టర్, ఐటిడిఏ పివో, జిల్లా విద్యాశాఖ అదికారులు కలుగ చేసుకొని మండలంలో గాడితప్పిన విద్యావ్యవస్థను గాడిన పెట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

# శ్రీశ్రీశ్రీ సద్గురు కాశిరెడ్డి నాయన 21వ ఆరాధనోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు



- డాన్స్ ప్రోగ్రాం కు రూ.1.05 లక్షల బహుమతులు
- 122 గోమాతల దానం
- రూ.80 వేల అన్నదాన విరాళం

**తుగ్గలి, జూన్ 23 (మనం న్యూస్ ):** తుగ్గలి మండల పరిధిలోని రాంపల్లి గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ సిద్ధగురు కాశిరెడ్డి నాయన 21వ ఆరాధనోత్సవాలను ఈ నెల 29, 30 తేదీలలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఆధ్యాత్మిక మహోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. జూన్ 29వ తేదీ సోమవారం ప్రత్యేక పూజలు, భజనలు, తీర్థప్రసాద పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాత్రి 8 గంటలకు నేషనల్ లెవల్ డాన్స్ పోటీలు నిర్వహించనుండగా, విజేతలకు మొత్తం రూ.1,05,000 నగదు బహుమతులను దాతలు రాంపల్లి దుబ్బల నరసింహమూర్తి, దుబ్బల శేషయ్య కుటుంబ సభ్యులు అందజేయనున్నారు. అదే రోజు రాత్రి 9 గంటలకు శ్రీ కాశిరెడ్డి నాయన ఆశీస్సులతో, శ్రీ సీతారాముల కృపతో రాంపల్లి శీను వారి చెక్కభజన బృందం ఆధ్వర్యంలో గజ్జల పూజ ఉత్సవం నిర్వహించనున్నారు. అనంతరం గ్రామ ప్రజల సహకారంతో పంచమాంకములు అనే ఉచిత నాటకాన్ని రాంపల్లి మౌలాలి ట్రూప్ వారు ప్రదర్శించనున్నారు. జూన్ 30వ తేదీ మంగళవారం ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు, మహా అన్నదానం నిర్వహించనున్నారు. మహా అన్నదాన కార్యక్రమానికి లోసారి తిమ్మన్న, లోసారి తిమ్మక్క, లోసారి పులికొండ, లోసారి రజిని, హిటాచి ఓనర్ కె.పీ. గుడిసెల కుటుంబ సభ్యులు కలిసి రూ.80,000 విరాళంగా అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇక కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం చిన్న మారేడు గ్రామానికి చెందిన భక్తుడు పెద్ద నాగన్న ఆశ్రమానికి భక్తిశ్రద్ధలతో 122 గోమాతలను (ఆవులను) దానం చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు వెల్లడించారు. ఆయన సేవాభావాన్ని నిర్వాహకులు అభినందించారు. భక్తుల రాకపోకల సౌకర్యార్థం ఆర్.ఎస్. పెండేకల్లు మరియు అడ్డరోడ్డు ప్రాంతాల నుంచి ఆటో సంఘం ఆధ్వర్యంలో ఉచిత ఆటో సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు పాల్గొనే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఆరాధనోత్సవాల సందర్భంగా నిర్వహించే అన్ని కార్యక్రమాలలో భక్తులు పాల్గొని గురువుల ఆశీస్సులు పొందాలని ఉత్సవ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా గ్రాడ్యుయేషన్ డే




**కాట్రేనికోన జూన్ 27 మనం ప్రతినిధి :** కందికుప్ప సెక్టార్ దొంతికుర్రు అంగన్వాడీ సెంటర్ వద్ద సిడిపిఓ ముదునూరి నీహారిక ఆధ్వర్యంలో శనివారం ఘనంగా గ్రాడ్యుయేషన్ డే సెలబ్రేషన్ జరిగింది...అంగన్వాడీ సెంటర్లో ప్రీస్కూల్ పూర్తి చేసుకుని ఎలిమెంటరీ స్కూల్ నందు ఒకటో తరగతిలో జాయిన్ అయ్యే పిల్లలకు ప్రీస్కూల్ సర్టిఫికెట్స్ అంద చేయటం జరిగింది...సెక్టార్ సూపర్వైజర్ కుమారి లంకే వెంకట రమణ మీటింగ్ నందు తల్లులతో మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్లో ప్రీస్కూల్ పిల్లలను జాయిన్ చేస్తే మీ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం అంగన్వాడీ కార్యకర్తలు ఆనందమైన ఆట పాటలతో విద్యను, ఆరోగ్యమైన పౌష్టికాహారం అందిస్తారని మరియు 'ప్రైవేట్ ప్లేస్కూల్ వద్దు...అంగన్వాడీ ప్రీస్కూల్ ముద్దు' అని తెలియ చేసారు...అంగన్వాడీ కార్యకర్తలు మట్టపర్తి ధన లక్ష్మి, కాశి వెంకట రాజ కుమారి, బొజ్జా రాజ్య లక్ష్మి, పాలెపు సత్యలావణ్యము, దున్న అమరావతి, నందిక సూర్య ఆదిలక్ష్మి కళ్యాణి, రామాడి ధనావతి మరియు తల్లులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజల ఆలోచన విధానంలో మార్పు రావడం ద్వారానే హింసలు తగ్గుతాయి




**ముమ్మిడివరం, జూన్ 27,మనం న్యూస్:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం ఐ పోలవరం మండలం జి వేమవరం గ్రామంలో బీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో గ్రామ సమైక్య సభ్యులకు మహిళలు మరియు బాలలకు వ్యతిరేకంగా హింస మరియు జెండర్ ఆధారత హింసను గూర్చి అర్థ సంవత్సర శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ గా పాల్గొన్న సామాజిక కార్యకర్త పి ప్రమీల మాట్లాడుతూ సమాజంలో హింసలు తగ్గుముఖం పట్టాలంటే ప్రజల ఆలోచన విధానంలో మార్పు రావలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీమాబాయి మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన మాట్లాడుతూ మహిళలపై మరియు బాలలపై హింసల జరుగుతున్న పరిస్థితిని వివరించి,తగ్గించే చర్యలను గురించి వివరించారు. అదేవిధంగా జెండర్ ఆధారిత హింసలు తగ్గించేందుకు కుటుంబాల వారి కౌన్సిలింగ్ ప్రక్రియ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు పరిధిలోని మహిళలు మరియు బీమాబాయి మహిళా మండలి సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మొహరం వేడుకలు



**తుగ్గలి, జూన్ 27(మనం న్యూస్ ):** మండల కేంద్రమైన తుగ్గలిలో శనివారం రాత్రి మొహరం వేడుకలు భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. గత కొన్ని రోజులుగా నిర్వహించిన మొహరం కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పీర్ల స్వాములకు మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లు, పీర్ల చవిడి ప్రాంతాల్లో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించారు. ప్రజలు పోలీసులకు సహకరించడంతో మొహరం వేడుకలు ప్రశాంతంగా ముగిశాయని అధికారులు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేసిన పోలీసు సిబ్బందిని పలువురు అభినందించారు.

## శ్రీ కాణిపాక వినాయక స్వామిని దర్శించుకున్న డీజీపీ హరీష్ కుమార్ గుప్తా

- కాణిపాకం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన డీజీపీ



**చిత్తూరు జూన్ 27 మనం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ శాఖ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) హరీష్ కుమార్ గుప్తా శనివారం చిత్తూరు జిల్లా లోని కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానాన్ని సందర్శించి,ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డి.జి.పి (లా అండ్ ఆర్డర్) మధుసూదన్ రెడ్డి, చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి, డీజీపీతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆలయ అధికారుల ఆధ్వర్యంలో డీజీపీకి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రంతో సత్కరించారు.జ ఆలయ దర్శనం అనంతరం డీజీపీ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రంలో శాంతిభద్రతలు మరింత బలోపేతం కావాలని శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.రాష్ట్ర పోలీస్ శాఖ ప్రజలకు సమర్థవంతమైన, పారదర్శకమైన ప్రజా కేంద్రిత పోలీసు సేవలను అందించేందుకు నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, మహిళలు,చిన్నారుల భద్రత, సైబర్ నేరాల నివారణ, సాంకేతికత ఆధారిత ఆధునిక పోలీసింగ్కు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.ప్రజల సహకారంతోనే నేరాలను సమర్థవంతంగా నియంత్రించడం సాధ్యమవుతుందని పేర్కొంటూ, ప్రతి పౌరుడు పోలీస్ శాఖకు సహకరించి శాంతియుత, సురక్షిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని డీజీపీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డి.జి.పి (లా అండ్ ఆర్డర్) మధుసూదన్ రెడ్డి,చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి,చిత్తూరు సబ్- డివిజన్ది. ఎస్పీజె.వెంకటనారాయణ, కాణిపాక దేవస్థానం ఈవో పెంచల కిషోర్, ఆలయ అధికారులు పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

## స్విమ్స్ నందు కృత్రిమ మేధతో వైద్య విద్య సేవల్లో విప్లవాత్మక మార్పులపై ప్రత్యేక వర్క్ షాప్




**తిరుపతి జూన్ 27 మనం న్యూస్:** శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) హాస్పిటల్ నందు కృత్రిమ మేధ ఆర్టిఫిషియల్ ఇంటలిజెంట్స్ (ఏ.ఐ) వైద్య విద్యను బోధించే విధానాన్ని వైద్య నిర్ణయాలకు మద్దతు అందించే ప్రక్రియను, అలాగే ఆరోగ్య సంరక్షణ సేవల నిర్వహణను వేగంగా రూపాంతరం చెందిస్తున్న నేపథ్యంలో, ఈ రంగంలో తాజా పరిణామాలను వైద్య విద్యావేత్తలు, వైద్యులు, పరిశోధకులు సాంకేతిక నిపుణులతో పంచుకోవడానికి శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (స్విమ్స్) తిరుపతి .ఎ.ఐ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక వర్క్ షాప్ ను శనివారం శ్రీ పద్మావతి ఆడిటోరియం నందు నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డ్యా రామ్ తెలిపారు.స్విమ్స్ సంచాలకులు ఉపకులపతి డ్యా ఆర్.వి.కుమార్, డీన్ డ్యా అలోక్ సచన్, రిజిస్ట్రార్ డా అపర్ణ ఆర్. బిట్లా, మెడిసిన్ విభాగాధిపతి సీనియర్ గ్రేడ్ ప్రొ డా అల్లాడి మోహన్, అతిథి వక్తలు సహ వ్యవస్థాపకులు మరియు ముఖ్య కార్యనిర్వాహక అధికారి ఓరుగంటి అరవింద్, జి. మంజునాథ్, అల్లాడి వి. శ్రీకుమార్, ఐ.టి.యస్, ప్రిన్సిపాల్ జనరల్ మేనేజర్, బి.యస్.యన్.యల్., నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా సుధారాణి, బయోటెక్నాలజీ విభాగాధిపతి డ్యా ఉమామహేశ్వరి సంయుక్తంగా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.మారుతున్న కాలానికి అనుగుణంగా, మనమంతా ఏ.ఐ -సిద్ధమైన ఆరోగ్య నిపుణులుగా మారి, వైద్య రంగ భవిష్యత్తును మరింత మెరుగుపరుద్దామన్నారు. వైద్యరంగంలో ఏ.ఐ విప్లవం, వైద్య విద్యలో ఏ.ఐ మార్పులు, జనరేటివ్ ఏ.ఐ ద్వారా క్లినికల్ ఉత్పాదకత, వైద్య పరిశోధనలు, అభ్యాసం మరింత సులువవుతాయని ప్రముఖ వైద్య నిపుణులు పేర్కొన్నారు. స్విమ్స్ నెట్ వర్క్ ఇంజనీర్ ప్రణయ్ తేజ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆర్.యం.ఓ డ్యా కోటిరెడ్డి, డ్యా సతీష్, డిప్యూటీ రిజిస్ట్రార్ డ్యా యర్రంరెడ్డి, డా శివరామక్రిష్ణ పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను పకడ్బందీగా నిర్వ హించాలి

- జిల్లా సంయుక్త కలెక్టర్ నైదియాదేవి



**అమలాపురం జూన్ 27:మనం న్యూస్** భారత ఎన్నికల సంఘం అత్యంత ప్రతి ష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని జిల్లాలో అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ వైఖో నైదియాదేవి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక గోదావరి భవన్ నందు ప్రతి మండలానికి ఇటీవల నియ మించిన ఏ ఈ ఆర్ వో లకు ఎన్యూమరేషన్ దరఖాస్తులు ఫారం 6, 7, 8 డిక్లరేషన్ ఫారాలు నింప డంపై శి.అర్హులైన మాస్టర్ ట్రైనర్లు, ఎన్నికల సిబ్బం దికి ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణా కార్యక్ర మానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రజాస్వా మ్య వ్యవస్థకు ఖచ్చితత్వంతో కూడిన ఓటర్ల జాబితాయే పునాదని స్పష్టం చేశారు.ఈ బాధ్యతను ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఒక్క అధికారి, సిబ్బంది అత్యంత అంకిత భావంతో నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఎన్యూమ రేషన్ ఫారం ఏ విధంగా నింపాలో మాస్టర్ ట్రైనీలు పవర్ పాయింట్ ప్రజెంటే షన్ ద్వారా పరిపూర్ణమైన అవ గాహనను ఏ ఈ ఆర్ వో లకు కల్పించారు అదే విధంగా ఫారం 6,7,8 నింపడం ఫారా 6,8, ఫారాలకు సంబంధించి డిక్లరే షన్ ఫారాలు నింపడంపై సంపూర్ణమైన అవగాహన పెంపొందించారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే లక్ష్యంతో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క యువతీ యువకుడిని ఓటరుగా నమో దు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ము ఖ్యంగా కళాశాల విద్యార్థులు, నూతన ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించా లన్నారు జాబితాలో నకిలీ ఓట్లు, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉండటం (డూప్లికే షన్) మరియు మరణించిన వారి పేర్లు ఉంటే వాటిని చట్టపర మైన నిబంధనల ప్రకారం ఫారం 7 ద్వారా తొలగించాలన్నారు ఓటర్ల పేర్లు, చిరునామాల్లో తప్పులు దొర్లకుండా క్షేత్రస్థా యిలో క్షుణ్ణంగా పరిశీలించాల న్నారు.భారత ఎన్నికల సంఘం అందిస్తున్న అత్యాధునిక యాప్లు, ఐటి పోర్టళ్లను సిబ్బంది సమర్థవంతంగా వినియోగించి పారదర్శకతతో జాబితాలు రూపొందించాల న్నారు ఆన్లైన్ ద్వారా వచ్చే దరఖాస్తులను ఎప్ప టికప్పుడు పరిష్కరించాలన్నారు. క్షేత్ర స్థాయిలో పనిచేసే బూత్ లెవెల్ అధి కారులు సూపర్వైజర్లకు ఈ సవరణ ప్రక్రియపై పూర్తి అవగాహన తర్ఫీదు తప్ప నిసరిగా ఉండాలన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకొని, ఎలాంటి సందే హాలున్నా ఇక్కడే నివృత్తి చేసుకోవాలన్నారు.ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి అలసత్వాన్ని సహిం చేదిలేదన్నారు విధు ల్లోనిర్లక్ష్యం వహించే సిబ్బందిపై ఎన్నికల సం ఘం నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటార న్నారు. జిల్లాలో ఇంటింటి సర్వే ముమ్మరంగా సాగుతోందని ఎన్యూమరేషన్ పత్రాలు 98శాతం పంపిణీ చేసినట్లు ఆమె వెల్లడించారు ఈ శిక్షణా కార్య క్రమంలో డి ఆర్ ఓ సుబ్బారావు తహశీల్దార్లు, ఎంపీడీ వోలు, ఉప ఎంపీడీవోలు ఎంఈఓలు ఎన్నికల విభాగం సూపరింటెం డెంట్లు మరియు మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



**బేతంచెర్ల జూన్ 27 (మనం న్యూస్ )** మండలం పరిధిలో ఆర్ ఎస్ రంగాపురం ఎస్సీ కాలనీ కి చెందిన బందరు గాళ్ళ ఓబులేసు కు బేతంచెర్ల పట్టణం లోని తెదేపా కార్యలయం లో టీడీపీ మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ మరియు 5 వేలు తమ సొంత నిధులతో శనివారం అయన చేతులమీదుగా అందజేశారు బాధిత బందరు ఓబులేష్ కు గత ఏడు నెలల క్రితం లారీ ఆక్సిడెంట్ లో రెండు కాళ్లు కోల్పోయాడు అందు నిమిత్తం డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి మరియు బేతంచర్ల టీడీపీ మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య సహకారం తో ఈ ఆర్థిక సహాయం అందిందని వారికి కృతజ్ఞతలు బాధితుడు తెలిపాడు ఈ కార్యక్రమం లో నంద్యాల జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి లొడ్డ శేఖర్ టీడీపీ నాయకులు లొడ్డ రామ మద్దయ్య నల్లాడ్డి వెంకటేశ్వర్లు జంబులయ్య తదితరులు పాల్గొన్నారు

## బేతంచర్ల మహాత్మా జ్యోతిరావు పూలే హాస్టల్లో జరిగిన నిర్లక్ష్యం



- నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపల్ పై చర్యలు తీసుకోవాలి

**బేతంచేర్ల జూన్ 27 (మనం న్యూస్ )** మహాత్మా జ్యోతిరావు పూలే హాస్టల్లో సీట్ల కోసం నంద్యాల ఆవుకు బెలగల్ తదితర దూర ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు తల్లిదండ్రులు మధ్యాహ్నం 12 గంటల నుంచే వేచి ఉన్నారు అయినప్పటికీ ప్రిన్సిపాల్ వారిని పిలిచి వారి సమస్యలు వినకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనంతల్లిదండ్రులు వైస్ ప్రిన్సిపాల్ను ఇతర సిబ్బందిని కలిసి తమ సమస్య చెప్పగా సీట్ల విషయమై మేము మాట్లాడలేం ప్రిన్సిపాల్ ను కలవాలి అని చెప్పారు అయితే అదే సమయంలో ప్రిన్సిపాల్ ని కలిసే అవకాశం కూడా ఇవ్వలేదు ప్రిన్సిపాల్ గది తలుపులు మూసివేయడం స్టాఫ్ రూమ్ కూడా మూసివేయడం వల్ల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు సిబ్బందిని మళ్లీ అడిగితే ప్రిన్సిపాల్ భోజనం చేసి విశ్రాంతి తీసుకుంటున్నారు అని చెప్పడంతో పాటు నిర్లక్ష్యంగా సమాధానాలు ఇవ్వడం అక్కడ ఉన్న తల్లిదండ్రులను మరింత ఆవేదనకు గురి చేసిందిఈ పరిస్థితుల్లో అక్కడ ఉన్న తల్లిదండ్రులతో ఎంఈఓ కు ఫోన్లో మాట్లాడించాల్సిన పరిస్థితి ఏర్పడింది ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ హాస్టల్లో

ఈ విధమైన వ్యవహారం ఏమాత్రం సమంజసం కాదుకాబట్టి ఈ సంఘటనపై సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై మరియు నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నాము

## సింహవాహనంపై యోగనారాయణ స్వరూపంలో భక్తులను కటాక్షించిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరుడు



- ధైర్యం, పరాక్రమం, ధర్మరక్షణకు ప్రతీకగా దివ్య వాహనసేవ

**తిరుపతి జూన్ 27 మనం న్యూస్:** అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయంశ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామివారు యోగనారాయణ స్వామి అలంకారంలో సింహవాహనంపై భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ ఆలయ మాడవీధుల్లో జరిగిన వాహనసేవ భక్తిరసాన్ని పంచింది.ఉదయం 8 గంటలకుప్రారంభమైనవాహనసేవలో భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి గోవింద నామస్మరణల మధ్య స్వామివారిని దర్శించుకుని పులకించిపోయారు. సాయంత్రం 5 గంటలకు స్వామివారు ఊంజల్ మండపానికి వేంచేపు చేయగా, అనంతరం ఊంజల్ సేవ వైభవంగా నిర్వహించారు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ ధర్మాన్ని చాటిచెప్పే స్వామివారు సింహవాహనాన్ని అధిష్ఠిస్తారు. సింహం పరాక్రమం, ధైర్యం, తేజస్సు, నాయకత్వం, విజయస్ఫూర్తికి ప్రతీక. సింహదర్శనం ద్వారా భక్తుల్లో ఆత్మవిశ్వాసం, పట్టుదల, ధర్మనిష్ఠ పెంపొందుతాయని ఆధ్యాత్మిక గ్రంథాలు వివరిస్తున్నాయి. అజ్ఞానాన్ని తొలగించి ధర్మమార్గంలో నడిపించే దైవసందేశాన్ని ఈ సింహవాహనోత్సవం ద్వారా స్వామివారు.ప్రసాదిస్తున్నారని విశ్వసిస్తారు. ముత్యపు పందిరి వాహనంపై స్వామివారు మరోసారి భక్తులకు దివ్య దర్శనమిచ్చి ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, అర్చకులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

## బిసి కాలనీ రోడ్డు సమస్యకు ముగింపు పలకాలి

'జేసీ నూరల్ క్వామర్ ను కోరిన బీజేపీ నేత తుగ్గలి నవీన్ రెడ్డి

**తుగ్గలి, జూన్ 27 (మనం న్యూస్ ):** తుగ్గలి మండలంలోని బీసీ కాలనీలో మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని బీజేపీ పత్తికొండ నియోజకవర్గ నాయకుడు తుగ్గలి నవీన్ రెడ్డి జాయింట్ కలెక్టర్ నూర్ ఖమర్ను కోరారు. శనివారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమంలో బీసీ కాలనీ ప్రజలతో కలిసి పాల్గొన్న నవీన్ రెడ్డి, కాలనీలో రహదారి లేకపోవడం వల్ల సుమారు 300 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వివరించారు. వర్షాకాలంలో రాకపోకలు పూర్తిగా స్తంభించి, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడం, మహిళలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు బయటకు రావడం కూడా కష్టంగా మారుతోందన్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్ వంటి సేవలు కూడా కాలనీలోకి చేరలేని పరిస్థితి నెలకొన్నట్లు తెలిపారు. ప్రజల సమస్యను సానుభూతితో పరిశీలించి వెంటనే రోడ్డు నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న బీసీ కాలనీ ప్రజలకు ఈసారి శాశ్వత న్యాయం జరిగేలా చూడాలని కోరారు. దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ నూర్ ఖమర్ సంబంధిత అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ కాలనీ ప్రజలు, స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## జూలై 5న చలో విజయవాడ విజయవంతం చేయండి

**కర్నూలు జూన్ 27మనం న్యూస్ :** వచ్చే నెల5.6 చలో విజయవాడ విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ నీటి అభ్యర్థుల మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ నాయకులు పిలుపునిచ్చింది ఈ సందర్భంగా పేరెంట్స్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ మెడికోస్ చదువుతున్న విద్యార్థులకు సీర్లు అధికంగా పెంచాలని అదేవిధంగా తెలంగాణ మాధురి ఆంధ్రప్రదేశ్లో మెడిసిన్ సీట్లు పెంచాలని జులై 5 6న విజయవాడ చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చేయాలని అసోసియేషన్ నాయకులు తెలిపారు ఆంధ్రప్రదేశ్లో మెడికల్ సీట్ పెంచాలని గత ఎన్నో ఏళ్ళుగా పోరాటం చేస్తున్నామన్నారు జులై 5 6న. శాంతియుత ధర్నాకు విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కావాలన్నారు

# మరో పేపర్ లీక్ ఘటన..
## మహా 'టెట్' పరీక్ష వాయిదా



**ముంబయి, జూన్ 27:** నీట్ పేపర్ లీక్‌పై రాజకీయ వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో మరో పేపర్ లీక్ ఘటన వెలుగులోకి వచ్చింది. మహారాష్ట్రలో టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ ప్రశ్నపత్రం ఠాణెలో లీక్ అయ్యింది. దీంతో ఆదివారం జరగాల్సిన 'టెట్' పరీక్ష వాయిదా వేసినట్లు మహారాష్ట్ర స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎగ్జామినేషన్ వెల్లడించింది. ఠాణెలోని పలువురు అభ్యర్థులకు ఈ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాలు అందాయనే ఆరోపణల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

స్వాధీనం చేసుకున్న మెటీరియల్ అసలైన టెట్ ప్రశ్నపత్రమా? లేదంటే మాక్ టెస్ట్ పేపరా? అనే అంశంపై విద్యాశాఖ దర్యాప్తు చేస్తోందన్నారు. ప్రాథమిక విచారణ పూర్తయిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మరోవైపు, పరీక్షకు ముందే ప్రశ్నపత్రం ఎలా బయటకు వచ్చిందనే విషయంపై విద్యాశాఖ విచారణ చేపట్టింది. భీవండి ప్రాంతంలో పేపర్ లీక్ అయినట్లు అందిన రహస్య సమాచారం ఆధారంగా.. పోలీసులు పలుచోట్ల సోదాలు నిర్వహించగా ఈ విషయం వెలుగులోకి వచ్చినట్లు ఎగ్జామినేషన్ కౌన్సిల్ వెల్లడించింది.

అనుమానితుల వద్ద ఉన్న పేపర్లలోని ప్రశ్నలు గతేడాది టెట్ పరీక్ష కోసం తయారు చేసిన ప్రశ్నాపత్రంతో సరిపోలినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని ఎగ్జామినేషన్ కౌన్సిల్ పేర్కొంది. దీంతో భీవండి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపింది.

# ప్రాణం తీసిన రూ.500 గడియారం..
## 30 ఏళ్ల కేసు సుప్రీంలో పరిష్కారం



**ఢిల్లీ, జూన్ 27:** ఇరుగు పొరుగు వ్యక్తుల మధ్య రూ.500 విలువైన చేతి గడియారం విషయమై తలెత్తిన వివాదం దాదాపు మూడు దశాబ్దాలకు సర్వోన్నత న్యాయస్థానంలో పరిష్కారమైంది. ఉద్దేశపూరితం కాని హత్య (ఐపీసీ సెక్షన్ 304) నిబంధన ప్రకారం దోషిపై కొనసాగుతున్న నేర విచారణ ప్రక్రియకు జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ అరుణ్ పల్లి ధర్మాసనం ముగింపునిచ్చింది. ముగ్గురు దోషుల్లో ఇద్దరు విచారణ క్రమంలో మరణించడం, ఇంకో వ్యక్తి వయసు 60ఏళ్లకు మించడంతో ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. పదం సింగ్ అనే వ్యక్తి 1997లో ఓ చేతి గడియారాన్ని పొరుగునున్న మనువాకు రూ.500లకు విక్రయించాడు. గడియారం తనకు నచ్చలేదని తిరిగివ్వబోగా వివాదం తలెత్తింది. వాగ్వాద సమయంలో మనువా తన ఇద్దరు మిత్రులతో (రాము, మధు) కలిసి పదంసింగ్ను నెట్టివేయడంతో కాల్వలో పడిపోయిన అతను తీవ్ర గాయాలతో మృతి చెందాడు. దేహ్రాదూన్ కోర్టు 2002లో ముగ్గురినీ దోషులుగా తేల్చి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. 2012లో ఉత్తరాఖండ్ హైకోర్టు ఈ శిక్షను సమర్థించగా దానిని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. మనువా, రాము మృతి చెందగా మధు జీవించి ఉన్నాడు. ఇప్పటికే ఏడాదిన్నర కాలం జైలు శిక్ష అనుభవించి ఉండడం, 60ఏళ్ల వయసు దాటిపోవడాన్ని పరిగణనలోకి తీసుకుంటూ మధుపై విచారణ ప్రక్రియను నిలిపివేస్తూ సుప్రీం ధర్మాసనం నిర్ణయం తీసుకుంది.

**70 ఏళ్లు.. నాలుగు తరాలు..**

సుదీర్ఘ భూవివాదాన్ని ముగించిన సుప్రీంకోర్టు

ఓ భూమి కొనుగోలు విషయంలో దాదాపు ఏడు దశాబ్దాలుగా కొనసాగుతున్న వివాదానికి సుప్రీం కోర్టు ముగింపు పలికింది. 1957లో చేసుకున్న ఓ సేల్ డీడ్‌ను సమర్థిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. అయితే, ఈ కేసు తీర్పు వెలువరించిన న్యాయమూర్తులు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఎన్‌వీ అంజారియాలు జన్మించక ముందు నాటి వివాదం కావడం గమనార్హం. ఉత్తరాఖండ్ హరిద్వార్‌లోని నర్సీపుర్ కలాన్ గ్రామంలో 15.5 బిఘాల భూమిని సరాఫత్ అలీ అనే వ్యక్తి పూర్వీకులు 1957 జూన్‌లో సేల్‌డీడ్ ద్వారా కొనుగోలు చేశారు. అప్పటినుంచి తమ స్వాధీనంలోనే ఉందనేది వారి వాదన. 1980ల్లో ఓసారి మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకోగా రెవెన్యూ అధికారులు అందుకు అంగీకరించారు. కానీ, 1991లో భూముల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ సమయంలో రికార్డుల్లో యజమానులుగా అమ్మిన వారి పేర్లే కనిపించాయి. దీంతో బాధితులు పై అధికారులకు ఫిర్యాదు చేశారు.అయితే, నాటి భూచట్టానికి అనుగుణంగా కొనుగోలు జరగలేదని, సాక్షి వివరాల్లో వ్యత్యాసాలు ఉన్నాయని చెబుతూ మ్యుటేషన్‌ను తిరస్కరించారు. 1957నాటి సేల్ డీడ్ చెల్లదన్నారు. దీంతో బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం కూడా అధికారుల నిర్ణయాన్ని సమర్థించడంతో ఈ వ్యవహారం సుప్రీం కోర్టుకు చేరింది. విచారించిన సుప్రీం ధర్మాసనం సాక్షాల్లో చిన్న వ్యత్యాసాల ఆధారంగా సేల్‌డీడ్‌ను కొట్టివేయడం సరైంది కాదని పేర్కొంది. ఈ సందర్భంగా 1957లో చట్టబద్ధంగా రిజిస్టరైన డీడ్‌ను సమర్థిస్తూ కొనుగోలుదారులకు అనుకూలంగా తీర్పు వెలువరించింది. అయితే, కేసు విచారణ క్రమంలోనే సరాఫత్ చనిపోగా అతడి చట్టబద్ధ వారసులు ఈ కేసుపై సుప్రీం కోర్టులో న్యాయపోరాటం చేశారు. దీంతో నాలుగు తరాలుగా కొనసాగిన ఈ వివాదం పరిష్కారమైనట్లైంది.

**ఇల్లు అప్పగింత ఆలస్యమైతే..**
**పరిహారం కోరవచ్చు: సుప్రీం**

ఫ్లాట్ కొనుగోలు చేసిన తర్వాత కూడా ఆలస్యానికి పరిహారం కోరే హక్కు కొనుగోలుదారులకు ఉంటుందని సుప్రీం కోర్టు వెల్లడించింది. ఇల్లు కొన్న తర్వాత.. రియల్ ఎస్టేట్ కంపెనీల వైఫల్యానికి వ్యతిరేకంగా ఫిర్యాదు చేసే హక్కు ఉండదని భావించడం సరికాదని పేర్కొంది. ఈ మేరకు నేషనల్ కన్స్యూమర్ డిస్ప్యూట్ రీడ్రెసల్ కమిషన్ ఇచ్చిన 2016 నాటి ఉత్తర్వులను పక్కనబెట్టింది. దిల్లీలోని ఓ కోఆపరేటివ్ గ్రూప్ హౌసింగ్ సొసైటీలో 2003లో సభ్యుడిగా చేరి.. ఫ్లాట్ కొనుగోలు చేసిన వ్యక్తి దాఖలు చేసిన అప్పీ్పు విచారణ జరిపిన జస్టిస్ విక్రమ్ నాథ్ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఫ్లాట్ స్వాధీనం విషయంలో ఎటువంటి అభ్యంతరం లేకుండానే దానిని తీసుకున్నందున.. ఫిర్యాదు దాఖలు చేసే సమయానికి సదరు వ్యక్తి 'వినియోగదారుడు' కాదనే జాతీయ కమిషన్ వాదనను సుప్రీం కోర్టు తప్పుబట్టింది. ఇరుపక్షాల మధ్య కుదిరిన ఒప్పందంలో మధ్యవర్తిత్వ నిబంధన ఉన్నంత మాత్రాన.. వినియోగదారుల ఫోరంలో అప్పీలుదారు దాఖలు చేసిన ఫిర్యాదును తిరస్కరించలేమని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఫిర్యాదు దాఖలు చేయడానికి ముందే ఇంటిని స్వాధీనం చేసుకున్నారనే కారణంతో పిటిషనర్ 'వినియోగదారు' హోదాను కోల్పోయారని భావించకూడదని జాతీయ కమిషన్ కు సూచించింది. వస్తువులలో లోపం లేదా సేవలలో లోపం గురించి ఫిర్యాదు చేయడానికి వినియోగదారులు 'వినియోగదారుల రక్షణ చట్టం (1986) వినియోగించుకోవాలని సుప్రీం కోర్టు సూచించింది. వినియోగదారులకు వేగవంతమైన పరిష్కారాన్ని అందించడమే లక్ష్యంగా ఈ చట్టాన్ని తీసుకువచ్చినట్లు తెలిపింది.

# డ్రగ్స్ కాదు.. అది మెడిసిన్
## వివాదంలో తమిళనాడు మంత్రి



**చెన్నై, జూన్ 27:** తమిళనాడు మానవవనరుల శాఖమంత్రి డి.శరత్ కుమార్ వివాదంలో చిక్కుకున్నారు. ఆయన వద్ద డ్రగ్స్ ఉన్నాయంటూ ఆరోపణలు వచ్చాయి. కొన్నేళ్ల క్రితం నాటి వీడియో వైరల్ కావడంతో ఈ విమర్శలు వ్యక్తంకాగా అది మెడిసిన్ అంటూ మంత్రి వివరణ ఇచ్చుకున్నారు.జ తొలిసారి ఎమ్మెల్యే అయిన శరత్ కుమార్‌కు టీవీకే ప్రభుత్వంలో మంత్రి పదవి దక్కింది. ఇప్పుడు ఆయనపై డ్రగ్స్ ఆరోపణలు వచ్చాయి. మొబైల్ ఫోన్ స్క్రీన్‌పై ఒక తెల్లని పదార్థాన్ని ఉంచి, ఏటీఎం కార్డుతో పొడి చేస్తున్నట్లుగా ఆ దృశ్యాల్లో కనిపించింది. ఆయన అప్పుడు ఐపీఎల్ మ్యాచ్ చూస్తున్నారు. పక్కనే రూ.500 నోటు కూడా ఉంది. తన సన్నిహితులకు మాత్రమే కనిపించేలా 'థగ్ లైఫ్' పేరుతో కొన్ని సంవత్సరాల క్రితం ఇన్‌స్టా స్టోరీలో దానిని షేర్ చేశారు. 'స్టార్ట్ రన్, స్టాప్ డ్రగ్' పేరిట మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా నిర్వహించిన మారథాన్లో సీఎం విజయ్ పాల్గొన్న రోజే ఈ వీడియో వెలుగులోకి రావడం గమనార్హం. దీంతో మంత్రి డ్రగ్స్ వాడారంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆయన రాజీనామా చేయాలంటూ పలువురు డిమాండ్ చేశారు. దీంతో శరత్ కుమార్ స్పందించారు. తన భార్య, చిన్న కుమార్తెతో కలిసి ఉన్న ఒక వీడియోను షేర్ చేసి, వివరణ ఇచ్చుకున్నారు. ''చెన్నైలోని చెపాక్ స్టేడియంలో రెండేళ్ల క్రితం ఐపీఎల్ మ్యాచ్కు హాజరయ్యాను. నా కుటుంబం, స్నేహితులతో కలిసి మ్యాచ్కు వెళ్లాను. అప్పుడు నా కుమార్తె వయసు ఏడాదిన్నర. ఆరోజు మా పాప కాస్త అనారోగ్యంగా ఉండటంతో.. లిక్విడ్లో కలిపి ఇచ్చేందుకు ట్యాబ్లెట్ను పౌడర్ చేశాను. డాక్టర్ సలహా మేరకే మేం అలా చేశాం. దురుద్దేశంతో అప్పటి వీడియోను ఇప్పుడు వైరల్ చేస్తున్నారు'' అని పేర్కొన్నారు. ''ముఖ్యమంత్రి విజయ్ మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ముందుకువెళ్తున్నారు. ఇప్పుడు తన మంత్రిపై వ్యక్తమవుతోన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఆయనపై లేదా..? ప్రజల్లో అనుమానాలను అలాగే వదిలేయకూడదు'' అని డీఎంకే అధికార ప్రతినిధి శరవణన్ అన్నాదురై ఎక్స్ వేదికగా వ్యాఖ్యలు చేశారు.

# హర్మూజ్‌లో మరో ట్యాంకర్‌పై క్షిపణి దాడి



**టెహ్రాన్, జూన్ 27:** అమెరికా-ఇరాన్‌ల ప్రతీకార దాడులతో హర్మూజ్‌లో మరోసారి ఉద్రిక్తతలు నెలకొంటున్నాయి. తాజాగా జలసంధిలో ప్రయాణిస్తున్న ఓ ట్యాంకర్‌ను క్షిపణి తాకినట్లు యూకే మిలిటరీ వెల్లడించింది. ఆ నౌకకు నష్టం వాటిల్లినప్పటికీ.. సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారని పేర్కొంది. అయితే ఆ క్షిపణిని ఎవరు ప్రయోగించారనే విషయంపై స్పష్టత రాలేదు. అమెరికా-ఇరాన్‌లు శాంతి ఒప్పందంపై సంతకాలు చేయడంతో హర్మూజ్‌లో ఇటీవల నౌకాయానం తిరిగి ప్రారంభమైంది. కొన్ని నెలలుగా అక్కడే నిలిచిపోయిన అనేక వాణిజ్య నౌకలు తమ ప్రయాణాన్ని మొదలుపెట్టాయి. ఈ క్రమంలోనే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ అమెరికా, ఇరాన్లు దాడులను మొదలుపెట్టాయి. డ్రోన్లు, క్షిపణి దాడులతో జలసంధిలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## పెళ్లయిన నెలకే..
# ఆలయ గుట్టపై నుంచి పడి యువతి మృతి



- కోతులకు అరటి పండ్లు పెడుతుండగా ఘటన

**చెన్నై, జూన్ 27:** పెళ్లయిన నెలకే ఆలయ గుట్టపై నుంచి పడి యువతి మృతి చెందిన ఘటన తమిళనాడులోని తూత్తుకుడి జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దక్షిణ తిట్టంకులం ప్రాంతానికి చెందిన అనిత (24)కు.. గత నెలలో సురేశ్ అనే వ్యక్తితో వివాహం జరిగింది. పెళ్లి అనంతరం ఉద్యోగం నిమిత్తం విదేశాలకు వెళ్లిన భర్త ఇటీవల ఇంటికి తిరిగి వచ్చారు. శనివారం తెల్లవారుజామున దంపతులు కజుగుమలైలోని ఓ ఆలయానికి వెళ్లారు.

పూజ అనంతరం కొండపై ఉన్న కోతులకు అనిత అరటి పండ్లు పెడుతుండగా.. ఆ గుంపు ఒక్కసారిగా ఆమెను చుట్టుముట్టింది. భయాందోళనకు గురైన యువతి అక్కడి నుంచి పరుగెత్తుతుండగా.. ప్రమాదవశాత్తు కొండపై నుంచి కిందపడింది. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించింది. కట్టుకున్న భార్య కళ్లెదుటే ప్రాణాలు కోల్పోవడంతో ఆమె భర్త షాక్కు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

# శిథిలాల కింద 50,000 మంది?

- వెనెజువెలాలో కొనసాగుతున్న సహాయక చర్యలు
- 920కి పెరిగిన భూకంప మృతుల సంఖ్య
- 3,360 మందికి గాయాలు
- ఆత్మీయుల జాడ కోసం అనేక మంది అన్వేషణ
- ఆపరేషన్ అమిస్టాడ్ భారత్ ఆపన్నహస్తం





**కారకస్, జూన్ 27:** జంట భూకంపాల దెబ్బకు కుదేలైన వెనెజువెలాలో పరిస్థితులు అత్యంత దయనీయంగా మారాయి. అనేక భవనాలు కూలిపోవడంతో రాజధాని కారకస్ నగరం, లాగువేరా రాష్ట్రం సహా పలు ప్రాంతాలు శిథిలాల దిబ్బలుగా కనిపిస్తున్నాయి. ఈ లాటిన్ అమెరికా దేశంలో బుధవారం సాయంత్రం సంభవించిన భూకంపాల తీవ్రతకు ఇప్పటివరకూ 920 మంది మృతి చెందినట్లు నిర్ధారణ కాగా.. 3,360 మంది గాయపడ్డారు. దాదాపు మరో 50 వేల మంది జాడ ఇంకా తెలియరాలేదు. వారంతా శిథిలాల కింద చిక్కుకొని ఉండొచ్చని భయాందోళన వ్యక్తమవుతోంది. తమ కుటుంబ సభ్యులు, ఆత్మీయుల కోసం అనేక మంది అవిశ్రాంతంగా అన్వేషిస్తున్నారు. వారు ప్రాణాలతో బయటపడాలని ప్రార్థిస్తున్నారు. వెనెజువెలాలో సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల నుంచి బృందాలు తరలివచ్చాయి. భారత్ కూడా 'ఆపరేషన్ అమిస్టాడ్' పేరుతో ఆ దేశానికి రెండు వాయుసేన విమానాల్లో సహాయక సామగ్రితో పాటు వైద్యబృందాన్ని పంపింది.

**పార్కుల్లోనే బిక్కుబిక్కుమంటూ..**

వెనెజువెలాలో జంట భూకంపాల తీవ్రతకు 67.6 లక్షల మంది ప్రభావితమయ్యారని, ఒక్క కారకస్లోనే ఈ సంఖ్య 20 లక్షల వరకూ ఉందని అంతర్జాతీయ వలసల సంస్థ తెలిపింది. శిథిలాల కింద ఇప్పటికీ చాలామంది చిక్కుకొని ఉండటంతో.. మరణాల సంఖ్య మరింత పెరిగే ముప్పుందని స్థానిక అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. గాయపడ్డ అనేక మందికి ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. పలు నగరాల్లో శిథిలాల కింద మృతదేహాలు నలిగి, రక్తసిక్తమై ఉండటంతో పరిస్థితి భీతావహంగా కనిపించింది. చాలామంది తమ ఆత్మీయుల పేర్లు రాసి ఉన్న ప్లకార్డులను పట్టుకొని.. వారి జాడ కోసం రోదిస్తూ అన్వేషించారు. వందల మంది గురువారం రాత్రి కూడా పార్కుల్లోనే బిక్కుబిక్కుమంటూ గడిపారు. పిల్లలను కోల్పోయిన తల్లులు గుండెలవిసేలా రోదించారు. నష్ట తీవ్రత లా గువేరా రాష్ట్రంలో అత్యధికంగా ఉంది. జంట భూకంపాల ధాటికి దేశవ్యాప్తంగా దాదాపు 250 బహుళ అంతస్తుల భవనాలు నేలమట్టమైనట్లు వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ తెలిపారు. గల్లంతైనవారి వివరాలను సేకరించేందుకు ఏర్పాటుచేసిన ప్రత్యేక వెబ్సైట్లో ఇప్పటిదాకా దాదాపు 50 వేలమంది పేర్లు నమోదయినట్లు సమాచారం.

**ప్రపంచ దేశాల బాసట**

వెనెజువెలాను ఆదుకునేందుకు 150 మిలియన్ డాలర్ల విలువైన సహాయక సామగ్రిని అందిస్తామని అమెరికా ప్రకటించింది. ఆ సామగ్రిని తరలించేందుకు రెండు యుద్ధనౌకలతో పాటు రవాణా విమానాలు, హెలికాప్టర్లను సిద్ధం చేసింది. స్పెయిన్, జర్మనీ, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, నెదర్లాండ్, మెక్సికో, బ్రెజిల్ తదితర దేశాలు కూడా సహాయక సిబ్బంది, వైద్య సిబ్బంది, మానవతా సాయం అందించేందుకు సిద్ధమయ్యాయి.

ఆపరేషన్ అమిస్టాడ్‌లో భాగంగా వెనెజువెలాకు భారత్.. సైన్యానికి చెందిన ఫీల్ హాస్పిటల్ యూనిట్, 35 టన్నులకు పైగా సహాయక సామగ్రి, మందులు, వైద్య పరికరాలను వాయుసేనకు చెందిన రెండు సి-17 గ్లోబ్‌మాస్టర్ విమానాల్లో తరలించింది.

# సీఎం గారూ 12 శాఖలు మీ వద్దేనా?



- చిక్కుల్లో పడతారు జాగ్రత్త!
- కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్

**ఉజ్జయిని, జూన్ 27 :** తన వద్ద 12 శాఖలను పెట్టుకుని మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ చాలా పెద్ద తప్పు చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ వ్యాఖ్యానించారు. ఏదో ఒకరోజు అధికారులు ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ఆయనే ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు.

భూ కొనుగోలు విషయంపై ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో మాజీ సీఎం ఇలా స్పందించారు. 'మోహన్ యాదవ్ జీ.. మీ వద్దే 12 శాఖలు పెట్టుకున్నారు. మీరు చాలా పెద్ద పొరపాటు చేస్తున్నారు. ఇబ్బందుల్లో పడతారు. ఏ ఒక్క అధికారి తప్పు చేసినా, అక్రమాలకు పాల్పడినా.. చివరికి మీరే చిక్కుల్లో పడతారు. నేను మధ్యప్రదేశ్‌కు పదేళ్లపాటు ముఖ్యమంత్రిగా సేవలందించా.

నాపై ఒక్క ఆరోపణ కూడా రాలేదు. ఎందుకంటే ఏ ఒక్క శాఖ కూడా నావద్ద పెట్టుకోలేదు. గతంలో శివరాజ్ సింగ్ చౌహాన్ హయాంలో నా ఫైల్స్ అన్నీ పరిశీలించినా.. నాకు వ్యతిరేకంగా ఏమీ దొరకలేదు. కావాలంటే ఇప్పుడు మీరు నాపై విచారణ చేయించండి. భూ కుంభకోణంలో ఏయే కంపెనీల ప్రయేయం ఉందో నేనూ అధ్యయనం చేస్తున్నా.

మమ్మల్ని కొనుగోలు చేస్తామని అనుకోవద్దు. మేం అమ్ముడు పోవడానికి సిద్ధంగా లేం. ఎవరెవరైతే అమ్ముడు పోయారో వాళ్లు ఇప్పటికే భాజపాలో చేరారు. న్యాయం కోసం పోరాటం చేసేందుకు కాంగ్రెస్ నాయకులందరం సిద్ధంగా ఉన్నాం' అని దిగ్విజయ్ సింగ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం నిర్వర్తిస్తున్న శాఖలపైనా దిగ్విజయ్ విమర్శలు గుప్పించారు. హోం, జైళ్లు, ప్రజా సంబంధాలు, నర్మదా వ్యాలీ డెవలప్‌మెంట్, ఏవియేషన్ సహా మొత్తంగా 12 శాఖలను ముఖ్యమంత్రి వద్దే ఉంచుకోవడం పెద్ద తప్పిదమేనన్నారు. భవిష్యత్తులో ఆయనకు చిక్కులు తప్పవని హెచ్చరించారు.

# కళలు, సంస్కృతితో వ్యక్తిత్వ వికాసం
## తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్



**హైదరాబాద్, జూన్ 27(మనం,ప్రత్యేక ప్రతినిధి):** ప్రొబేషనరీ డీఎస్పీలు,ట్రైనీ ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్లు శిక్షణతో పాటు కళలు, సంస్కృతి, వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమని పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ అన్నారు. తెలంగాణ పోలీస్ అకాడమీలోని రాణి రుద్రమదేవి ఆడిటోరియంలో శనివారం ప్రొబేషనరీ డీఎస్పీలు, ట్రైనీ ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్లు సంయుక్తంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ట్రైనీల ప్రతిభను అభినందించారు. ఈ సందర్భంగా ట్రైనీలు క్లాసికల్ నృత్యాలు, జానపద (ఫోక్) నృత్యాలు, గర్బా, బోనాల నృత్య ప్రదర్శనలు, దుర్యోధనుని మోనోలాగ్, గ్రూప్ డ్యాన్సులు తదితర ఆకట్టుకునే ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. ప్రతి ప్రదర్శనలోనూ ట్రైనీల ప్రతిభ, క్రమశిక్షణ, కళాత్మక నైపుణ్యం ప్రతిబింబించి ప్రేక్షకుల నుంచి విశేష ప్రశంసలు అందుకుంది.ఆట, పాట, నృత్యాలు, మోనోలాగ్లతో సాగిన ఈ సాంస్కృతిక కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.ఈ కార్యక్రమానికి ఇండక్షన్ ట్రైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ చేతన్, ఐపీఎస్, కోర్స్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి, ఔట్‌డోర్ అసిస్టెంట్ డైరెక్టర్ యార్లగడ్డ రాంబాబు, డీఎస్పీల కల్చరల్ కమిటీ నేతృత్వంలో నిర్వహించారు. ఇన్‌ఛార్జ్ డీఎస్పీ ఆదూరి శ్రీనివాసరావు మార్గదర్శకత్వంలో, ఔట్‌డోర్ డీఎస్పీ కృష్ణ సహకారం అందించారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీలు నిశాంత్, శ్రీకాంత్ వ్యాఖ్యాతలుగా వ్యవహరించి తమ చక్కటి వ్యాఖ్యానంతో సభికులను ఆకట్టుకున్నారు.

# 14వేల విష గుళికల పంపిణీకి పన్నాగం



- భారీ కుట్ర భగ్నం

**ముంబయి, జూన్ 27:** ముంబయిలో అతిపెద్ద కుట్రను పోలీసులు భగ్నం చేశారు. మొహర్రం ఊరేగింపు సందర్భంగా ఓ వ్యక్తి ప్రజలకు విష గుళికలు పంపిణీ చేయడానికి ప్రయత్నిస్తుండగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద ఎలుకల మందు కలిపిన 14,900 క్యాప్సూల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) జయంత్ మీనా తెలిపిన వివరాల ప్రకారం.. మొహర్రం ఊరేగింపులో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడని, అక్కడి ప్రజలకు క్యాప్సూల్స్ పంచి పెడుతున్నట్టుగా సమాచారం అందింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడు గుళికలు పంచుతుండగా అదుపులోకి తీసుకున్నారు.మొహర్రం ఊరేగింపును లక్ష్యంగా చేసుకొని ఈ కుట్ర పన్నినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడిని పుణెకు చెందిన ఫయాజ్గా గుర్తించారు. కొన్ని రోజుల క్రితం అతడు 50కిలో గ్రాముల జింక్ ఫాస్ఫేడ్‌ను ఆర్డర్ చేసి.. ఒక్కో క్యాప్సూల్లో ఒక గ్రాము విషాన్ని నింపినట్లు తెలిపారు. అతడు గతేడాది ఇరాన్, ఇరాక్లకు వెళ్లి వచ్చినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. ఈ ఘటన వెనుక ఉగ్ర కుట్ర ఉండి ఉంటుందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. నిందితుడు ఇచ్చిన గుళికను మింగడం వల్ల ఓ వ్యక్తి అనారోగ్యానికి గురయ్యాడని.. ప్రస్తుతం అతడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

## జిల్లా కేంద్రంలో పోలీసుల విస్తృత తనిఖీలు



సూర్యాపేట, జూన్ 27 (మనం ప్రతినిధి): మాదకద్రవ్యాల నిర్మూలన తనిఖీలు.. తనిఖీల్లో పాల్గొన్న యాంటీ నార్కోటిక్ డాగ్ రోలెక్స్..డ్రగ్స్, గంజాయి లాంటి మాదక ద్రవ్యాల నిరోధించడం లో భాగంగా జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు శనివారం సూర్యాపేట పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో యాంటి నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సిబ్బంది విద్యా నగర్, 60 ఫీట్ల రోడ్, బస్టాండ్ ప్రాంతాల్లో ఉన్న టీ దుకాణాలు, పాన్ షాప్స్, హోటల్స్, లాడ్జిలో, హాస్టల్స్, పాఠశాలల నందు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ఇన్స్పెక్టర్ ఒక ప్రకటనలో తెలుపుతూ... రెండు తెలుగు రాష్ట్రాలని కలుపుతూ ప్రధాన జాతీయ రహదారిపై రవాణా పరంగా ముఖ్య కేంద్రంగా ఉన్న సూర్యాపేట పట్టణంలో మెరుగైన భద్రత కల్పించడం, డ్రగ్స్, గంజాయి లాంటి మాదకద్రవ్యాలు, నిషేధిత పదార్థాల అక్రమ రవాణా నిరోధించడం, కొత్త వ్యక్తుల కదలికలు గుర్తించడం లో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించామని చెప్పుకొచ్చారు. గంజాయి డ్రగ్స్ లాంటి పదార్థాలు అక్రమ రవాణా జరగకుండా తనిఖీలు చేశామన్నారు. మాదకద్రవ్యాలు గుర్తించే డాగ్ నార్కోటిక్ డాగ్ రోలెక్స్ తనిఖీల్లో పాల్గొని పాన్ డబ్బాలు, టి దుకాణాలు, అనుమానిత వస్తువులు, తనిఖీ చేయడం జరిగిందని వెల్లడించారు.

## సమాజ సేవే లక్ష్యంగాలయన్స్ క్లబ్



- లయన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం
- లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ గోలి అమరేందర్ రెడ్డి

నేరేడుచర్ల జూన్ 27 మనం న్యూస్: నేటి సమాజంలో సేవే లక్ష్యంగా అనేక కార్యక్రమాలు లయన్స్ క్లబ్ ద్వారా నిర్వహిస్తున్నదని లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ గోలి అమరేందర్ రెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నేరేడుచర్ల 2026-27 సంవత్సర నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా మాజీ గవర్నర్, మోటివేటర్, మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ లయన్ గోలి అమరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ సభ్యత్వమే మన గౌరవాన్ని, సేవాభావాన్ని సమాజంలో మరింత పెంచుతుందని అన్నారు.లయన్స్ క్లబ్ నేరేడుచర్ల 2026-27 కు గాను నూతన అధ్యక్షులుగా షేక్ యూసుఫ్, కార్యదర్శిగా సరికొప్పుల నాగేశ్వరరావు, కోశాధికారిగా బదావత్ సైదులు నాయక్ ప్రమాణ స్వీకారం చేశారు. ఉపాధ్యక్షులుగా నీలా శ్రీనివాస్, చిత్రం విశ్వనాథ్, మూలగుండ్ల వెంకటరెడ్డి, బసవ కోటేశ్వరరావు, తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్పర్సన్ కామా వెంకటేశం, రీజినల్ చైర్పర్సన్ ఏచూరి భాగ్యలక్ష్మి, చార్టర్ ప్రెసిడెంట్ కొంతం సీతారామరెడ్డి, డిస్ట్రిక్ట్ చైర్పర్సన్లు బట్టు మధు, చల్లా ప్రభాకర్ రెడ్డి, ఎడవెల్లి సత్యనారాయణ రెడ్డి, చార్టర్ సభ్యులు రాచకొండ రామ్మోహన్ రావు, రాచకొండ అంజయ్య, బాల వెంకటేశ్వర్లు, పూర్వ అధ్యక్షులు కందిబండ శ్రీనివాసరావు, జిలకర రామస్వామి గుండా సత్యనారాయణ లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటీ సమాజ సేవకు అంకితభావంతో పనిచేస్తూ క్లబ్బు మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ప్రతిజ్ఞ చేశారు.

# ప్రభుత్వం పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందాలి




సూర్యాపేట, జూన్ 27 (మనం ప్రతినిధి): ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారునికి అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రాష్ట్ర అగ్రికల్చర్ కోఆపరేటివ్ సెక్రటరీ, మార్కెటింగ్ డైరెక్టర్ ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక సూర్యాపేట జిల్లా ప్రత్యేక అధికారి కె సురేంద్రమోహన్ అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం పై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి , సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారునికి అందుతున్నది, లేనిది తెలుసుకోవడంతోపాటు, అలాగే వివిధ పథకాల అమలులో ప్రజలకు అవగాహన కల్పించి సమస్యలను తెలుసుకునేందుకు 99 రోజులపాటు ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని వివరించారు. ప్రభుత్వ పథకాల ఫలితాలు లబ్ధిదారులకు అందాలంటే అన్ని పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని, అప్పుడే లబ్ధిదారులకు సరైన విధంగా లబ్ధి చేకూరుతుందన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్యం తదితర రంగాలలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించడం, లబ్ధిదారుల నుండి సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయడం, ప్రభుత్వ పథకాల పై ప్రజలకు అవగాహన కల్పించడం వంటివి అధికారులు చేయాల్సిన అవసరం ఉందన్నారు ఎక్కడైతే ప్రజలకు విద్య, వైద్యం సక్రమంగా అందుతుందో అక్కడ పేదరికం ఉండదని స్పష్టం చేశారు.సూర్యాపేట జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు క్రమ పద్ధతిలో విజయవంతంగా నిర్వహించడం పట్ల ఆయన జిల్లా కలెక్టర్ తో పాటు, అధికారులందరినీ అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే ఒరవడిని కొనసాగించాలని, ఎట్టి పరిస్థితులలో లబ్ధిదారున్ని మర్చిపోకూడదని చెప్పారు. అందుబాటులో ఉన్న వనరులతో ప్రజలకు మేలు చేసేందుకు కృషి చేయాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఆయా శాఖల అధికారులు రొటీన్ పనుల పై కాకుండా అదే పనిని ఇతర ప్రాంతాలలో ఎలా చేస్తున్నారో అధ్యయనం చేసుకొని సాధ్యమైనంత ఎక్కువ లాభాన్ని ప్రజలకు చేకూర్చేందుకు కృషి చేయాలని, ఇందుకుగాను వినూత్నంగా ఆలోచన చేయాలని తెలిపారు. ఇందుకు సమర్థవంతమైన షెడ్యూల్ ను, ప్రణాళికను రూపొందించుకోవాలని, అప్పుడే ఆశాజనక ఫలితాలు వస్తాయని చెప్పారు.పథకాల అమలులో వివిధ శాఖలు సమ్మిళితంతో అమలు చేయాలని సూచించారు.అనంతరం ఆయన విద్య , వైద్యం ఆరోగ్యం, సంక్షేమ కార్యక్రమాలు అమలులో జిల్లాలో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికలో చేపట్టిన కార్యక్రమాలను అభినందిస్తూ ప్రపంచంలో ఎక్కడ చేయని విధంగా తెలంగాణ ప్రభుత్వం 99 రోజుల ప్రజాపాలన - ప్రణాళిక అనే గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిందని, నిధులు లేకున్నప్పటికీ జిల్లాలో సమర్థవంతమైన కార్యక్రమాలను నిర్వహించారని అన్నారు. అధికారులు ఆర్థిక విషయాలు పట్ల పూర్తి అప్రమత్తంగా ఉంటూ పథకాలను అమలు చేయాలని , ప్రభుత్వం ఏ ఉద్దేశంతో అయితే ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందో ఈ కార్యక్రమం సూర్యాపేట జిల్లాలో వందకు వంద శాతం విజయవంతం అవ్వడం చాలా సంతోషంగా ఉందని, ఇదే విధంగా ముందు ముందు జిల్లాలో ఏ కార్యక్రమాన్ని పెట్టినా అందరూ సమిష్టిగా కలిసి విజయవంతం చేయుటకు కృషి చేయాలని ఆకాంక్షించారు. రైతులకు వ్యవసాయ శాఖ యాప్ ల మీద అవగాహన కల్పించాలని, ప్రజలు అనారోగ్య బారిన పడకుండా రైతులు ఆర్గానిక్ పంటలు పండించే విధంగా వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు అవగాహన కల్పించాలని, వ్యవసాయ అధికారులు భూసార పరీక్షలు చేసి రైతులు ఏ విత్తనాలు, ఏ ఎరువులు వాడితే లాభంగా ఉంటుందో అవగాహన కల్పించాలని, రైతు వేదికలలో రైతులకు సన్న వడ్ల సీడ్, ఫెర్టిలైజర్స్ అందించాలని, దీనికి నోడల్ ఆఫీసర్ గా అదనపు కలెక్టర్ ఉంటారని, రైతులకు ఆయిల్ ఫామ్ సాగు పై అవగాహన కల్పించి జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు ప్రోత్సహించాలని, అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులకు సూచించారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన సమాచారం, యూరియా యాప్, సందేహాల నివృత్తి కోసం టోల్ ఫ్రీ నెంబర్ 18001237157 ద్వారా తెలుసుకోవచ్చు అన్నారు. అదే విధంగా సంక్షేమ హాస్టల్స్ లో సంక్షేమ అధికారులు వారానికి ఒక సారి సందర్శించి బడ్జెట్ మీద ఆధారపడకుండా మానవతా దృక్పథంతో ఫ్యాన్లు రిపేర్ చేయించడం, చెప్పులు లేని విద్యార్థులకు చెప్పులు కొనివ్వాలని సంక్షేమ అధికారులకు వెల్లడించారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా సూర్యాపేట జిల్లాలో 99 రోజులపాటు ఆయా అంశాల వారిగా చేపట్టిన కార్యక్రమాలను ప్రత్యేక అధికారికి వివరించారు.ఆయా శాఖలకు సంబంధించి చేపట్టిన కార్యక్రమాలను జిల్లా శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రత్యేక అధికారికి వివరించారు. సమావేశానికి ముందు జిల్లా కలెక్టర్ కార్యాలయం చేరుకున్న ప్రత్యేక అధికారి కి జిల్లా కలెక్టర్ తో పాటు, జిల్లా ఎస్పీ కె నరసింహ ఇతర అధికారులు పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం పై ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను ప్రత్యేక అధికారి తిలకించి చాలా బాగా చేశారని అభినందించారు.

చివరిగా జిల్లా కలెక్టర్ ప్రత్యేక అధికారిని సత్కరించి తమరు సూచించిన ఆదేశాలు జిల్లాలో తప్పకుండా అమలు చేస్తామని, ముందు ముందు ప్రభుత్వం ఏ కార్యక్రమాలు ప్రవేశపెట్టినా విజయవంతం చేయడం జరుగుతుందని, తమరి ఆదేశాలు తప్పకుండా అమలు చేస్తామని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ బి హరి సింగ్, జెడ్పి సీఈవో శిరీష, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, డి ఆర్ డి ఏ సన్యాసయ్య , డి ఇ ఓ అశోక్, సిపిఓ కిషన్ నాయక్, డి ఏ ఓ శ్రీధర్ రెడ్డి, జిల్లా అధికారులు ఈ సమీక్ష సమావేశానికి హాజరయ్యారు.

## క్రమ పద్ధతిలో రైతులు ఎరువులు పొందాలి



సూర్యాపేట, జూన్ 27 (మనం ప్రతినిధి): సూర్యాపేట రూరల్ పరిధిలోని కేసారం గ్రామ రైతు వేదికలో శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతుల కోసం విత్తన మేళా ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ గోపి ముఖ్య అతిథిగా హాజరై రైతులను ఉద్దేశించి పలు ముఖ్యమైన సూచనలు చేశారు.ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. వానాకాలం-2026 సీజన్లో వ్యవసాయ శాఖ ఏడు రకాల సన్న వరి రకాలను ప్రోత్సహిస్తోందని ఆ రకాలను సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రత్యేక బోనస్ అందజేస్తుందని తెలిపారు. అందువల్ల రైతులందరూ సన్న రకాల విత్తనాలను సాగు చేసి ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.రైతుల సౌకర్యార్థం మండల పరిధిలోని రైతు వేదికల్లో విత్తనాల పంపిణీ ఈ నెల30వ తేదీ వరకు కొనసాగుతుందని, అవసరమైన రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అదేవిధంగా, ఎరువుల పంపిణీ పూర్తిగా పారదర్శకంగా జరిగేలా రైతులు ఫర్టిలైజర్ యాప్ ద్వారా యూరియాను తీసుకోవాలని స్పష్టం చేశారు. అందరూ ఒకేసారి దుకాణాలకు రాకుండా క్రమపద్ధతిలో ఎరువులు పొందాలని, తద్వారా రద్దీ తగ్గడంతో పాటు ప్రభుత్వ సబ్సిడీ యూరియా పక్కదారి పట్టకుండా నియంత్రించవచ్చని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ, రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా భూసారాన్ని కాపాడడంతో పాటు తక్కువ వ్యయంతో అధిక లాభాలు పొందవచ్చని వివరించారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు మండలంలోని అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## సీఎం నల్గొండ జిల్లా రాక ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

- ఏర్పాట్లన్నివెంటనే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



నల్లగొండ, జూన్ 27( మనం ప్రతినిధి ): నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ ,జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ లు మరోసారి ఏర్పాట్లను పర్యవేక్షించారు. శనివారం వీరు రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరుకానున్న కనగల్, నల్గొండ ఎన్ .జి. కళాశాల బహిరంగ సభ సంబంధించి కు ఏర్పాట్లను పరిశీలించారు. కనగల్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి 13006 కోట్ల రూపాయల వ్యయంతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించనున్న హ్యాం రోడ్లకు శంకుస్థాపన పైలాన్ ను ఆవిష్కరించనున్నారు. అక్కడ నుండి నల్గొండ చేరుకొని నల్గొండ నాగార్జున కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ సందర్భంగా బహిరంగ సభ వద్ద వేదిక ఏర్పాట్లను, అక్కడే నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కు సంబంధించి చేపట్టనున్న తాగునీటి ప్రాజెక్టు శంకుస్థాపన శిలా ఫలకం, సీటింగ్ ,బ్యారికేడ్లు, విఐపి, మహిళలు, ఇతరుల గ్యాలరీలన్నింటిని పరిశీలించారు.ఎన్ జి కళాశాల గ్రౌండ్లో అన్ని ఏర్పాట్లను శనివారం సాయంత్రం లోపు పూర్తి చేయాలని, బహిరంగ సభకు వచ్చే అందరి కోసం తాగునీరు, టాయిలెట్లు, ఎండ తగలకుండా టెంట్ తో పాటు ,వర్షం వచ్చిన తట్టుకునేలా ఏర్పాట్లు అన్నింటిని పూర్తి చేయాలని చెప్పారు . జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నల్గొండ టౌన్ పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించడం జరుగుతుందని, తిప్పర్తి తదితర ప్రాంతాల నుండి వచ్చే వాహనాలు పానగల్ రోడ్ మీదుగా, అలాగే దేవరకొండ వైపు నుండి వచ్చే వాహనాలను నల్గొండ రూరల్ పోలీస్ స్టేషన్ వెనుక వైపునుండి, మర్రిగూడా బైపాస్ నుండి వచ్చే వాహనాలను ఎన్జీ కళాశాల వద్ద యూటర్న్ తీసుకుని ప్రజలను దించి వెళ్లేలాగా సవివరంగా మ్యాప్ తయారు చేయడం జరిగిందని, ట్రాఫిక్ రిస్ట్రిక్షన్ ఉంటుందని, ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఇదే విషయమై జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో మరోసారి సమావేశమై ఏర్పాట్లను క్షుణ్ణంగా సమీక్షించారు. ఏర్పాట్లలోఎక్కడ జాప్యం లేకుండా, నిర్లక్ష్యం వహించకుండా ఆయా శాఖల అధికారులు వారి ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అదనపు ఎస్పి రమేష్, రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జెడ్పి సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, డి.ఎఫ్ఓ రాజశేఖర్, డిఆర్ఓ దశరథ్, ట్రైనింగ్ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి ,స్థానిక సంస్థల ఇంచార్జ్ ఆప్యానపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు ఉన్నారు.

# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్




నల్లగొండ, జూన్ 27 (మనం ప్రతినిధి ): అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని నల్గొండ పట్టణంలో మహిళా శిశు వికలాంగుల వయోవృద్ధుల శాఖ జిల్లా పోలీసు శాఖ సంయుక్తంగా ప్రజల్లో మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించేందుకు ఎన్.జి. కళాశాల నుండి క్లాక్ టవర్ వరకు 2 కిలోమీటర్ల రన్ నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్ సంయుక్తంగా జెండా ఊపి ప్రారంభించి, విద్యార్థులు, యువత, పోలీసు అధికారులు మరియు ప్రజలతో కలిసి రన్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును, కుటుంబాలను సమాజాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని అన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా ప్రతి విద్యార్థి తన జీవిత లక్ష్యాలపై దృష్టి సారించాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు ప్రభుత్వ శాఖలు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా సమాజ శాంతిభద్రతలకు కూడా ముప్పుగా మారుతుందని అన్నారు. యువత ఎలాంటి పరిస్థితుల్లోనూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పదంగా మాదకద్రవ్యాల విక్రయాలు లేదా అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు జిల్లా పోలీసు శాఖ మరియు మహిళా శిశు వికలాంగుల వయోవృద్ధుల శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని, ఈ విషయంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ 2కే రన్ ద్వారా యువతలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు, 'డ్రగ్ ఫ్రీ నల్గొండ - డ్రగ్ ఫ్రీ తెలంగాణ' లక్ష్యంతో సమాజంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, నల్గొండ డీఎస్పీ శివరాం రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారిని కేవీ కృష్ణవేణి ఫీల్ రెస్పాన్స్ ఆఫీసర్ మునగాల,నాగిరెడ్డి నవీన్ సునీల్ సీఐ నాగరాజు, ఎస్ఐలు సైదా బాబు, శివ ప్రసాద్, పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అక్రమ కేసులను తొలగించుకుంటే ఉద్యమిస్తాం



సూర్యాపేట, జూన్ 27(మనంన్యూస్): ఎస్ఎఫ్ఐ.పిడిఎస్ యు. పి ఎస్ యు. జన సేవా సమితి, బీసీ సంఘము విద్యార్థి సంఘాల నాయకుల పై త్రివేణి ప్రయివేట్ పాఠశాల యాజమాన్యం పెట్టిన అక్రమ కేసులను బేషరతుగా వెనక్కి తీసుకోవాలి తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతల మధు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆ సంఘ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా స్టేషనరీ అమ్ముతున్న ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల పై విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి. కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థ లలో అధిక ఫీజులను నియంత్రించి నిర్లక్ష్య పూరితంగా విధులు నిర్వర్తిస్తున్న జిల్లా విద్యా అదికారిపై చర్యలు తీసుకోవాలి స్పష్టం చేశారు.జిల్లా విద్యా శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరి వలన, కొన్ని ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యలు యాదేచ్చగా విద్యా వ్యాపారం చేస్తున్నాయని, నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, టై, బెల్ట్ లను విక్రయిస్తున్నారని, విద్యా శాఖ అధికారులు నిమ్మకి నిరీట్టనట్లు ఉండటం తో, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఒక ప్రయివేట్ పాఠశాల లో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు అమ్ముతున్నారని ఆందోళన చేస్తుంటే, నిబంధనలను పాటించని పాఠశాల యాజమాన్యం పై, విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాల్సి పోయి, ఆందోళన చేస్తున్నా విద్యార్థి సంఘాల పై సదరు ప్రయివేట్ పాఠశాల యాజమాన్యం కుట్ర పూరిత ఫిర్యాదు ని పరిగణలోకి తీసుకోని కేసు నమోదు చేసి, విద్యార్థి నాయకులను బైండోవర్ చేయడం సరికాదు అని అన్నారు.విధుల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్న డీఈఓ పై సమగ్ర విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలో ప్రభుత్వం ఫీజులను నియంత్రించాలని బేషరతుగా విద్యార్థి సంఘాల నాయకులపై పెట్టిన కేసులను త్రివేణి పాఠశాల యాజమాన్యం వెనక్కి తీసుకోవాలని లేకుంటే అన్ని విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా స్టేషనరి అమ్ముతున్న ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ యువజన సంఘము రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు, రాష్ట్ర ఉపాధ్యక్షులు భాషిపంగు సునీల్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనిగా సంతోష్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు పోరెళ్ల విప్లవ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ సురేష్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు దారావత్ శివ, చామకూరి మహేందర్, కొలిక పంగు వాసు పాల్గొన్నారు.

# జూన్ 29న వరంగల్‌లో బీజేపీ జాతీయ అధ్యక్షులు..గిరిజన మేధావులతో భేటీ

- 33 తెగల గిరిజన ప్రముఖులతో ముఖాముఖి
- రాష్ట్ర గిరిజన సమస్యలపై చర్చ



హన్మకొండ , జూన్ 26: భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ ఈనెల 29న, సోమవారం వరంగల్ నగరంలో తెలంగాణ రాష్ట్రంలోని గిరిజన మేధావులతో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. ఈ విషయాన్ని బీజేపీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎంపీ సీతారాం నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హరిత కాకతీయలో కీలక సమావేశం: జూన్ 29 సోమవారం మధ్యాహ్నం వరంగల్లోని హరిత కాకతీయ హోటల్లో ఈ భేటీ జరగనుంది. రాష్ట్రంలోని 33 గిరిజన తెగలకు చెందిన సామాజిక మేధావులు, ప్రముఖులు, విద్యావంతులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. సమస్యలపై సుదీర్ఘ చర్చ: తెలంగాణ రాష్ట్రంలో గిరిజనులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, వారి అభివృద్ధి, సంక్షేమం, హక్కుల పరిరక్షణ వంటి కీలక అంశాలపై బీజేపీ జాతీయ అధ్యక్షులు గిరిజన మేధావులతో విస్తృతంగా చర్చించనున్నారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి, పోడు భూముల సమస్య, రిజర్వేషన్ల అమలు తదితర అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. కలిసి భోజనం: సమావేశం అనంతరం బీజేపీ జాతీయ అధ్యక్షులు గిరిజన మేధావులతో కలిసి మాటా మంతీ నిర్వహించి, వారితో కలిసి సహపంక్తి భోజనం చేయనున్నారు. దీనిద్వారా గిరిజన వర్గాలకు పార్టీ మరింత చేరువయ్యే ప్రయత్నం చేస్తోందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సీతారాం నాయక్ వెల్లడి: ఈ భేటీకి సంబంధించిన ఏర్పాట్లను పార్టీ రాష్ట్ర నాయకులు మాజీ ఎంపీ సీతారాం నాయక్ పర్యవేక్షిస్తున్నారు. 'గిరిజనుల ఆకాంక్షలకు అనుగుణంగా బీజేపీ పని చేస్తుంది. వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడానికే జాతీయ అధ్యక్షుల వారు ఈ భేటీ ఏర్పాటు చేశారు' అని సీతారాం నాయక్ తెలిపారు. గిరిజన ఓటు బ్యాంకుపై దృష్టి సారించిన బీజేపీ, రానున్న రోజుల్లో గిరిజన ప్రాంతాల్లో పార్టీని బలోపేతం చేసే దిశగా ఈ భేటీ కీలకం కానుంది.

## బీఎల్ఓలకు పూర్తి సమాచారం అందించాలి



మహాదేవపూర్ జూన్ 27మనం న్యూస్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో సూరారం గ్రామంలోఓటరు జాబితా పరిశుద్ధత, ప్రజాస్వామ్య వ్యవస్థబలోపేతానికి ప్రతిపౌరుడుతనవంతు బాధ్యతనిర్వర్తించాలని కాంగ్రెస్ పార్టీ సూరారం గ్రామశాఖ అధ్యక్షులు చల్ల రమేష్ రెడ్డి పిలుపునిచ్చారు.ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రజలుసద్వినియోగంచేసుకొనిబూత్ స్థాయిఅధికారులకుబీఎల్ఓలుపూర్తి సమాచారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ, గ్రామాలో బీఎల్ఓల ఇంటింటికివెళ్లి ఎన్యూమరేషన్ఫారాలుపంపిణీచేస్తూ ఓటర్లవివరాలను సేకరిస్తున్నారనితెలిపారు. ప్రతి కుటుంబంతమవివరాలను సక్రమంగా నమోదు చేసి ఎన్నికల సిబ్బందికి సహకరించాలని సూచించారు. ఓటరు జాబితాలో పేర్లు ఉన్నాయో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని, ఏవైనా తప్పులు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఖచ్చితమైన ఓటరు జాబితా ఎన్నికలపారదర్శకతకు మూలస్తంభమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, మరణించినవారు లేదా ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారి వివరాలను కూడా అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ జగన్మోహన్ రెడ్డి రఘు తో పాటు పలువురు పాల్గొన్నారు

## చెరువులో మునిగి 11 ఏళ్ల బాలుడు మృతి

- కన్నీరుమున్నీరైన కన్నారావుపేట గ్రామం

నల్లబెల్లి, జూన్ 27, మనం న్యూస్: నల్లబెల్లి మండలం కన్నారావుపేట గ్రామంలో శనివారం విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సనుపు రమేష్ కుమారుడు సనుపు రోహిత్ (11), నాలుగో తరగతి చదువుతున్నాడు. మధ్యాహ్నం స్నేహితులతో కలిసి గ్రామంలోని ఈదుకులకుంట చెరువుకు ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈత రాకపోవడంతో చెరువులోని లోతు అంచనా వేయలేక ప్రమాదవశాత్తు నీటిలో మునిగి పోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు వెంటనే చెరువులో గాలించి బాలుడిని బయటకు తీసుకొచ్చినా, అప్పటికే అతడు మృతి చెందినట్లు గుర్తించారు. బాలుడి ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకోగా, గ్రామస్తులు కన్నీర ుమున్నీరయ్యారు. బాలుడి తండ్రి సనుపు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు నల్లబెల్లి ఎస్ఐ ఎం. సాయి ప్రసన్న కుమార్ తెలిపారు.




## రోడ్డుఅభివృద్ధి పనులు ప్రారంభం

భీమదేవరపల్లి, జూన్ 27 మనం న్యూస్: ఎర్రబెల్లి గ్రామంలో రోడ్డు అభివృద్ధి పనులు సర్పంచ్ కాలేరు శ్రావణ్ నిర్మించారు. శనివారం రోజున సిసి రోడ్డు అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వ పరిపాలనలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో గ్రామంలోని సిసి రోడ్ల అభివృద్ధి పనులను 20 లక్షల నిధులతో నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభించినందుకు గ్రామస్తులు మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ శోభ వార్డు సభ్యులు గ్రామస్తులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ములుగు జిల్లా రైస్ మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలి

### అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్ ఆధ్వర్యంలో మంత్రి సీతక్క కు వినతి



ములుగు, జూన్ 27, మనం ప్రతినిధిః ములుగు జిల్లాలోని రైస్ మిల్లర్లు సమస్యలతో సతమతం అవుతున్నామని, ప్రభుత్వం స్పందించి రైస్ మిల్లర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రైస్ మిల్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షులు బాదం ప్రవీణ్ కోరారు. ఈ మేరకు శనివారం రైస్ మిల్లర్ అసోసియేషన్ సభ్యులందరూ హైదరాబాదుకు చేరుకొని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ను కలసి తమ సమస్య లతో కూడిన వినతి పత్రాన్ని ఆమెకి అందజేశారు. దానికి స్పందించిన మంత్రి సీతక్క వెంటనే సివిల్ సప్లై కార్పొరేషన్ కమిషనర్ కి ఫోన్ చేసి మాట్లాడి రైస్ మిల్లర్ల సమస్య ను పరిష్కారం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్ మాట్లాడారు. ములుగు జిల్లాలో గత 2024- 25 రబీ సీజన్ లో 78 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రొక్యుర్మెంట్ జరిగిందని అన్నారు.ఈసారి అనూహ్యంగా దిగుబడి పెరిగి లక్ష 13వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రొక్యూర్మెంట్ చేయడం జరిగిందని, ఇట్టి ధాన్యం జిల్లాలో గోదాముల కొరత వలన ఆరుబయట ఓపెన్ స్పేస్ లో నిలువ చేయడం జరిగిందని తెలిపారు.అకాల వర్షాలకు ధాన్యం క్వాలిటీ దెబ్బతిని ఎఫ్సీఐలో బియ్యం పాస్ కావని అన్నారు.అధికారులు వెంటనే స్పందించి జిల్లాకు బాయిల్ బియ్యం ఎఫ్సీఐ కి పెట్టుటకు పర్మిషన్ ఇప్పించాలని కోరారు. అందులో భాగంగా మంత్రి సీతక్క ను కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు.అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి సివిల్ సప్లై కార్పొరేషన్ కమిషనర్ కి ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేసారని అన్నారు.అందుకు గాను ములుగు జిల్లా రైస్ మిల్లర్ల పక్షాన మంత్రి సీతక్క కు ఆయన ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమం లో కార్యదర్శి సహోదరు రెడ్డి కోశాధికారి ఎలగందుల మోహన్ గౌరవ అధ్యక్షులు పల్లెపాటి సంగిరెడ్డి గౌరవ సలహాదారులు రాణి శ్రవణ్ కుమార్ అనిల్ కుమార్ లు పాల్గొన్నారు.

## ములుగు సాగునీటి ప్రాజెక్టులకు వేగం



- రైతులకు న్యాయమైన పరిహారం
- మంత్రులు ఉత్తమ్, సీతక్క

ములుగు, జూన్ 27 మనం ప్రతినిధిః ములుగు జిల్లాలో పెండింగ్లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. రామప్ప-లక్నవరం గ్రావిటీ కెనాల్కు 2020-21 భూసేకరణ అవార్డును ఉపసంహరించి, ప్రస్తుత మార్కెట్ ధరల ఆధారంగా రైతులకు న్యాయమైన పరిహారం చెల్లిస్తూ కొత్త భూసేకరణ చేపట్టాలని సూచించారు. అలాగే పొట్లాపూర్ ప్రాజెక్టు పనులను వెంటనే ప్రారంభించి, వచ్చే వారంలో శంకుస్థాపన జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెండేళ్లలో రామప్ప-లక్నవరం గ్రావిటీ కెనాల్ పూర్తి చేసి 8,700 ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యమని మంత్రులు తెలిపారు.




## ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యం

### బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ ముఖ్య కార్యదర్శి బి. బాలా మాయా దేవి

వరంగల్, జూన్ 27(మనంన్యూస్)ః రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మార్చి 6 నుంచి జూన్ 12, 2026 వరకు గ్రామ, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని సమీక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించింది. ఈ నేపథ్యంలో వరంగల్ జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమితులైన బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ ముఖ్య కార్యదర్శి బి. బాలా మాయా దేవి, ఐఏఎస్ శనివారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఐఏఎస్ అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేసిన 10 థీమ్ లకు సంబంధించిన అంశాలపై ప్రత్యేకంగా రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంబంధిత శాఖల అధికారులు వివరాలను సమర్పించారు. వివిధ శాఖల వారీగా సాధించిన పురోగతి, లక్ష్యాల సాధన, ఎదురవుతున్న సమస్యలు, చేపట్టాల్సిన చర్యలపై జిల్లా ప్రత్యేక అధికారి సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేక అధికారి బి. బాలా మాయా దేవి మాట్లాడుతూ, ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక ఒక నిరంతర ప్రక్రియ అని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన లక్ష్యాలను సాధించినందుకు జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందించేందుకు జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేసి వరంగల్ జిల్లాను అభివృద్ధి లో ముందుకు తీసుకువెళ్లాలన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని, ప్రజలకు ప్రభుత్వ పథకాల ఫలాలు వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, జడ్పీ సీఈవో రాంరెడ్డి,ఆర్డీవోలు వరంగల్ సుమ,నర్సంపేట ఉమారాణి, మరియు సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పాముకాటుతో మరో ప్రాణం బలి

- 100 పడకల ఆసుపత్రిలో యాంటీ వెనమ్ లేదా?
- ఏటూరునాగారం ఆసుపత్రి నిర్లక్ష్యం
- వైద్యం అందక అమాయకుడి మృతి
- 30 మంది డాక్టర్లు కాగితాలపైనే:
- ముగ్గురితో నడిచే 100 పడకల దవాఖాన
- ములుగు వరంగల్కే సాగనంపుడు
- గిరిజన ప్రాంత ఆసుపత్రుల దుస్థితి బట్టబయలు
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోని ప్రభుత్వం:
- ఆదివాసుల ఆరోగ్యం ప్రశ్నార్థకం.



ఏటూర్ నాగారం, జూన్ 27, మనం ప్రతినిధి: ఏటూరు నాగారం చెప్పుకోవడానికి మాత్రమే 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి. కానీ పాము కరిస్తే వేయించడానికి కనీసం యాంటీ వెనమ్ ఇంజెక్షన్ లేదా? వైద్యుల నిర్లక్ష్యం, సిబ్బంది కొరతతో ఆదివాసు ప్రాంత ప్రజల ప్రాణాలు గాలిలో దీపాల్లా మారాయి. తాజాగా మరో అమాయకుడు ఈ వ్యవస్థకు బలైపోయాడు.

**ఘటన వివరాలు:**

కన్నాయి గూడెం మండలంలోని సింగారం గ్రామానికి చెందిన పల్ల రాంబాబు గురువారం మధ్యాహ్నం ఇంట్లో కుర్చీలో కూర్చొని ఉండగా నాగుపాము కాటు వేసింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా 108 అంబులెన్స్లో ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కానీ అక్కడికి వెళ్లాక నిజం తెలిసింది. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అని బోర్డులున్న ఆసుపత్రిలో పాముకాటు మందు అందుబాటులో లేదు. సరైన వైద్యం అందకపోవడంతో చికిత్స పొందుతూ రాంబాబు కన్నుమూసినట్లు గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ విషాద ఘటనతో సింగారం గ్రామమంతా శోకసంద్రంలో మునిగిపోయింది.

**కాగితాలపై 30 మంది, విధుల్లో ముగ్గురు:**

స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఏటూరునాగారం ఆసుపత్రిలో 30 మంది డాక్టర్లు ఉండాల్సి ఉంది. కానీ విధులకు హాజరయ్యేది ముగ్గురు నలుగురు మాత్రమేనని ఆరోపిస్తున్నారు. చిన్న జ్వరం వచ్చినా, చిన్న గాయమైనా వెంటనే ములుగు లేదా వరంగల్ తీసుకెళ్లండి అని డాక్టర్లు చేతులు దులుపుకుంటున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. 100 పడకల హంగామా ఉన్నా, కనీస ప్రాథమిక వైద్య సదుపాయాలు కూడా లేకపోవడంతో గిరిజనులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. పాముకాటు, ప్రసవం, ప్రమాదాలు వంటి అత్యవసర కేసుల్లో కూడా రోగులను 70-80 కిలోమీటర్ల దూరంలో ఉన్న వరంగల్కు రిఫర్ చేయడం పరిపాటిగా మారింది. ఆ లోపే చాలా మంది దారిలోనే ప్రాణాలు కోల్పోతున్నారు.

**ఇలాంటివి ఎన్నో... ఇప్పటికైనా స్పందించాలి**

రాంబాబు మృతి ఒక్కటే కాదు. వైద్యం అందక, రిఫర్ చేస్తూ ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఈ ప్రాంతంలో లెక్కలేనన్ని ఉన్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి, కాగితాలపై ఉన్న డాక్టర్లను విధుల్లోకి రప్పించాలని, ఆసుపత్రిలో అత్యవసర మందులు, పరికరాలు అందుబాటులో ఉంచాలని ఆదివాసి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రాణాలు పోయిన తర్వాత సంతాపం తెలిపి చేతులు దులుపుకోవడం కాదు, మారుమూల గిరిజన ప్రాంతాల్లో నాణ్యమైన వైద్యం అందించే బాధ్యతను ప్రభుత్వం నెరవేర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.

## సర్ సర్వేను విజయవంతం చేయాలి



- హుస్నాబాద్ కోఆర్డినేటర్ సౌజన్య గౌడ్

భీమదేవరపల్లి జూన్ 27 మనం న్యూస్: సర్ సర్వేను విజయవంతం చేయాలని హుస్నాబాద్ నియోజకవర్గ సర్ కోఆర్డినేటర్ సౌజన్య గౌడ్ కోరారు. శనివారం రోజున ముస్తఫా పూర్ గ్రామంలో ఎల్కతుర్తి మార్కెట్ వైస్ చైర్మన్ బొక్కల స్రవంతి ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సౌజన్య గౌడ్ హాజరై ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేలు అర్హత కలిగిన ప్రతి వ్యక్తి ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

పార్టీ శ్రేణులు బిఎల్వోలతో సమన్వయమై ఇంటింటికి పంపిణీ చేసిన ఎ న్యూమరేషన్ ఫారాలను పరిశీలించి నిర్ణీతగడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముస్తాపూర్ గ్రామ సర్పంచ్ గడ్డం సుజాత రఘుపతి రెడ్డి, మాజీ వైస్ఎంపీపీ ఏర్రా, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కుమారస్వామి, వార్డు సభ్యులు మాడుగుల సంపత్ , మంజుల తదితరులు పాల్గొన్నారు.

# నేడే పివి జయంతి



- స్వగ్రామంలో పీవీ అభిమానుల ఎదురుచూపు

జభీమదేవరపల్లి జూన్ 27 మనం న్యూస్: ప్రధాని పివి జయంతి కి స్వగ్రామ వంగరలో పీవీ అభిమానులు ఎదురుచూస్తున్నారు. పీవీ నివాసంలోసందడి కోలాహలం లేకపోవడం శబ్ద వాతావరణం కనిపించడం గమనహర్హం. జయంతి మహోత్సవానికి తన నివాసం ముందు పివి విగ్రహం మౌన మన్మధుడి గా కనిపిస్తుంది. పివి తెలంగాణలోని వరంగల్ జిల్లా లక్నేపల్లి గ్రామంలో 1921 జూన్ 28న జన్మించి వంగర స్వగ్రామంలో విద్యాభ్యాసం ప్రారంభించి హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ,నాగపూర్, ముంబై లో న్యాయ శాస్త్రం పూర్తి చేశారు. 17 భాషల్లో పట్టు సాధించి బహుభాషా మునిగా ప్రపంచ దేశాల్లో మేధావుల సరసన చేరారు. మాట తక్కువ పని ఎక్కువ చేసే వ్యక్తిగా మౌన మన్మధుడు అనే పేరుగాంచారు. స్వాతంత్ర ఉద్యమంలో చురుకుగా పాల్గొని రాజకీయ ప్రస్థానం ప్రారంభించి భూదాన ఉద్యమంలో పాల్గొన్న మహోన్నత వ్యక్తి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పని చేసి విద్యా రంగంలో సంస్కరణలు ప్రవేశపెట్టి, ఇందిరాగాంధీ ,రాజీవ్ గాంధీ ప్రభుత్వాలలో కేంద్ర మంత్రిగా రక్షణ విదేశీ హోం శాఖలను సమర్ధవంతంగా నిర్వహించారు. భారత దేశ ఆర్థిక సంస్కరణ ప్రవేశపెట్టి, స్వేచ్ఛ ఇచ్చి ప్రపంచంలో పోటీపడేలా చేశారు. భూస్వామ్య వ్యవస్థను దెబ్బతీసి, కౌలుదారులకు హక్కులు కల్పించి రక్షణ ఇచ్చారని దేశ ప్రజలు కొనియారుతారు. భారత దేశ ప్రజలే కాకుండా ప్రపంచ దేశ అధినేతలు గుర్తు చేసుకునే మహోన్నత వ్యక్తిగా కొనియాడడం గమనర్హం. పీవీస్వగ్రామ వంగరలో పీవీ అభిమానులు పివి జయంతిని కోసం ఎదురుచూడడం ఆనవాయితీగా మారింది.



# అసంపూర్తిగా పీవీ స్మృతి వనం

- ప్రారంభానికి నోచుకోని పివి ఫోటో గ్యాలరీ
- పివి అభిమానులకు నిరాశ మిగిలింది
- ముస్తాబుకు నోచుకోని పీవీ విగ్రహం



భీమదేవరపల్లి జూన్ 27 మనం న్యూస్: కెసిఆర్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గతంలో పీవీ శత జయంతి ఉత్సవాలలో భాగంగా పీవీ స్మృతి వనం ను ప్రభుత్వం ప్రారంభించిన అసంపూర్తిగా ఉండడం పివి అభిమానులను నిరాశపరిచారు. కోట్ల రూపాయల నిధులతో స్వగ్రామ వంగర లో పివి ఫోటో గ్యాలరీ, సైన్స్ మ్యూజియం, లైబ్రరీ, పర్యాటకులను ఆకర్షించేందుకు పనులు ప్రారంభించిన ఈ జయంతికి కూడా ప్రారంభోత్సవం కాకపోవడం పివి అభిమానులు ముక్కున వేలేసుకుంటున్నారు. పివి జయంతి సమీపిస్తుండగా పనులు హటావుటిన ప్రారంభించడం అధికారులకు ఆనవాయితీగా మారింది. పీవీ స్వగ్రామంలో విగ్రహం ముస్తాబు లేకపోవడం నిరాశగా మిగిలిపోయింది. హనుమకొండ నుండి సిద్దిపేటకు వెళ్లే ప్రధాన రహదారికి పీవీ స్వగ్రామం నుండి 100 ఫీట్ల రోడ్డును నిర్మించాలని నిధులు మంజూరు చేసిన పనులు ప్రారంభించకపోవడం గమనార్హం. అధికారులు, ప్రతినిధులు పీవీవర్ధంతికైనా పనులు పూర్తి చేసి పీవీకి గౌరవం ఏర్పరచాలని స్థానికులు పివి అభిమానులు కోరుకుంటున్నారు

## సర్ పత్రాలు అందించిన సర్పంచ్ మాచర్ల



భీమదేవరపల్లి జూన్ 27 మనం న్యూస్: భీమదేవరపల్లి లో ప్రత్యేక సమగ్ర వివరణ పత్రాల గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి అందజేశారు. శనివారం రోజున మండల కేంద్రంలో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సర్ పత్రాలను అందజేసి సర్పంచ్ మాచర్ల కుమారస్వామి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శనిగరం ఐలయ్య, వార్డు సభ్యులు ప్రేమలత,అశోక్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నోట్ బుక్‌లు పంపిణీ చేసిన దేవి భూమయ్య



మల్హర్, జూన్ 27 (మనం న్యూస్)ః మండలంలోని కొయ్యూరు పాఠశాలలో ఈ రోజు ఆర్ఎంపి డాక్టర్ దేవి భూమయ్య గారి ఆధ్వర్యంలో గ్రామ ఉపసర్పంచ్ లకావత్ సవేందర్ వార్డ్ మెంబర్స్ లకావత్ లక్ష్మీ-తిరుపతి , మందారపు రవళి-ప్రశాంత్, పంతకాని శశి విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు డొనేట్ చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఉపసర్పంచ్ల ఫోరమ్ అధ్యక్షులు లకావత్ సవేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే గ్రామస్తులు వాళ్ళపిల్లలని చేరిపించాలని ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య ఉచిత పుస్తకాలు ఉచిత యూనిఫామ్స్ లభిస్తున్నాయ్ ప్రభుత్వ సేవలను కొయ్యూరు గ్రామస్తులు సద్వినియోగం చేసుకోగలరని తెలుపడం జరిగినది

# ములుగు జిల్లాలో కాగితరహిత పాలనకు శ్రీకారం

- ఇకపై కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేదు
- కులం నుంచి డెత్ సర్టిఫికెట్ వరకు అన్నీ ఆన్లైన్లోనే
- డిజిటల్ తెలంగాణ దిశగా ములుగు
- అన్ని సర్టిఫికెట్లు ఇక మీ సేవలో
- ములుగు మీసేవ ఆపరేటర్లకు సదరం పోర్టల్ శిక్షణ, కమిషన్ పెంపుపై సన్మానం
- ఎక్కువ ఫీజు వసూలు చేస్తే కఠిన చర్యలు
- దరఖాస్తుదారులకు డిజిటల్ రసీదు తప్పనిసరి



ములుగు, జూన్ 27, మనం ప్రతినిధిః ప్రభుత్వం పౌర సేవలను పూర్తిగా డిజిటలైజ్ చేసే దిశగా మరో కీలక అడుగు వేసింది. ఇకపై ములుగు జిల్లాలో కులం, ఆదాయం, నివాసం, జన-మరణ, అగ్రికల్చరల్ మార్కెట్ వాల్యూ, గ్యాప్, కుటుంబ ధృవీకరణ పత్రాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేశారు. శనివారం ములుగు జిల్లా ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఈ మేరకు వివరాలు తెలిపారు. పారదర్శకత, వేగవంతమైన సేవలందించడమే లక్ష్యంగా గ్రామ పాలనాధికారులు ఎ్క_ మరియు రెవిన్యూ ఇన్స్పెక్టర్లు ఖఖ వినియోగించుకునేందుకు ప్రత్యేక మీసేవ మొబైల్ అనువర్తనాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని పేర్కొన్నారు.

**కాగితరహిత ప్రక్రియ, పూర్తి ఆన్లైన్ విధానం**

కొత్త విధానం ప్రకారం దరఖాస్తుల స్వీకరణ నుంచి చివరి ఆమోదం వరకు మొత్తం ప్రక్రియ ఆన్లైన్లోనే జరుగుతుంది. పౌరుడు మీసేవ కేంద్రం ద్వారా దరఖాస్తు చేసిన వెంటనే అది తొలుత సంబంధిత గ్రామ ఎ్క_ లాగిన్లోకి చేరుతుంది. ఎ్క_ విచారణ పూర్తి చేసిన తర్వాత ఫైల్ ఖఖ, అక్కడి నుంచి నేరుగా తహసీల్దార్ లాగిన్కు వెళ్తుందని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ వివరించారు. ఇప్పటివరకు ఆదాయం, కులం, నివాసం, కుటుంబ సభ్యుల ధృవీకరణ, లేట్ రిజిస్ట్రేషన్ బర్త్ డెత్, అగ్రికల్చరల్ మార్కెట్ వాల్యూ, గ్యాప్ సర్టిఫికెట్ వంటి కీలక సేవలను ఈ పోర్టల్ ద్వారా అందుబాటులోకి తెచ్చారు. దీంతో సేవలు సమయానికి అందడంతో పాటు పారదర్శకత గణనీయంగా పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**డిజిటల్ రసీదు, ఖఖ అలర్ట్ విధానం.**

ప్రజల సౌకర్యార్థం కొత్త విధానంలో కీలక మార్పు తీసుకువచ్చారు. దరఖాస్తు చేసిన వెంటనే దరఖాస్తుదారుడి రిజిస్టర్డ్ మొబైల్ నంబర్కు ఒక ఖఖ వస్తుంది. అందులో అప్లికేషన్ నంబర్, సర్వీస్ పేరు, చెల్లించిన ఫీజు వివరాలతో పాటు హైపర్లింక్ ఉంటుంది. ఆ లింక్ ద్వారా పౌరులు ఎప్పుడైనా రసీదును చూడవచ్చు, డౌన్లోడ్ చేసుకోవచ్చు లేదా ప్రింట్ తీసుకోవచ్చు. సర్టిఫికెట్ చేతికి వచ్చే వరకు ఈ ఖఖను భద్రంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు.

**మీసేవ కేంద్రాలకు కఠిన నిబంధనలు.**

మీసేవ కేంద్రాల నిర్వహణపై అధికారులు పలు సూచనలు చేశారు. ఉఖ్పి గైడ్లైన్స్ ప్రకారం కేంద్రాలను నడపాలని, ఆపరేటర్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రతి కేంద్రంలో తప్పనిసరిగా సిటిజన్ చార్టర్, భూభారతి ఫ్లెక్సీలు, మీసేవ లోగో, తహసీల్దార్, ఉ-్రుకమరియు పరిష్కారం కాల్ సెంటర్ నంబర్లు ప్రదర్శించాలని తెలిపారు. కళ్యాణలక్ష్మి, బర్త్, డెత్ సర్టిఫికెట్లను ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని, ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. నిర్ణీత రుసుము కంటే ఎక్కువ వసూలు చేసిన మీసేవ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ హెచ్చరించారు. తప్పుడు డాక్యుమెంట్లు అప్లోడ్ చేసినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

**సదరం పోర్టల్ శిక్షణ, ఆపరేటర్లకు సన్మానం**

ఇదే సందర్భంలో ములుగు జిల్లాలోని అన్ని మీసేవ కేంద్రాల ఆపరేటర్లకు సదరం ్ల ృఐ్ర పోర్ట్ల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మీసేవ ఆపరేటర్ల కమిషన్ పెంపునకు కృషి చేసినందుకు గాను ములుగు మీసేవ బృందం ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్, జిల్లా మేనేజర్లు విజయ్, రాకేష్లను శాలువాతో సత్కరించింది. ఈ కార్యక్రమంలో మీసేవ సహకారానికి తెలంగాణ ప్రభుత్వానికి, గౌరవ ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మరియు మీసేవ కమిషనర్ రవికిరణ్కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజర్లు, ములుగు జిల్లా మీసేవ ఆపరేటర్లు పాల్గొన్నారు.

# ‘ఏజ్ ఈజ్ జస్ట్ నంబర్’



మలయాళ మెగాస్టార్ మోహన్లాల్ మరోసారి డ్యాన్స్ మూవ్స్తో అభిమానులను ఆశ్చర్యపరిచారు. ‘ఏజ్ ఈజ్ జస్ట్ ఏ నంబర్’ అనేలా 65 ఏళ్ల వయసులోనూ స్టేజ్ పై ఉత్సాహంగా డ్యాన్స్ చేసి మెప్పించారు. ప్రస్తుతం ఆయన చేసిన డ్యాన్స్ వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్గా మారాయి.

జర్మనీలో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న మోహన్‌లాల్.. ప్రేక్షకుల కోసం పలు పాటలకు స్టెప్పులు వేశారు. ముఖ్యంగా దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కించిన ‘బాహుబలి: ది బిగినింగ్’ చిత్రంలోని సూపర్ హిట్ సాంగ్ ‘మనోహరి’కి ఆయన చేసిన డ్యాన్స్ హైలెట్ గా నిలిచింది. ఇద్దరు నటీమణులతో కలిసి స్టే డాన్స్ పర్ఫార్మెన్స్ చేశారు. ఒరిజినల్గా ఈ పాటలో ప్రభాస్ ముగ్గురు నటీమణులతో కలిసి కనిపించగా.. మోహన్లాల్ మాత్రం ఇద్దరు నటీమణులతో కలిసి తనదైన స్టైల్లో డ్యాన్స్ చేసి ఆకట్టుకున్నారు. బాహుబలి చిత్రంలోని కాస్ట్యూమ్స్‌ను గుర్తుకు తెచ్చేలా రూపొందించిన దుస్తుల్లో ఈ ప్రదర్శన మరింత ప్రత్యేకంగా నిలిచింది.



# ఆఖరి నిమిషంలో గోల్

ఫిఫా వరల్డ్ కప్‌లో ఇరాన్ నాకౌట్ బెర్తు కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. టోర్నీలో అడుగడుగునా అవాంతరాలు ఎదురవుతున్నా గొప్పగా ఆడిన ఆ జట్టు ఈజిప్ట్ తో మ్యాచ్ను 1-1తో డ్రా చేసుకోవమే అందుకు కారణం. చివరి నిమిషంలో ఇరాన్ ఆటగాడు ఖలిజదేహ్ గోల్ చేసినా వీడియో అసిస్టెంట్ రిఫరీ మాత్రం లెక్కలోకి తీసుకోకపోవడం ఈజిప్ట్ 32వ రౌండ్కు దూసుకెళ్లింది. దాంతో.. ఇరాన్ ఆటగాళ్లు నిరాశలో మునిగిపోయారు.గ్రూప్ జీలోని ఇరాన్, ఈజిప్ట్ నాకౌట్ బెర్తు లక్ష్యంగా హోరాహోరీగా తలపడ్డాయి. ఐదో నిమిషంలోనే మహమూద్ సబెర్()గోల్ అందించగా.. ఈజిప్ట్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. కాసేపటికి ఇరాన్కు పెనాల్టీ లభించినా సద్వినియోగం చేసుకోలేదు. ప్రత్యర్థి డిఫెన్స్ను ఛేదిస్తూ 14వ నిమిషంలో రమిన్ రజీయన్ గోల్తో ఇరాన్ 1-1తో స్కోర్ సమం చేసింది. ఆ తర్వాత ఇరజట్ల ఆటగాళ్లు తీవ్రంగా ప్రయత్నించారు.ఇక మ్యాచ్ డ్రా ఖాయమనుకున్న వేళ.. 93వ నిమిషంలో నిమిషంలో ఆట ముగుస్తుందనగా.. ఇరాన్ ప్లేయర్ ఖలిజదేహ్ ఈజిప్ట్ గోల్పోస్ట్లోకి బంతిని పంపాడు. 2-1తో ఆసియా జట్టు గెలిచిందనుకుంటే.. బంతి ఆఫ్ సైడ్ వెళ్లిందని వీడియో అసిస్టెంట్ రిఫరీ గోల్ ఇవ్వలేదు. దాంతో, 1-1తో మ్యాచ్ డ్రాగా ముగియడంతో ఈజిప్ట్ నాకౌట్లో అడుగుపెట్టింది. గ్రూప్ జీ నుంచి బెల్జియం, ఈజిప్ట్ 32వ రౌండ్కు చేరగా.. మూడో స్థానంతో ఇరాన్ నాకౌట్ చేరే అవకాశముంది.

## పరిస్థితులను త్వరగా అర్థం చేసుకోలేకపోయాం: అభిషేక్ శర్మ



టీ20 ప్రపంచ కప్ తర్వాత తొలిసారి పొట్టి ఫార్మాట్లో ద్వైపాక్షిక సిరీస్ను భారత్ ఆడుతోంది. తొలి మ్యాచ్లోనే టీమ్ఇండియాకు ఓటమి తప్పలేదు. అదీనూ ఐర్లాండ్ వంటి జట్టు చేతిలో పరాజయం చవిచూసింది. అయితే.. పరిస్థితులకు త్వరగా అలవాటు పడకపోవడం వల్లే తాము ఓడినట్లు టీమ్ఇండియా ఓపెనర్ అభిషేక్ శర్మ వ్యాఖ్యానించాడు. ఐర్లాం్ప 49 పరుగులు చేసిన అభిషేక్ శర్మనే భారత్ తరపున టాప్ స్కోరర్. ‘‘పిచ్ పరిస్థితులకు ఎంత త్వరగా అలవాటు పడుతున్నామనేదే చాలా కీలకం. ప్రస్తుత కాలంలో వరుసగా మ్యాచ్లు ఆడుతున్నాం. ప్రాక్టీస్ సెషన్లు దొరికినప్పుడు లేదా పరిస్థితులకు అలవాటు పడే అవకాశం ఉన్నప్పుడు జట్టుగా ముందుకు వచ్చి వాటికి అనుగుణంగా త్వరగా మారాలి. బలమైన జట్టుగా మేం పరిస్థితులకు త్వరగా సర్దుకుపోవాలి. కానీ, ఐర్లాండ్తో తొలి మ్యాచ్లో అది సాధ్యపడలేదు’’ అని అభిషేక్ తెలిపాడు.

# తీర ప్రాంత సాట్టపులి



తమిళ నటుడు సూరి, సుహాస్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం ‘మండాడి’. స్పోరట్స్ యాక్షన్ డ్రామాగా మతిమారన్ దీన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా పోస్టర్లు సినీ ప్రియుల్ని ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి సుహాస్ పాత్రకు సంబంధించిన మేకింగ్ వీడియోను విడుదల చేసింది చిత్రబృందం. ఇందులో సుహాస్ సాట్టపులిగా శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నట్లు సినీ వర్గాలు తెలిపాయి. తీరప్రాంతం, మత్స్యకారుల నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో మహిమా నంబియార్, సత్యరాజ్ తదితరులు నటిస్తున్నారు. సెప్టెంబరు 4న రానుందీ చిత్రం.

## ఇరుముడి: ఫస్ట్ సింగిల్ సాంగ్
# ఎప్పుడంటే..?




మాస్ మహారాజా రవితేజ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రం ‘ఇరుముడి’ ఇప్పటికే ప్రేక్షకుల్లో సాలిడ్ బజ్ క్రియేట్ చేసింది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమాతో రవితేజ బాక్సాఫీస్ దగ్గర సాలిడ్ హిట్ అందుకోవడం ఖాయమని ఫ్యాన్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ సినిమాను భక్తి మరియు ఎమోషన్స్ కలబోతగా తెరకెక్కిస్తున్నారు. కాగా ఈ చిత్రానికి సంబంధించి ఓ సాలిడ్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్.

ఈ సినిమా ఫస్ట్ సింగిల్ సాంగ్ ‘ఇరుముడి కట్టు’ను జూన్ 29వ తేదీన ఉదయం 11:07 గంటలకు విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ పాట సినిమాపై అంచనాలను మరింత పెంచేలా ఉంటుందని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు జి.వి.ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, ఆయన ఈ సినిమా పాటలపై అభిమానుల్లో అంచనాలు రెట్టింపు చేస్తున్నారు.ఇక ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, టీ-సిరీస్ సంస్థలు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నాయి.

ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్గా నటిస్తోంది. సీనియర్ నటుడు సాయి కుమార్, బేబీ నక్షత్ర కీలక పాత్రల్లో నటిస్తుండగా ఈ చిత్రాన్ని 2026, ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయడానికి మేకర్స్ రెడీ అవుతున్నారు.

# అన్నింటినీ మార్చేసే.. ఆ ఒక్క నిజం



‘‘ఇది మన దేశంలో ఇంటింట జరిగే కథ. దీనిని వినడం చాలా అవసరం. అంతే కాదు ఈ విషం వ్యాపించకుండా మనం అడ్డుకోవాలి’’ అంటోంది కథానాయిక కాజల్. మరి ఆమె ఇంత ప్రత్యేకంగా చూడమని చెప్తున్న ఆ కథేంటో తెలుసుకోవాలంటే ‘ది ఇండియా స్టోరీ’ చూడాల్సిందే. కాజల్, శ్రేయాస్ తల్పడే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. చెట్టన్ డీకే దర్శకత్వం వహిస్తున్నారు. వచ్చే నెల 24న రానుందీ సినిమా. ఈ నేపథ్యంలోనే మరో టీజర్ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం.

‘‘ఒక నిజం అన్నింటినీ మార్చేస్తుంది’’ అనే వ్యాఖ్యను జోడించింది. ‘రైతులు ఉపయోగించే పురుగు మందులు, వాటిని అమ్ముతున్న కంపెనీలు... ఆ కంపెనీకి అనుమతి ఇచ్చిన ప్రభుత్వం కూడా నేరం చేసినట్లే’ లాంటి సంభాషణలతో సాగుతున్న ఈ వీడియోలో న్యాయవాదిగా కనిపిస్తూ ఆకట్టుకుంటోంది కాజల్. రోజూ ఎన్నో కుటుంబాలను ప్రభావితం చేస్తున్న కల్తీ ఆహార సమస్య చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుంది. ఈ చిత్రాన్ని సాగర్ బి శిందే నిర్మిస్తున్నారు.

# ‘బాహుబలి 3’.. వచ్చేస్తున్నా..

**తెలుగు సినిమా ఖ్యాతిని మరోసారి ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పిన బాహుబలి పరంపర కొనసాగనుంది. అగ్ర దర్శకుడు రాజమౌళి సృష్టించిన మాహిష్మతి ప్రపంచం మున్ముందూ ప్రేక్షకుల్ని రక్తికట్టించనుంది. ఇప్పటికే ‘బాహుబలి: ది బిగినింగ్’, ‘బాహుబలి: ది కన్క్లూజన్’ అంటూ రెండు భాగాలుగా వచ్చిన ఆ చిత్రాలు భాష, ప్రాంతంతో సంబంధం లేకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల్ని అలరించాయి. త్వరలోనే మూడో భాగానికి సిద్ధం కావాలంటూ సంకేతాలు ఇచ్చారు ఆ సినిమాల్లో నటించిన తారలు ప్రభాస్, రానా దగ్గుబాటి, అనుష్క. ‘బాహుబలి: ది బిగినింగ్’ ప్రేక్షకుల ముందుకొచ్చి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆ సినిమా నిర్మాణం వెనక సంగతులతో కూడిన డాక్యుమెంటరీ నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదలైంది. ఆ డాక్యుమెంటరీ ప్రారంభానికి ముందు నటీనటులు, సాంకేతిక బృందం ఈ సినిమా ప్రయాణం వెనక అనుభవాల్ని పంచుకుంది. అందులో భాగంగానే ఈ సినిమాకి మూడో భాగం రానుందంటూ సంకేతాలిచ్చారు ప్రభాస్, రానా, అనుష్క. ఈ విషయం బాహుబలి అభిమానుల్ని ఎంతగానో సంతోషపెట్టింది. గతంలో కూడా ఈ కథా ప్రపంచం కొనసాగుతుందని దర్శకుడు రాజమౌళి తెలిపారు. మరోవైపు ఫ్రాన్స్లో జరుగుతున్న ఆన్సీ ఇంటర్నేషనల్ యానిమేషన్ ఫిల్మ్ ఫెస్టివల్ – 2026లో అగ్ర దర్శకుడు రాజమౌళి పాల్గొని సందడి చేశారు. ‘బాహుబలి’ ప్రపంచంతో ముడిపడిన ‘బాహుబలి: ది ఎటర్నల్ వార్’ యానిమేషన్ సిరీస్ ప్రాముఖ్యతతోపాటు ఆ కథా ప్రపంచం విస్తరణ గురించి మాట్లాడారు. ‘‘భారతీయ పురాణాల నుంచి గణనీయంగా ప్రేరణ పొందింది ‘బాహుబలి’ కథ. భారతీయ పౌరాణిక కథలు ఎంతో విస్తారమైనవి. అందులో పాత్రలు ఎంతో స్పష్టంగా, కళ్లకు కట్టినట్టుగా ఉంటాయి’’ అన్నారు. అమరేంద్ర బాహుబలి పాత్రని భారతీయ పురాణాల్లోని 14 లోకాలతో ముడిపెడుతూ ‘బాహుబలి: ది ఎటర్నల్ వార్’ యానిమేషన్ సిరీస్ని దర్శకుడు ఇషాన్శుక్లా రూపొందిస్తున్నారని, ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల్ని దృష్టిలో ఉంచుకుని అగ్రశ్రేణి యానిమేషన్ స్టూడియోలు, నిపుణులు ఈ సిరీస్ని సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు రాజమౌళి.**



# కింగ్ ఆఫ్ స్క్రీన్ ప్లే ఇక లేరు



చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రముఖ సీనియర్ తమిళ నటుడు, స్టార్ డైరెక్టర్ కె.భాగ్యరాజ్ (73) శనివారం ఉదయం చెన్నైలో కన్నుమూశారు. ఇంట్లో ఉన్న సమయంలో ఆయనకు అకస్మాత్తుగా తీవ్ర గుండెపోటు రావడంతో, కుటుంబ సభ్యులు హుటాహుటిన చెన్నైలోని అపోలో ఆసుపత్రికి తరలించారు. అయితే, అక్కడ అత్యవసర చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచినట్లు డాక్టర్లు తెలిపారు. తమిళ సినిమా ఇండస్ట్రీలో ‘కింగ్ ఆఫ్ స్క్రీన్ ప్లే’గా గుర్తింపు పొందిన భాగ్యరాజ్.. దాదాపు ఐదు దశాబ్దాల సినీ ప్రస్థానంలో 75కు పైగా సినిమాల్లో నటుడిగా, 25కు పైగా చిత్రాలకు దర్శకుడిగా వ్యవహరించారు.

తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకులకు కూడా భాగ్యరాజ్ సుపరిచితులే. తెలుగులో సూపర్ హిట్ అయిన ’మేం వయసుకు వచ్చాం’ చిత్రంలో హీరో తండ్రిగా ఆయన అద్భుత నటనను ప్రదర్శించారు. వీటితో పాటు ’అవునా’, ’రెడ్ అలర్ట్’, ’సీత’, ఇటీవల విడుదలైన ధనుష్-శేఖర్ కమ్ముల చిత్రం ’కుబేర’ తదితర చిత్రాల్లో కీలక పాత్రలు పోషించారు. భాగ్యరాజ్ అకాల మృతి పట్ల టాలీవుడ్, కోలీవుడ్ సినీ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

## హీరోల రెమ్యూనరేషన్ పై దిల్ రాజు ఇంట్రెస్టింగ్ కామెంట్స్..!



టాలీవుడ్ స్టార్ హీరోల పారితోషికాలు పెరగడం వల్ల సినిమాల బడ్జెట్లు భారీగా ఎక్కువవుతున్నాయి. దీనిపై నిర్మాత దిల్ రాజు తాజాగా కొన్ని ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. రూ.300 కోట్ల బడ్జెట్ సినిమాలో 35-40 శాతం కేవలం హీరో రెమ్యునరేషన్కే సరిపోతుందని ఆయన అన్నారు. తమ ఇమేజ్ దెబ్బతింటుందనే భయంతో టాప్ హీరోలు పారితోషికాలు తగ్గించుకోవడం లేదని ఆయన తెలిపారు.ఈ క్రమంలో బాలీవుడ్ హీరోల పనితీరును ఆయన ఉదాహరణగా చెప్పారు. అక్కడ స్టార్స్ అందరూ ముందస్తు రెమ్యూనరేషన్ కాకుండా ‘ప్రాఫిట్ షేరింగ్’ (లాభాల్లో వాటా) పద్ధతిని పాటిస్తున్నారని, మన టాలీవుడ్లో కూడా ఈ విధానం రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా అక్షయ్ కుమార్ ఒకప్పుడు రూ.130 కోట్లు తీసుకునేవారని, కానీ మార్కెట్ పరిస్థితుల వల్ల ఇప్పుడు ఆయన కూడా లాభాల్లో వాటా తీసుకుంటున్నారని దిల్ రాజు పేర్కొన్నారు. ఈ మోడల్ వల్ల నిర్మాతలకు భారం తగ్గి, హీరోలలో కూడా బాధ్యత పెరుగుతుందని ఆయన వివరించారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.